
www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 11 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి పుష్య శుద్ధ సప్తమి
06-12 జనవరి 2025
వెల : ₹20/-



## అటల్‌జీకి శత జయంతి నివాళి



## భారతీయ సంస్కృతీధార కుంభమేళా



## యువతకు కార్యోన్ముఖ పరికల్పన కేంద్రం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



## శివాజీ స్ఫూర్తి కేంద్రం..

# యువతకు కార్యోన్ముఖ పరికల్పనా నిలయం

హిందూ పద పాదషాహిగా ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడైన తర్వాత 1677లో శ్రీశైల క్షేత్రం సందర్శించారు. ఆ సమయంలో ముస్లింల దండయాత్ర పీడ అధికం. అట్టి ప్రతికూల వాతావరణంలో శివాజీ శ్రీశైలం సందర్శించి ధ్యానం చేశారు. భ్రమరాంబికాదేవి ప్రత్యక్షమై హిందువులను రక్షించాల్సిందిగా ఆదేశిస్తూ శివాజీకి ఖడ్గాన్ని బహూకరించింది. శివాజీ 300వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా ప్రముఖ చరిత్రకారులు, వేద గణిత ప్రముఖులు, సామాజికవేత్త మోరో పంత్ పింగళేతో కలిసి 1974లో జాగృతి అనంతర సంపాదకులు రామమోహనరావు శ్రీశైలం విచ్చేశారు. శివాజీ ధ్యాన కేంద్రం శిథిలావస్థలో ఉండడాన్ని గమనించి ఆ స్థానంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించాలని సంకల్పించారు. కన్యాకుమారిలోని శ్రీ వివేకానంద రాక్ మెమోరియల్ తరహాలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించాలని కృతనిశ్చయంతో జి. పుల్లారెడ్డి, భండారు సదాశివరావు, ఎమ్.డి.వై. రామమూర్తి లాంటి విశిష్ట వ్యక్తుల సారధ్యంలో1975లో శివాజీ మెమోరియల్ కమిటీని ఏర్పాటు చేశారు. 1983లో పూజ్య కంచి కామకోటి పీఠాధిపతి పరమాచార్య జగద్గురు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ అనుగ్రహంతో పద్మశ్రీ గ్రహిత గణపతి స్థపతి మార్గదర్శనంలో శివాజీ స్ఫూర్తికేంద్రం నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. స్ఫూర్తి కేంద్రం నిర్మాణానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి వసంత్ దాదా పాటిల్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌కు చెందిన జి. పుల్లారెడ్డి, కర్నూలు నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే టి.జి.వెంకటేష్ వంటివారి సహకారంతో 1994లో శివాజీ స్ఫూర్తి కేంద్రం నిర్మాణమయింది. కేంద్రంలో 12 అడుగుల ఎత్తైన శివాజీ కాంస్య విగ్రహం దర్శనం ఇస్తుంది. ఈ విగ్రహాన్ని ముంబైకు చెందిన శిల్పి రూపొందించారు. ఎందరో ప్రముఖులు, దేశభక్తి పరాయణుల చొరవ, కార్యదక్షుల శ్రమ ఫలితంగా 2004 నాటికి ఒక నిర్దుష్ట రూపం దాల్చింది. 2011లో అన్నదాన భవనం, వసతిగృహ నిర్మాణం పూర్తి కాగా 2018 నాటికి ధ్యాన మందిరాన్ని సైతం పూర్తి చేసుకుని శివాజీ స్ఫూర్తికేంద్రం ఒక స్ఫూర్తిదాయకమైన, పరిశోధనా కేంద్రంగా నిలుస్తూ సామాజిక ప్రయోజనా కార్యకలాపాలను కొనసాగిస్తోంది. శివాజీ మహారాజ్ ఆశయాలపట్ల, జాతీయ ఆశయాల పట్ల యువతకు ప్రేరణ కలిగిస్తోంది. గాంభీర్యం ఉట్టిపడే కట్టడాలతో శివాజీ స్ఫూర్తి కేంద్రం సనాతన శక్తి మంత్రంగా యువతను కార్యోన్ముఖులను చేస్తోంది.

(శ్రీశైలం శివాజీ స్ఫూర్తి కేంద్రానికి 50 ఏళ్లు)






# మరాఠా విప్లవ బావుటా

'ఈ దేశమంతా మొగలుల చేతిలోకి వెళ్లిపోయిందని అనుకున్నప్పుడు ఎవరి అండ లేకుండా శివాజీ ఒంటరిగా నిలబడి స్వరాజ్యాన్ని నిర్మాణం చేశారు. ఆయన ప్రేరణతోనే మేము అమెరికాతో యుద్ధం చేయగలుతున్నాం' అని వియత్నాం విదేశాంగ మంత్రి ఢిల్లీలో చెప్పిన మాటలను శివాజీ స్ఫూర్తి కేంద్రం 50వ వార్షికోత్సవంలో 'జాగృతి' వారపత్రిక పూర్వ సంపాదకులు డాక్టర్ వడ్డి విజయసారథి గుర్తు చేశారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం 50 వార్షికోత్సవం విశాఖపట్నంలో డిసెంబర్ 24, 2024న ఘనంగా జరిగింది. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిన ఎంతో కాలం తర్వాత ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు దక్కాల్సిన గౌరవం లభించిందని డాక్టర్ విజయసారథి తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగానే 1968లో వియత్నాం మంత్రి ఢిల్లీ వచ్చినప్పుడు అన్న పై మాటలను గుర్తు చేశారు. ఆమెకు అధికారులు పలు పర్యాటక కేంద్రాలను చూపించిన తరువాత శివాజీ మహారాజ్‌కు పుష్పాంజలి ఘటించాలని, ఆయన విగ్రహం వద్దకు తీసుకెళ్లమని కోరారు. దీంతో అధికారులు ఎంతగానో శ్రమించి, మహారాష్ట్ర వారు నడుపుతున్న ఓ పాఠశాలలో శివాజీ మహారాజ్ చిన్న ప్రతిమ ఉందని తెలుసుకొని అక్కడికి తీసుకువెళ్లారు. అనంతరం శివాజీ స్మారక సందర్శనం కోసం మీరు ఎందుకు ఇంత పట్టుబట్టారని ఆ మంత్రిని అడిగితే ఆ సమాధానం వచ్చిందని తెలిపారు.

శివాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడై 300 ఏళ్లు పూర్తైన సందర్భంలో అఖిల భారతీయ స్థాయిలో కమిటీ ఏర్పడి పలు కార్యక్రమాలను నిర్వహించామని విజయసారథి వక్కాణించారు. శివాజీ మహారాజ్ తపస్సు చేసి భ్రమరాంబా దేవి ఆశీస్సులు పొందిన శ్రీశైలంలో శివాజీ మందిరం నిర్మాణం చేయాలని నాడు అనంతపురం విభాగ్ ప్రచారక్‌గా పని చేసిన వడ్లమూడి రామ్మోహనరావు తలపోసి, ఆ దిశగా ఎంతో కృషి చేశారని తెలిపారు. ఫలితంగానే 1975లో ఓ కమిటీ ఏర్పడి భవ్యమైన మందిరం రూపకల్పనకు నడుం బిగించిందని విజయసారథి చెప్పారు. ఒక పని ప్రారంభిస్తే, పూర్తయ్యే వరకు అవిశ్రాంతంగా పాటుపడడంలో ఆయన ఆదర్శమని ఈ సందర్భంగా విజయసారథి అన్నారు.

రామ్మోహనరావుతో తన అనుబంధాన్ని విజయసారథి గుర్తు చేసుకున్నారు. రామ్మోహనరావు చదివింది పాలిటెక్నిక్. అయినా చరిత్ర పట్ల ఆయనకు మమకారం ఎక్కువగా ఉండేదన్నారు. రామ్మోహనరావు జాగృతి సంపాదకులుగా తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. జాగృతి పత్రికకు రాయడం గర్వకారణమనే రీతిలో ప్రముఖ రచయితలు భావించే స్థాయికి పత్రికను తీసుకెళ్లారన్నారు. కథ ప్రచురణ కావడం గర్వకారణంగా రచయితలు భావించే స్థాయికి జాగృతిని తీసుకెళ్లిన ఘనత రామ్మోహనరావుకు దక్కుతుందన్నారు.

రామ్మోహనరావుకు కీర్తి కంటే పనిపైనే ఎక్కువ దృష్టి ఉండేదని విజయసారథి తెలిపారు. అందుకే సుదీర్ఘ కాలం సంపాదకునిగా ఉన్నప్పటికీ ఆయన పేరిట వ్యాసం వెలువడేది కాదన్నారు. అయితే, దీపావళి సంచికలో మాత్రం తప్పకుండా ఆయన ముద్ర ఉండేదని తెలిపారు. ఆయనకు ఫోటోగ్రఫీ అంటే ఎంతో మక్కువ అని తెలిపారు. పనికి ముందు ఉండి పేరుకి వెనుక ఉండడం ఎట్లా అనేది రామ్మోహనరావు వ్యక్తిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా నేర్చుకోవచ్చునని తెలిపారు. హిందూ సామ్రాజ్య నిర్మాత శివాజీ మహారాజ్ పేరిట ఆయన స్మారక చిహ్నంగా స్ఫూర్తి కేంద్రం ఏర్పాటులో రామ్మోహనరావు శ్రమ ఎంతో ఉందన్నారు. ప్రస్తుత జాగృతి భవన నిర్మాణంలోనూ రామ్మోహనరావు కీలక పాత్ర పోషించారని అన్నారు. వివేకానంద స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించి ఏకనాథ్ రనడే ఏ విధంగా యావత్ భారతదేశంలో వివేకానంద స్ఫూర్తిని నింపారో అదే విధంగా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించి భారతీయ ప్రజల్లో శివాజీ స్ఫూర్తిని నింపేందుకు రామ్మోహనరావు కృషి చేశారని కొమరగిరి కృష్ణమోహనరావు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా విజయసారథి సభికులకు తెలియజేశారు. సంతులనం, సమన్వయం, నలుగురిని కూడగట్టి ముందుకు సాగే సౌమ్యత ఉండి పరిణతి చెందిన కార్యకర్త మనల్ని వదిలిపెట్టి వెళ్లడం దురదృష్టకరమని, చరిత్రను మలుపు తిప్పాల్సిన ఈ సమయంలో మరెందరో రామ్మోహనరావులు అవసరమైన సమయమిది అని ఆయన నిష్క్రమణ సమయంలో జాగృతి పూర్వ సంపాదకులు తూములూరి లక్ష్మీనారాయణ రాసుకొచ్చిన విషయాన్ని వడ్డి విజయసారథి గుర్తుకు తెచ్చారు. ★



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.3500** **సంవత్సర చందా రూ.750**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

దేశం పట్ల గౌరవం, సమాజం పట్ల జవాబుదారీతనం ఉన్న ఒక వర్గం పత్రికలు, శీర్షికలు నిర్వహించే మేధావులు ప్రస్తావించేవారా పేరు. తరువాత కాంగ్రెస్‌ను దుయ్యబట్టడానికి బీజేపీకి ఆయుధంగా మారినది కూడా ఆ పేరే. చివరికి ఒక గుడిసె మీద పడిన నిప్పు రవ్వ మొత్తం చుట్టబెట్టినట్టు ఇవాళ ఆ పేరు పార్లమెంటులో, మీడియాలో పదే పదే ప్రస్తావించక తప్పని వాతావరణం ఏర్పడింది. 2024 నాటికి భారత రాజకీయాలను శాసించే స్థాయికి, పార్లమెంట్‌ను కుదిపే స్థితికి చేరింది. ఆ పేరే జార్జ్ సోరోస్. ఆ పేరుతో విపక్షాలు దేశ రాజకీయాలను ఇంకాస్త దిగజార్చాయి. సోరోస్ అంటే భారత్ నుంచి భారతీయ మూలాలను పెకలించాలన్న ధ్యేయంతో నిరంతరం కుట్రలు సాగించేవాడు. చిత్రాతిచిత్రమైన అంశం–కోట్లకు పడగలెత్తిన ఈ అమెరికా వ్యాపారవేత్త వేసే బిస్కెట్లకు అర్రులు చాస్తూ, భారత వ్యాపార దిగ్గజం ఆదానిని విమర్శించడం. కాంగ్రెస్‌కీ, దాని తొత్తులకీ అమెరికా పారిశ్రామికవేత్త పూజనీయుడు, భారత పారిశ్రామికవేత్త దోపిడీ దొంగ.

సోరోస్… 94 ఏళ్లు మీదపడి, కాటికి కాళ్లు చాచిన అమెరికా పారిశ్రామికవేత్త. అసలు హంగరీ జాతీయుడు. ఇక్కడి కాంగ్రెస్ తప్ప, ప్రపంచంలో ఏ ఒక్కరు సోరోస్‌ను గౌరవించినట్టు కనిపించదు. మరి అమెరికాలో కూర్చుని, ఈ ముదిమిలోను ఇంత విధ్వంసం ఎలా సృష్టిస్తున్నాడు? ఇతడికి ప్రపంచ వ్యాప్తంగా సంస్థలు ఉన్నాయి. వీటి పనేమిటి? ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామిక ప్రభుత్వాలను పనిగట్టుకుని కూల్చడం. ఇందులో క్రైస్తవ మత వ్యాప్తి కోణం సుస్పష్టం. ఇతడు కుమ్మరించే నిధులలో ఈ పనికే ఎక్కువ వాటా. నకిలీ రైతు ఉద్యమాలు, షాహీన్‌బాగ్ తిష్టలకు అదే పెట్టుబడి. విద్యకు కూడా సాయం చేస్తానని అంటాడు కాని, అది ఐదు శాతం. ప్రభుత్వాల కూల్చివేతకు 35 శాతం. ఏ దేశంలోనైనా వాటి జాతీయ ప్రయోజనాలు నెరవేరకుండా చేయడమే ఆ సంస్థల పని. ఇందుకు ప్రతి దేశంలోను కాంగ్రెస్ వలెనే, విదేశీ మూలాలు, అధికారమే పరమావధిగా ఉండే పార్టీలూ, వ్యక్తులూ ఉన్నారు. ఇక్కడ అలాంటి పాత్ర పోషిస్తున్నవాళ్లుగా సోనియా, రాహుల్, ప్రియాంక వాద్రా ఎనలేని కీర్తి సంపాదించుకున్నారు. సోరోస్ నడిపే ఓసీసీఆర్‌పీ

**శాలివాహన 1946 శ్రీ క్రోధి పుష్య శద్ధ సప్తమి**

## లోపలి పేజీలలో…

ముఖపత్ర కథనం

**భారతీయ సంస్కృతీధార కుంభమేళా**

6లో

ధారావాహిక నవల

**తూర్పు-పడమర**

– గన్నవరపు నరసింహమూర్తి



8

24లో

ప్రత్యేక వ్యాసం

**అమెరికా మీద వివేకానందుని ప్రభావం**



28లో

# జాగృతి

## సంపాదకీయం

(ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్)తో చాలామంది కాంగ్రెస్ నేతలకు, ముఖ్యంగా గాంధీ–నెహ్రూ కుటుంబానికి సంబంధం ఉందని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా బాహాటంగానే ఆరోపించారు. ఈ సంస్థ ప్రథమ కర్తవ్యం ఏమిటంటే, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో వ్యవస్థలలో కల్లోలం సృష్టించడం. ఇవన్నీ పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ మీద బీజేపీ సంధించిన విమర్శనాస్త్రాలని గ్రహించాలి. వీటిని కాంగ్రెస్ పెద్దలు సుస్పష్టంగా ఖండించకపోవడం మరీ విచిత్రం.

## మన మూలాలే మనకి ఆదర్శం

నరేంద్ర మోదీని ప్రధానిని కానివ్వనని శపథం చేసిన మనిషి సోరోస్. ఆ దురద అతడికెందుకు? 2024 ఎన్నికలకు చాలా ముందే సోరోస్ ఆ కుట్రలకు తెరతీశాడు. ఫిబ్రవరి 17, 2023న మ్యూనిచ్‌లో ఏర్పాటు చేసిన భద్రతా గోష్ఠిలో ప్రస్తుత భారత్ ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తానని ప్రతిన పూనాడు. మోదీకి ఆదాని మిత్రుడని ఈ ముసలి పీనుగు కూసింది కూడా ఆ సభలోనే. అన్ని రకాలుగా విఫలమైన సోరోస్ హిండెన్ బర్గ్ నివేదిక ద్వారా భారత్ ఆర్థిక పరిస్థితిని కల్లోల పరచాలని ప్రయత్నించాడు. ఇలాంటి విదేశీ కుట్రదారులను భారతీయులు, భారత రాజకీయ పార్టీలు కలసి కట్టుగా ఎదుర్కొనాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు నిన్న డిసెంబర్‌లోనే పిలుపునిచ్చారు. దీనికి కాంగ్రెస్ ఎడమొహం పెడమొహం పెట్టి సోరోస్ పట్ల తమ ప్రేమానురాగాలను చాటుకుంది. ఉండదా మరి! సోరోస్‌దే, ఓపెన్ సొసైటీ ఫౌండేషన్‌తో సోనియా గాంధీకి సంబంధం ఉంది. ఏం? ఉండకూడదా? అని ప్రశ్నించేవారికి ఒక విన్నపం. కశ్మీర్‌ను స్వతంత్ర దేశంగా చూడడం ఈ సంస్థ ధ్యేయం. దీనిని ఏమనాలి? ఓపెన్ సొసైటీ నిధులతో పనిచేసే ఫోరమ్ డెమాక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్ సంస్థకు సాక్షాత్తు సోనియా కో–ప్రెసిడెంట్. దీనికీ రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కీ బంధం ఉంది. భారత్‌ను ఏకం చేసే పేరుతో విచ్ఛిన్నం చేయడానికి సాగిన భారత్ జోడో యాత్రలో పాల్గొన్న సలీల్ శెట్టి సోరోస్ మనిషి. భారత్‌లో సామాజిక, రాజకీయ కల్లోలం సృష్టించడమే ధ్యేయంగా ఉన్న దుష్టుడితో, అతడి సంస్థలతో సన్నిహితంగా మెలుగుతున్న సంస్థ కాంగ్రెస్.

సోనియాకూ, ఆమె పుత్రరత్నానికీ ఈ దేశం మీద గౌరవం లేదు. ఎదుటివారిని కనీసంగా గౌరవించే సంస్కారం కూడా లేదు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో బీజేపీ ప్రభుత్వం ఏడు రోజులు సంతాపదినాలు ప్రకటించింది. కానీ రాహుల్ విదేశాలలో విహరిస్తూ విలపించదలుచుకున్నాడు కాబోలు. వియత్నాం యాత్రకు వెళ్లిపోయాడు. స్వాతంత్ర్యం కోసం విదేశీయుల మీద పోరాడామని చెప్పుకునే కాంగ్రెస్, స్వతంత్ర భారతదేశంలో ఇంత దేశ వ్యతిరేకతను ఎలా మూటకట్టుకుంటున్నది? ప్రపంచమంతా ఈసడిస్తున్న సోరోస్ వంటివాడి తోక పట్టుకుని ఎన్నికల గోదాను ఈదాలని ఎందుకు అనుకుంటున్నది? శరద్ పవార్, పీఏ సంగ్మా వంటి వారు కాంగ్రెస్‌ను ఎందుకు వీడి వెళ్లారో మనందరికీ గుర్తుంది. అందులో సోనియా విదేశీయతే ప్రధాన పాత్ర పోషించింది. కాంగ్రెస్‌ను వీడి వారేదో సాధించారని కాదు. ఒక గొప్ప సత్యం దేశం ముందు పెట్టారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేలుకోవాలి. మనం మన మూలాల కోసం వెతుకుదాం. ఇంకా విదేశీ గాలాల వెనుక ఎందుకు? కొత్త సంవత్సరంలో అయినా భారతీయ చింతనతో రాజకీయాలు సాగాలని ఆశిద్దాం. ★

06 జనవరి 2025, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




38లో

కథ


**సామాంపాతు సరస్వతీ**

– ఉలి





| | | | | | |
|---|---|---|---|---|---|
| శాంతి మంత్రమే కాదు.. యుద్ధ తంత్రమూ తెలుసు | - | 20 | అవి ఇవి | - | 34 |
| ఆర్థిక 'బాంధవుడు' మన్మోహన్ (నివాళి) | - | 23 | మెరుపుటెత్తుల 'చదరంగ రాణి' హంపి! (క్రీడ) | - | 43 |
| నిజమైన సంక్రాంతి (ప్రత్యేక వ్యాసం) | - | 26 | బాలజాగృతి | - | 46 |
| నిరంతర నిరీక్షణలో కర్షక లోకం (తెలంగాణ) | - | 30 | వారఫలాలు | - | 48 |
| అమ్మభాషకు అందలం (ఆంధ్రప్రదేశ్) | - | 32 | వెండితెర–2024 'మెరుపులు–మరకలు' (సినిమా) | - | 50 |



భారతావని త్రివేణి సంగమ పవిత్రభూమి. చతుర్వేదాల జన్మస్థలి. ధర్మస్వరూపుడు శ్రీరామచంద్రాది మహనీయులు అవతరించిన అవని. గీతామృతాన్ని పంచిన నేల. పుష్కరాలు, కుంభమేళాలతో శోభిల్లే పుణ్యప్రదాయిని. భారతదేశం ధర్మభూమి, కర్మభూమి. ధర్మాచరణ మన సంస్కృతిలో భాగంగా పరంపరగా వస్తోంది. అతి పురాతన ఈ జాతి చరితలో ప్రతిదీ ఆరాధనీయమే. చెట్టుకు మొక్కినా,పుట్టను పూజించినా, శిలను అర్చించినా...ఒకే భావన. అదే ఆధ్యాత్మికం. ఆ అపూర్వ, అపురూప చింతనాధార నుంచి పురుడు పోసుకున్నవే కుంభమేళాలు, పుష్కరాలు. ఇవి దేశంలోని భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలు.ఆరాధన ఏదైనా జలంతో ముడిపడి ఉండడం అనివార్యం. నీటి బిందువు కేవలం దాహార్తి తీరడానికో, ఆహార దిగుబడికో పరిమితం కాక, అనేకానేక రూపాలలో వ్యక్తమయ్యే దైవం ద్రవీభవించి దర్శనం ఇచ్చే వనరుగా ఈ జాతి సంభావిస్తుంది. నీటిని శరీర ప్రక్షాళన కోసమే కాక, ఆత్మ అభ్యంగానికి సాధనంగా, ప్రతిబిందువునూ సర్వాంతర్యామి నెలవుగా పరిగణిస్తుంది.

# భారతీయ సంస్కృ


హిందూ మతంలో కుంభ మేళాకు ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. పురాణయుగంలో ఇది వ్యాప్తి చెందింది. ప్రపంచంలోనే ఎక్కువ మంది యాత్రికులు, భక్తులు హాజరయ్యే ఆధ్యాత్మిక సంబరం. అలనాడు చిన్న ఆధ్యాత్మిక కార్యక్రమంగా ప్రారంభమైన కుంభమేళా కాలక్రమేణ అతిపెద్ద ఉత్సవంలా మారింది. ఆధునిక భారతదేశంలో ఈ పర్వం అపూర్వ స్థాయికి చేరింది. ప్రజలలో నైతిక, ఆధ్యాత్మిక భావనల వృద్ధికి, జాతీయభావన పటిష్టతకు కుంభపర్వం ఉపకరిస్తుందని విజ్ఞులు అంటారు. ఆధ్యాత్మికత, సంప్రదాయాలతో కూడిన ఈ వేడుకల్లో దేశవిదేశీయులు కోట్లాది మంది పాల్గొంటారు.

మధ్యయుగంలో మౌర్య, గుప్త రాజవంశాలు ఈ కుంభమేళాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చాయని చరిత్ర చెబుతోంది. హర్ష చక్రవర్తి కుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌ను సందర్శించి వ్యక్తిగత ఆస్తులను దానం చేసేవాడని, ప్రజలలో ధార్మిక భావన పెంపొందించేందుకు ఈ పర్వానికి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చాడట. సాధారణ శకం 643 ఫిబ్రవరి–ఏప్రిల్ జరిగిన కుంభమేళాలో ఆయన ధార్మిక పరిషత్తు నిర్వహించాడు. ఆయన కాలంలో జరిగిన పరిషత్తులలో అది ఆరవది అని చారిత్రక కథనం. నాటి కుంభమేళాకు దాదాపు రెండున్నర లక్షల మంది పాల్గొన్నారంటూ ఆ మహాపర్వాన్ని



హ్యూయాన్ సాంగ్ (644) ఈ కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ప్రయాగను 'మహత్తర దాన క్షేత్రం'గా అభివర్ణించాడు.

తొమ్మిదో శతాబ్దంలో శంకరభగవత్పాదుల ప్రచారం కారణంగా, కుంభమేళాకు మరింత ప్రాచుర్యం లభించింది. వారి చొరవతోనే కుంభమేళా ప్రస్తుత రూపం సంతరించుకుందని చెబుతారు. ఆదిశంకరులు నాలుగు పీఠాలను, పది సాధు సంప్రదాయాలను స్థాపించారు. ఈ సాధువులంతా కుంభపర్వంలో సమావేశమై సమాలోచనలు జరపాలని, ప్రజలలో సమైక్యాన్ని, ఆధ్యాత్మికతను పెంపొందించాలని ఆదేశించారు. ఆ పరంపరలోనే హిమాలయ గుహలలో తపస్సు చేసుకునే మహాత్ములు, యోగులు, వివిధ సంప్రదాయాల గురువులు, ఆచార్యులు, తమ అనుయాయులకు, సమాజానికి ఆధ్మాత్మిక సందేశాలు ఇవ్వడం అనుశ్రుతంగా వస్తోంది. అన్ని పంథాల, పీఠాల అధిపతులు సమావేశమై గతం గురించి సమీక్షించి, భవిష్యత్ గురించి చర్చించి, తరువాతి కుంభమేళాకు




# త్రిధార కుంభమేళా

ప్రణాళికను రూపొందిస్తారు.

హరికథలు, ధార్మికోపన్యాసాలు ఉంటాయి. పండిత సభలలో శాస్త్రార్ధాలపై చర్చలు జరిగి క్లిష్ట విషయాలకు పరిష్కారం కనిపిస్తుంది. ప్రతి కుంభమేళాలో బృహత్తరమైన విద్వత్ గోష్ఠులు జరుగుతాయి. వివిధ సంప్రదాయాల గురువులు, ఆచార్యులు తమ అనుయాయులకు, సమాజానికి సందేశాలను ఇస్తుంటారు.

## కుంభమేళా ఆవిర్భావం

ప్రపంచంలోని ధార్మిక సమ్మేళనాలలో అగ్రగణ్యం కుంభమేళ. దేశంపై ఎన్ని ఆఘాతాలు వచ్చినా పరంపరగా కొనసాగుతూ వస్తున్న అతి ప్రాచీనం, అతి చైతన్యవంతమైన పర్వదినం. కుంభమేళా భారతీయ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అతి పెద్దది. కుంభమేళా భారతీయులకూ, విదేశీయులకే కాదు... దేవతలకూ పరమపావనమైనది. ఆ సమయంలో పవిత్ర నదుల్లో స్నానం చేయడం ముక్తి, మోక్ష మార్గమని చాలా మంది భక్తులు విశ్వసిస్తారు. కుంభ మేళాలో... ముఖ్యంగా త్రివేణీ సంగమంలో మునక వేసి, పునీతులు కావడానికి దేవతలు కూడా మానవ రూపంలో దిగివస్తారని పురాణ గాథ. కుంభమేళా పవిత్ర స్నానంతో మనస్సు, ఆత్మశుద్ధి అవుతాయని నమ్ముతారు.

వేదకాలం నాటి ఈ కుంభమేళా గురించి శ్రీమద్భాగవతం, మహాభారత, విష్ణు పురాణాలలో ఉంది. కుంభమేళ ఆవిర్భావానికి సంబంధించి గాథ



ప్రకారం... అమృతం కోసం దేవదానవులు మంధర పర్వతం కవ్వం, అనంతనాగం తాడుగా పాలకడలిని మధించారు. ధన్వంతరి భగవానుడు అమృత కుంభంతో ప్రత్యక్షమయ్యాడు. అమృత సేవనంతో శాశ్వతత్వం పొందేందుకు దేవాసురులు పోటీపడ్డారు. సూర్య, చంద్ర, బృహస్పతి సాయంతో ఇంద్ర కుమారుడు జయంతుడు ఆ కుంభాన్ని అందుకొని అక్కడి నుంచి నిష్క్రమించాడు. దానవులు వెంటాడారు. ఆ పారువేటలో జయంతుడు ప్రయాగ, హరిద్వార్, నాసిక్, ఉజ్జయినిలలో సేదదీరాడు. ఇదంతా మొత్తం 12 దినాలు (ఆ సమయాన్ని మానవ ప్రమాణంలో పన్నెండేళ్లుగా పరిగణిస్తారు) జరిగింది. అమృత కుంభ స్పర్శతో ఆయాస్థలాలు విశేష పవిత్రతను పొందాయి.మరో పాఠాంతరం ప్రకారం, దేవతాలు అమృతభాండాన్ని తీసుకువెళు తుండగా,అందులోని అమృతబిందువులు నాలుగు చోట్ల.. (ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, నాసిక్, ఉజ్జయిని) పడి, ఆ ప్రదేశాలు కుంభమేళా నిర్వహించే పవిత్ర స్థలాలుగా మారాయి. ఆ సంఘటనను



గంగా యమున సంగమం

స్మరించుకుంటూ నిర్వహించేదే కుంభమేళా పర్వం. ఆ కాలంలో నదులు అమృత తుల్యమవుతాయని, ఆ సమయంలో ఆయా ప్రాంతాల నదుల్లో స్నానం చేయడం వల్ల ఆత్మశుద్ధి అవుతుందని, పునర్జన్మ చక్రం నుంచి విముక్తి లభిస్తుందని విశ్వాసం. 'ఒక పనిని సామూహికంగా చేపట్టడంలో అనిర్వచనీయం, అగణితమైన శక్తి ఆవిర్భవిస్తుంది. సామూహికంగా మంత్ర పఠనం చేసినప్పుడు వాటి ప్రభావం సహస్రాధికమవుతుంది. కుంభమేళా ఆ కోవకు చెందినదే'అని విజ్ఞులు, ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు.

కుంభమేళా ఐదు రకాలుగా(మహాకుంభమేళా, పూర్ణకుంభమేళా, అర్ధకుంభమేళ, కుంభమేళా, మాఘ్ కుంభ్ మేళా) నిర్దేశిత ప్రదేశాలలో జరుగుతుంది. 1. మహా కుంభమేళా ప్రయాగలో (అలహాబాద్)లో మాత్రమే జరుగుతుంది. ఇది ప్రతి 144 సంవత్స రాలకు లేదా 12 పూర్ణ కుంభమేళాల తర్వాత వస్తుంది. ఈసారి మహాకుంభమేళా సమయాన్ని అధికారికంగా కచ్చితంగా ప్రకటించలేదు. త్వరలో ఉండవచ్చని అంచనా. 2. పూర్ణ కుంభమేళా పన్నెండేళ్లకు ఒకసారి అలహాబాద్, హరిద్వార్, నాసిక్, ఉజ్జయినిలో జరుగుతుంది. 3.అర్ధ కుంభమేళాను ఆరేళ్లకు ఒకసారి హరిద్వార్, అలహాబాద్‌లో నిర్వహిస్తారు. 4. కుంభమేళా ఉజ్జయిని, అలహాబాద్, నాసిక్, హరిద్వార్‌లో జరుగు తుంది. 5. మాఘ్ (కుంభ్) మేళా (మినీకుంభ్)ను సంవత్సరానికి ఒకసారి జనవరి–ఫిబ్రవరిలో 45 రోజుల పాటు అలహాబాద్‌లో మాత్రమే నిర్వహిస్తారు.

కుంభమేళా గ్రహాల స్థానంతో సంబంధం కలిగి ఉంటుంది. ఆయా రాశులలోకి బృహస్పతి, సూర్యచంద్రుల సంచారాన్ని బట్టే కుంభమేళాలు నిర్ధారితమవుతాయి. మాఘమాసంలో బృహస్పతి కుంభరాశిలోకి, సూర్యుడు మేషరాశిలోకి, లేదా సూర్యచంద్రులు కర్కాటకంలోకి ప్రవేశించినప్పుడు కుంభమేళా నిర్వహిస్తారు. దేవగురువు బృహస్పతి వృషభరాశిలో, గ్రహాల రాజు సూర్యుడు మకర రాశిలో ఉన్నప్పుడు ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహిస్తారు. బృహస్పతి,సూర్యుడు సింహరాశిలో ప్రవేశించినప్పుడు నాసిక్‌లో గోదావరి వద్ద, బృహస్పతి సింహరాశిలోకి, సూర్యుడు మేష రాశిలోకి లేదా సూర్యచంద్రులు తులారాశిలో ప్రవేశించి నప్పుడు

### తితిదే ఆలయం

ప్రయాగలో కుంభమేళను పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం అక్కడ శ్రీవారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేస్తోంది. సెక్టర్ ఆరులో దీనిని నెలకొల్పుతున్నారు.

ఉజ్జయినిలో క్షిప్రానది వద్ద కుంభమేళా జరుగుతుంది. సూర్యుడు మేష రాశిలో, బృహస్పతి కుంభ రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్‌లో గంగవద్ద కుంభమేళా నిర్వహిస్తారు.

కుంభపర్వం సమయంలో పవిత్ర జలంలో నక్షత్రాల సంగమం ఉంటుందని, ఈ సమయంలో స్నానాలు చేసిన వారికి చంద్రుడు తదితర గ్రహాల అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. ఆరోగ్యం సహా పుణ్య ప్రయోజనాలు దక్కుతాయని, మకర సంక్రాంతి వేళ చేసే దానధర్మాలతో శుభ ఫలితాలు సిద్ధిస్తాయని చాలా మంది నమ్ముతారు. దానధర్మాలకు పరిమితి అంటూ లేకపోయినా, శక్తిమేరకు చేస్తారు. కశ్మీర్ మహారాజు 99,999 గుర్రాలను, శ్రీహర్షుడు భూములను, పశువులను, రత్నాలు, బంగారం, వెండి దానం చేశాడని గాథలు ఉన్నాయి. నువ్వుల నూనెతో స్నానం చేయడం, నువ్వులతో హోమం చేయడం, నువ్వులు కలిపిన నీరు తాగడం, నువ్వులతో తయారు చేసిన పదార్థాలను తినడం, నువ్వులను దానం చేయడం వల్ల మంచి ఫలితాలు సిద్ధిస్తాయని పురాణవాక్కు.

**తీర్థరాజం ప్రయాగ**

ప్రయాగ 'త్రివేణి సంగమ' పవిత్రభూమిగా వినుతికెక్కింది గంగ, యమున,సరస్వతులు సంగమించే ప్రదేశం ప్రయాగ రాజ్. మొదటి రెండు నదులు

## కుంభమేళా- 2025 ప్రణాళిక


ఈ నెల (జనవరి) 13వ తేదీ పూర్ణమి తిథి నుంచి 26 ఫిబ్రవరి మహాశివరాత్రి వరకు పూర్ణ కుంభమేళా జరుగుతుంది. ఆ ప్రకారం కుంభమేళాలో ముఖ్యమైన తిథులు/తేదీలను విజ్ఞులు నిర్దేశించారు. జనవరి 13న పుష్య పూర్ణిమ, 14న మకర సంక్రాంతి (మొదటిపుణ్య స్నానం), జనవరి 29న మౌని అమావాస్య (రెండో పుణ్య స్నానం), ఫిబ్రవరి 3న వసంత పంచమి (మూడవ పుణ్య స్నానం) 4న అచల సప్తమి, 12న మాఘ పూర్ణిమ, 26న మహాశివరాత్రి (చివరి పుణ్య స్నానం). 29వ తేదీనాటి అమావాస్యను మౌని అమావాస్య అని పిలుస్తారు. ఆ రోజున అతిపెద్ద స్నానోత్సవం జరుగుతుంది. అమావాస్య వేళ చేసే స్నానాలన్నింట్లో దీనిని ఉత్తమమైనదిగా పరిగణిస్తారు. ఆనాడు పూర్వీకులను స్మరించుకుంటూ స్నానమాచరించి, దానం చేయడం వల్ల ప్రతికూల శక్తులన్నీ తొలగిపోతాయని విశ్వాసం.

# నాటి కుంభమేళా ప్రచార వ్యయం రెండు పైసలే!

**క**నీవినీ ఎరుగుని రీతిలో ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా ప్రారంభం కాబోతున్నది. ఇందుకు అయ్యే వ్యయం రూ.7,500 కోట్లు. దాదాపు 40 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేస్తారని అంచనా. ఈ వ్యయం, స్నానాలు చేసిన భక్తులు ఎంత, ఎంతమంది? అవి తెలుసుకోవడం ఆసక్తి కలిగిస్తుంది.

1882లో కుంభమేళా జరిగింది. అప్పుడు 8 లక్షల మంది భక్తులు మౌని అమావాస్యకు స్నానాలు చేశారు. మొత్తం కుంభమేళాలో మౌని అమావాస్యకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అప్పటి దేశ జనాభా 22.5 కోట్లు. ఆనాటి వ్యయం రూ. 20,288. ఇప్పటి లెక్క ప్రకారం దాని విలువ రూ. 3.6 కోట్లు. మళ్లీ 1894లో జరిగినప్పుడు మొత్తం 10 లక్షల మంది పుణ్యసాన్నమాచరించారు. అప్పటి జనాభా 23 కోట్లు. చేసిన వ్యయం రూ. 69,427. ఇప్పటి విలువ మేరకు లెక్కకడితే రూ.10.5 కోట్లు. 1906లో 25 లక్షల మంది భక్తులు హాజరయ్యారు. వ్యయం రూ. 90,000. నేటి విలువ రూ. 13.5 కోట్లు. జనాభా 24 కోట్లు. 1918లో 30 లక్షల మంది వచ్చారు. నాటి జనాభా 25.2 కోట్లు. అప్పటి వ్యయం 1.4 లక్షలు. ఇప్పటి లెక్క ప్రకారం దాని విలువ రూ.16.4 కోట్లు.



లిన్‌లిత్‌గో


మాలవీయ

1942లో కుంభమేళాకు నాటి గవర్నర్ జనరల్ లిన్‌లిత్‌గో వచ్చారు. ఆయన మదన్‌మోహన్ మాలవీయతో కలసి ఈ మహా ఉత్సవాన్ని వీక్షించారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది వచ్చి స్నానాలు చేయడం అతడిని తీవ్ర విభ్రాంతికి గురి చేసిందట. ఈ ఉత్సవం గురించి ప్రచారం చేయడానికి అయిన ఖర్చు ఎంతని గవర్నర్ జనరల్ అడిగాడు. అందుకు మాలవీయ చెప్పిన సమాధానం కేవలం రెండు పైసలని. అదెలా? మనకైనా అంతటి ఆశ్చర్యమూ కలుగుతుంది. అదే గవర్నర్ జనరల్ అడిగాడు. మాలవీయ ఒక పంచాంగం తీసి చూపించారు. ఆరోజుల్లో దాని వెల రెండు పైసలు. ఈ విషయాన్ని చరిత్రకారుడు ప్రొఫెసర్ యోగేశ్వర్ తివారీ వెల్లడించారు. ఆ పంచాంగం చూసుకుని జనం వారంతట వారే వస్తారన్నమాట. అలాగే అక్కడి వచ్చిన వారిని కేవలం గుంపు అని అనలేమని వారంతా భక్తిప్రపత్తులతో వచ్చినవారేనని మాలవీయ గవర్నర్ జనరల్‌కు చెప్పారు.


మనకు భౌతికంగా దర్శనమిస్తే, మూడవది సరస్వతి అంతర్వాహిని. భరతభూమిపై ఒకనాడు గలగలమని ప్రవహించిన ఈ జీవనది కాలక్రమంలో క్షీణించి అంతర్వాహినిగా మారింది. సరస్వతీ తీరంలో కురుక్షేత్రం ఉండగా, దాని సమీపంలోని వినాశన అనే చోట అది అంతర్థానమైందంటారు. మూడు నదులు సంగమించడానికి ముందు గంగానది లోతు కేవల నాలుగు అడుగులే కాగా, యమున లోతు 40 అడుగులు కావడం విశేషం. 'తీర్థరాజం'గా పేరుపొందిన ప్రయాగలో బ్రహ్మదేవుడు తన ప్రాకృష్ట యాగాన్ని నిర్వహించాడని మహాభారతం పేర్కొంటోంది. 'ప్ర' అంటే గొప్పది అని అర్థం. అందువల్ల దీనికి 'ప్రయాగ' లేదా ప్రయాగరాజ్ అనే పేరు వచ్చిందంటారు. ప్రళయ కాలంలో భూమి అంతా సముద్ర జలంతో మునిగిపోయినా ఈ క్షేత్రానికి ఎలాంటి ముప్పు ఉండదట. శ్రీ మహావిష్ణువు వటపత్రశాయి రూపంలో ఇక్కడ ప్రత్యక్షమై ఉంటాడని, సర్వ దేవతలు ఈ తీర్థాన్ని కాపాడుతూ ఉంటారని చెబుతారు. ప్రయాగ కుంభమేళ ప్రపంచ ధార్మికసమ్మేళనానికి తలమానికం పేరొందింది. ఇలా పవిత్ర నదుల సంగమ క్షేత్రంగా భారతీయ సంస్కృతిలో మహోన్నత మైన త్యాగభావనకు స్ఫూర్తి కేంద్రంగా నిలిచింది.

శతాబ్దాల చరిత గల కుంభమేళాలలో గత ఆరు దశాబ్దాల కాలంలో జరిగిన వాటిలో మేటి 1966 నాటి ప్రయాగ్ రాజ్ కుంభమేళ అని, అప్పటి దాకా ఎన్నడూ ఎరుగనంతటి కార్యక్రమని చరిత్ర చెబుతోంది. విశ్వహిందూ పరిషత్ విరాట్ రూపం దాల్చింది. ఆ మహా సంరంభంలో విశ్వహిందూ పరిషత్ మహాసభ, గోహత్య నిషేధ ఉద్యమాన మైలురాళ్లుగా నిలిచాయి. విశ్వహిందూ పరిషత్ విశ్వహిందూ సమ్మేళనం నిర్వహించగా, గోహత్యను నిషేధించాలని పట్టుబడుతూ సాధువులు ఉపవాస


ప్రయాగరాజ్‌లో కుంభమేళా ఏర్పాట్లు

## ప్రతిష్ఠాత్మకంగా కుంభమేళా

'సనాతన ధర్మంలోకెల్లా అతిపెద్ద వేడుక కుంభమేళా. దీనిని ఘనంగా నిర్వహించేదుకు డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకు 20 వేలకు పైగా సన్యాసులు, సంస్థలకు స్థలాలను కేటాయించాం. 13 అఖాడాలు, దండివాడ, ఆచార్య వాడతో పాటు ప్రయాగవాల్ సభ, ఖాక్ చౌక్‌లకు స్థలాలు కేటాయించాం. మిగతా వారికి కూడా త్వరలో స్థలాలు కేటాయిస్తాం. తొలి సారిగా పాంటూన్ వంతెనల సంఖ్య 22 నుంచి 30కి పెరిగింది మేళా ప్రాంతంలో 250, నగరంలో 661 చోట్ల సైనేజ్‌లు ఏర్పాటు చేశాం. గంగానదిలో నీటి ప్రవాహం బాగుండేలా చూస్తున్నాం. గతంతో పోలిస్తే ఈసారి గంగా, యమునా నదుల్లో నీటిమట్టం బాగుంది. ఈ నీరు శుభ్రంగా ఉంది. మురుగునీరు, పరిశ్రమల వ్యర్థాలు నదుల్లోకి చేరకుండా చర్యలు తీసుకుంటున్నాం. బయోరెమిడియేషన్, జియోట్యూబ్ పద్ధతుల ద్వారా నీటిని శుద్ధి చేస్తున్నాం' అని ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివరించారు.



దీక్షబూనారు. 'స్వరాజ్యానంతరం 19 సంవత్సరాలకూ గోహత్యను నిషేధించకపోవడం విచారకరం. హిందువులు అనైక్యంగానూ, అకర్మణ్యులుగానూ ఉన్నారు. అందువల్ల వారి మనోభావాలను ఏ మాత్రం లక్ష్యపెట్టడం లేదు' అని అఖిల భారత గోరక్షా సమ్మేళనంలో పూజ్య గురూజీ ప్రభుత్వ తీరును నిశితంగా విమర్శించారు. 'విశ్వమందలి హిందూ ప్రతి నిధులు,హైందవ గురుజనులు ఈ సమష్టి సమ్మేళనపు ఆజ్ఞానుమతులతో విశ్వహిందూ పరిషత్ ఒక శాశ్వత సంస్థగా వెలుగొందింది. ప్రయాగ కీర్తి సార్థకమైంది. దాని క్షేత్రమహాత్మ్యం ఇనుమడించింది' అని 'జాగృతి' సంపాదకీయం (జనవరి 31,1966) పేర్కొంది. 'హిందూ సమాజమునందలి సమస్త పథీయులు, సమస్త సంప్రదాయ ఆచార్యవర్యులు, గురుజనులు ఒక్కచోట సమావేశమై, తమ జ్ఞాన సర్వస్వమును మథించి హిందూ సమాజమందలి ఏకత్వామృతమును చవి చూపించిన సందర్భం ఇంతకు పూర్వం లేదు. కనుకనే సమ్మేళనంలో ప్రసంగించిన స్వాములొకరు 'ఇంతవరకు సాగుతున్నది స్నానకుంభం... ఇది జ్ఞానకుంభం' అని చమత్కరించడాన్ని సంపాదకీయం గుర్తు చేసింది.

'ప్రపంచంలో మరే దేశంలోనూ ఒక ధార్మిక నిమిత్తంతో ఇంత భారీ సంఖ్యలో ఏకత్రితమైన సందర్భంలేదు' అని కుంభమేళాను సందర్శించిన ఒక విదేశీ ప్రతినిధి బృందం వ్యాఖ్యానించిందని 'జాగృతి' (ఫిబ్రవరి 24,1966) పేర్కొంది. అప్పటి దేశ జనాభా దామాషా ప్రకారం 60 లక్షల మందికి ఏర్పాట్లు జరగగా, 70 లక్షల మంది వచ్చినట్లు నాటి మేళ కమిషనర్ జెడీ శుక్లా ప్రకటించారు.

### భారీ ఏర్పాట్లు

ఈ పూర్ణాకుంభమేళాకు మరో ప్రత్యేకత ఉంది. అయిదు శతాబ్దాల తరువాత అయోధ్య ఆలయంలో రామచంద్రుడు కొలువుదీరిన ఏడాదికే కుంభమేళా రావడం కాకతాళీయం. భవ్యమందిర ప్రారంభ తరహాలోనే ఈ కుంభమేళా నిర్వహణకు ఉత్తర ప్రదేశ్



ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. 40 కోట్ల మందికి పైగా వస్తారని భావిస్తున్న కుంభమేళాకు తగు ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా ప్రాంతాన్ని ఆ ప్రభుత్వం కొత్త జిల్లాగా ప్రకటించింది. కుంభమేళా జిల్లాగా పిలిచే ఇది రాష్ట్రంలో 76వ జిల్లాగా అవతరించింది. కుంభమేళా సజావుగా సాగేందుకు, పరిపాలనా పనులను మెరుగ్గా నిర్వహించడం లక్ష్యంగా ఈ కొత్త జిల్లా ఏర్పాటైంది. భద్రతా చర్యల కింద 50 వేల మంది సిబ్బందిని మోహరిస్తున్నారు. కృత్రిమమేధ (ఏఐ) తో కూడిన 2, 700 సీసీ కెమెరాలతో 24 గంటలూ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. వంద అడుగుల నీటి లోపలి వస్తువులను కూడా గుర్తించే సామర్థ్యం గల జలాంతర (అండర్ వాటర్)డ్రోన్లను వినియోగించ నున్నారు.

ఈ మేళా కోసం రూ. 2100 కోట్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించి, తొలి విడతగా రూ.1050 కోట్లు అందచేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 కోట్లు ఖర్చు చేస్తోంది. యాత్రికుల సౌకర్యంలో భాగంగా అక్కడి రవాణా సంస్థ పెద్ద సంఖ్యలో (ఏడు వేలకు పైగా) బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటోంది. 350 షటిల్ బస్సుల సేవలను రవాణా సంస్థ ప్రారంభించనుంది. వారణాసి రోడ్‌వేస్ 50 ప్రత్యేక కుంభ్ షటిల్ బస్సులను కూడా సిద్ధం చేసింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే ఏడు మార్గాల్లో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను మోహరిస్తామని.. ఇది అత్యవసర పరిస్థితుల్లో సహాయపడుతుందని రవాణా మంత్రి దయాశంకర్ సింగ్ తెలిపారు. ఈ బృందాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రవాణా సంస్థ సాంకేతిక సిబ్బంది ఉంటారు.

**ప్రమాదాలతో అప్రమత్తం**

సుమారు శతాబ్దంన్నర కుంభమేళ చరిత్రలో తొక్కిసలాటతో పాటు గంగా జలం కలుషితం, అంటువ్యాధుల కారణంగా పెద్ద సంఖ్యలో యాత్రికులు చనిపోయారు. పుష్కరాలు, కుంభమేళాల సందర్భంగా అవాంఛనీయ సంఘటలకు ఆస్కారం సహజమే అయినా అప్రమత్తంగా ఉండాలి. గత దుర్ఘటనలను నమూనాగా విశ్లేషించుకుంటే... వాల్డెమార్ హాఫ్‌కిన్ కలరా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినప్పటికీ, బ్రిటీష్ ప్రభుత్వం చాలా కాలం పాటు నిర్బంధ టీకా సూచనలను తిరస్కరించింది. అయితే వెల్లువెత్తిన ప్రజా నిరసనతో దిగివచ్చి, 1945 హరిద్వార్ కుంభమేళాలో నిర్బంధ కలరా టీకాలు వేయాలని ఆదేశించింది. అదీ హరిద్వాంలో పెద్ద సంఖ్యలో యాత్రికులు మరణించడంతో నిర్బంధ టీకా విధానాన్ని తెచ్చింది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు వివిధ కుంభమేళాల సందర్భాలలో ఒక్క హరిద్వార్‌లోనే పెద్ద సంఖ్యలో మరణించారు. 1783 కుంభమేళాలో 20 వేలకు మందికి పైగా, 1879లో కుంభమేళాలో 35,892 మంది, 1885లో 63,457 మంది, 1891లో 1,69,103 మంది, 1897 అర్ధ కుంభమేళాలో 44,208 మంది, 1903 కుంభమేళాలో 47,159 మంది, 1909 అర్ధ కుంభమేళాలో 21,823 మంది,1915 కుంభలో 90,508మంది, 1921 అర్ధకుంభమేళాలో 1,49,667 మంది,1933 అర్ధ కుంభమేళాలో 1915 మంది,1938లో కుంభలో 70,662 మంది, 1945 అర్ధ కుంభమేళాలో 7734 మంది అంటువ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలా పోల్చి చూస్తే స్వపరిపాలనలో ఆ మరణాల శాతం గణనీయంగా తగ్గిందనే చెప్పాలి.

ఇక తొక్కిసలాటకు సంబంధించి రెండు దశాబ్దాల కాలంలో వివరాల ప్రకారం, ఈ శతాబ్దంలో... జూలై 27, 2003 నుంచి అదే ఏడాది సెప్టెంబర్ 7 వరకు జరిగిన నాసిక్ మేళాలో 39 మంది (28 మహిళలు, 11 మంది పురుషులు) చనిపోగా 57 మంది వరకు గాయపడ్డారు. సాధువులు మొదట స్నానం ఆచరించేందుకు వీలుగా దాదాపు ముప్పయ్ వేల మంది భక్తులను రామకుండ్ వెళ్లే రోడ్డులో ఉంచి, బారికేడ్‌లను అడ్డంగా ఉంచారు. ఆ సమయంలో ఒక సాధువు కొన్ని వెండి నాణాలను విసరడంతో తోపులాట తొక్కిసలాటకు దారితీసింది.

ఏప్రిల్ 14, 1986 నాటి తొక్కిసలాటలో దాదాపు నలభై ఏడు మంది చనిపోయారు. హర్ కీ పౌరీకి వెళ్లడానికి పంత్ ద్వీప్ ద్వీపం సమీపంలోని వంతెన దాటే సమయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. పంత్ ద్వీపం వద్ద కొందరు ముందుకు తోసుకురావడంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీ చార్జికి దిగడం ఆ దుర్ఘటనకు కారణమైంది. 2010 హరిద్వార్ కుంభ మేళా తొక్కసలాటలో పది మంది చనిపోయారు. ఫిబ్రవరి 10, 2013న అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటలో కనీసం 36 మంది మరణించారు (26 మంది మహిళలు, 9 మంది పురుషులు, ఎనిమిదేళ్ల బాలిక ఉన్నారు). 39మంది గాయపడ్డారు. రైల్వే స్టేషనులో గల పాద వంతెన కూలిపోవడం తొక్కిసలాటకు కారణమైంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం రైల్వే స్టేషనులో అధికంగా వస్తున్న ప్రజలను అదుపు చేయడానికి రైల్వే పోలీసులు లాఠీలు ఝుళిపించడంతో యాత్రికుల తొక్కిసలాట జరిగింది. అంతకు ముందురోజు తొక్కిసటాలలో కూడా ముగ్గురు ప్రజలు మరొక తొక్కిసలాటలో మరణించారు. మరికాస్త వెనక్కి వెళితే సుమారు 265 ఏళ్ల క్రితం...1760లో శైవ గోసాయిలు, వైష్ణవ బైరాగిలు (సన్యాసులు) మధ్య హింసాత్మక ఘర్షణ చోటుచేసుకొని 18 వేల మంది బైరాగులు హతమయ్యారని భూగోళ శాస్త్రవేత్త కెప్టెన్ ఫ్రాన్సిస్ రేపర్ (1808) కథనం. అయితే ఆ సంఖ్యలో అతిశయం ఉందని, మృతుల సంఖ్య 18 వందలు ఉండవచ్చని చరిత్రకారుడు మైఖేల్ కుక్ అభిప్రాయపడ్డారు. సంఘటన తీవ్రతను నొక్కి చెప్పేందుకు రాపర్ అలా పేర్కొని ఉంటాడని అభిప్రాయపడ్డారు. 1796లో అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా "సాధారణం కంటే ఎక్కువ బలం" కలిగిన సాయుధ విభాగాన్ని మోహరించారని పేర్కొన్నారు.




### కుంభమేళా ఐక్యతకు నిదర్శనం

'విభిన్న ప్రాంతాల వారు పాల్గొనే ప్రయాగ్ రాజ్ కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి చక్కటి నిదర్శనం. ఐక్యతా సందేశాన్ని ఇచ్చే ఈ కుంభ మేళాను ఈసారి ప్రపంచవ్యాప్త భక్తులు డిజిటల్ ద్వారా వీక్షిస్తారు. కుంభమేళాల తొలిసారిగా ఏఐ చాట్ సేవలు వినియోగిస్తున్నాం. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమ సందేశంలో పేర్కొన్నారు.

### ప్రముఖులకు ఆహ్వానాలు


ప్రయాగ్‌రాజ్ కుంభమేళా కోసం అన్ని రాష్ట్రాల గవర్నర్లతో పాటు బీజేపీయేతర పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తోంది. వారికి ఆహ్వాన పత్రాలు అందచేసే నాయకులను కూడా ఎంపిక చేసింది. ఉదాహరణకు రెండు తెలుగురాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులను ఆహ్వానించే బాధ్యతలను ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య, మాజీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్‌కు అప్పగించినట్లు సమాచారం.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

శతజయంతి

# పార్లమెం



మోసగించిన కెరటాలను సైతం క్షమిస్తూ హుందాగా సాగిపోతున్న నౌకను స్ఫురింపచేస్తుంది ఆయన జీవనయానం. తంత్రులు తెగిపోతున్నా సుస్వరాలు వినిపించిన కవితాగానం ఆయన మాట. రాజకీయరంగంలో– భారత రాజకీయ రంగం–మీద ఆయన వ్యక్తిత్వం అరుదైన ఆవిర్భావం. ఆయన దృష్టి మట్టివాసనతో కూడిన పురోగతికి ఆవిష్కారం. భారతీయతకు సుదూరంగా జరిగిపోతున్న నాయకత్వ లక్షణాలను సమ్యక్ పథానికి మలిచే

**అటల్‌జీ**
**డిసెంబర్ 25, 1924**
**ఆగస్ట్ 16, 2018**

సరళీకరణ, పారదర్శకత, వ్యవస్థీకృత సామర్థ్యం వంటి అంశాలకు ఆయన ఇచ్చిన మద్దతు తరువాతి కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావడానికి పునాదిని నిర్మించి ఇచ్చాయి. భారత రాజకీయాల మీద ఆయన ముద్రనే కాదు, రాజనీతిజ్ఞుడిగానే కాదు, వ్యక్తిగా ఆయనను అంచనా వేయడమూ ఒక సవాలే. భారత విదేశాంగ విధానం మీద, దేశానికి అందవలసిన సుపరిపాలన మీద, ఇంకా చెప్పాలంటే హిందీ సాహిత్యం మీద ఆయన విడిచిన ముద్రలను అన్వేషించడం కూడా పెద్ద సవాలు. అందుకే వాజపేయి అంటే ప్లేటో కల్పనలోని 'తత్త్వవేత్త అయిన పాలకుడి'కి ప్రతినిధిగా కనిపిస్తారని జేఎన్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ 'ది సండే గార్డియన్' (డిసెంబర్ 25, 2024)కు రాసిన వ్యాసంలో వ్యాఖ్యానించారు. ఇప్పుడు అంతా అంటున్న సాత్విక అధికారం అనే భావనలో ఆయన రాజకీయ చింతన మూలాలు ఉన్నాయి. సాంస్కృతిక బంధం ఉండాలి, ఆర్థిక ప్రయోజనం ఉండాలి. ఇదే సాత్విక అధికార విధానం. ఆయన ఉపన్యాసాలు, అందులోని పదబంధం ఎంత మధురమో, అంత తీక్షణం కూడా. అవి వెన్నెల ధారలు, అదే సమయంలో అగ్నిధారలు. ఎంత కవితాత్మకమో, అంత సూటిదనం. సమరనాదం, సామరస్య దృష్టి సమపాళ్లలో ప్రదర్శించడం వాజపేయి వాక్కుకే పరిమితం. పాకిస్తాన్ విషపుటాలోచనలను దృష్టిలో ఉంచుకుని ఆయన రాసిన 'మస్తక్ నహీ ఝుకేగా' (తలవంచం) కవిత జాతీయ భద్రత పట్ల ఆయన నిబద్ధతకు అద్దం పడుతుంది. కశ్మీర్ విషయంలో సీమాంతర ఉగ్రవాదానికే కాదు, అంతర్జాతీయ వేదికల ఒత్తిళ్లకు కూడా భారత్ తలొగ్గదని ఈ కవిత ప్రకటించింది. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న నినాదంతో కన్నుమూసిన రాజకీయ గురువు శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయమే ఇందులోని ప్రతి అక్షరంలోను ధ్వనించింది.

అటల్‌జీ సైద్ధాంతిక భూమిక అమోఘమైనది. దానికి సాంస్కృతిక జాతీయవాదం, ఏకాత్మతా మానవతావాదం, విలువలకు కట్టుబడే నిబద్ధత పునాదులు. ఇందులోని నిజాయతీ, దేశభక్తి, నిబిడీకృతమై ఉన్న గాఢ చారిత్రక దృష్టి బీజేపీ ఎడల ఉన్న అంధ వ్యతిరేకతను పటాపంచలు చేశాయి.

ఆధునిక యుగానికి తగ్గట్టు దేశాన్ని తీర్చిదిద్దడం, కొత్త శతాబ్దాల వైపు జాతిని నడిపించడం దేశీయమైన చింతనతోనూ సాధ్యమేనని నిరూపిస్తూ వాజపేయి 11 సార్లు లోక్‌సభకు, రెండు పర్యాయాలు రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజనీతిజ్ఞత, కవితాత్మకత కలబోసిన ఉపన్యాసాలతో 47 ఏళ్లు పార్లమెంటును ఓలలాడించారు. వాజపేయిది వాగ్దేవి నర్తించిన జిహ్వ. హాస్య చతురత, చెణుకులు రాజకీయ ఉపన్యాసాలలో నిషిద్ధం కాదనీ, అవి వక్తృత్వానికి వన్నె తెచ్చేవేననీ భారత నేతలకు తెలియచెప్పిన రసహృదయుడు. మూడు దఫాలు ప్రధానిగా ఎన్నికయ్యారు. ఐదు దశాబ్దాల తరువాత భారత ప్రధాని పీఠం అధిరోహించిన తొలి కాంగ్రెసేతర ప్రధాని వాజపేయి. 24 పార్టీల ఆయన సంకీర్ణం తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం. ప్రధానిగా రెండవ దఫా పదవిని స్వీకరించిన తరువాత పోఖ్రాన్ అణుపరీక్షను (అదే ఆపరేషన్ శక్తి) ధైర్యంగా నిర్వహించారు. అది గొప్పతనం కోసం, కీర్తి కోసం ఆరాటం కాదు. వర్తమాన ప్రపంచంలో మాతృభూమి కోసం ప్రపంచాన్ని ధిక్కరించిన ధీరత్వం. దేశ భద్రతపై జాతి అభిప్రాయంలో ఇదొక విస్ఫోటనం. సెక్యులరిజం అనే దగా నుంచి, ఉదారవాదం అనే వెన్నుపోటు నుంచి జాతిని రక్షించడానికి భారతీయ జనసంఘ్, భారతీయ జనతాపార్టీలు అవిశ్రాంతంగా యుద్ధం చేశాయంటే అందుకు వాజపేయి వంటి

# టులో పాంచజన్యం

ప్రయత్నానికి ఆయనే నాందీ వాచకం. ఆయన పేరే అటల్ బిహారీ వాజపేయి. స్వతంత్ర భారత రాజకీయరంగం మీద ఆయనొక చెరగని సంతకం. భారతదేశానికి పరమవైభవ స్థితి కోసం కాలం కపాలం మీద పాత రాతను చెరిపేసి, కొత్త రాత రాసే ప్రయత్నం చేసిన స్రష్ట వాజపేయి. పాషాణం మీద పల్లవాన్ని వీక్షించిన ఆశావాది అటల్‌జీ. 'నేను ఓటమిని అంగీకరించను/నేను సమరం చేయను' అంటూ కృష్ణతత్వాన్ని జీవితానికి అన్వయించుకున్న కవి నేత.



మడమ తిప్పని సేనానులే కారణం. చిన్న అవకాశంలోను మేరువును అధిరోహించే ప్రయత్నం చేశారాయన. విజయమూ సాధించారు. అయినా దేశంలో రాజకీయం పేరుతో సాగిపోతున్న సర్వ విధ్వంసం గురించి, సకల భ్రష్టత్వం గురించి ఆయన గుండె మండుతూనే ఉండేది. 'ఈ అధికార దాహార్తులను చూసి ఐదు వేల ఏళ్ల మన సంస్కృతి గర్వించాలా? దుఃఖించాలా? స్వార్థం కోసం అంతులేకుండా సాగిపోతున్న ఈ పరుగులో చివరికి మనం స్వాతంత్ర్యాన్నే కోల్పోతాం సుమా!' అని హెచ్చరించారాయన. అందుకే రాజకీయ అనిశ్చితి యుగానికి ఆయన పాలన సమాధానంగా నిలిచింది. 1996లో 13 రోజులకే తన ప్రభుత్వం కూలినప్పుడు, 1998లో 13 మాసాలకే కూల్చినప్పుడు భారత పార్లమెంట్ సాక్షిగా ఆయన ఇచ్చిన ఉపన్యాసాలు చరిత్ర విస్మరించలేనివి. అది తన ఓటమి కాదని, తన పార్టీ వైఫల్యం కాదని విధర్మీయ చింతన, విదేశీ సిద్ధాంతాలు దేశాన్ని ఇంకా మోసగించే ప్రయత్నంలో ఉన్న ఫలితమేనని ఆ రెండు పర్యాయాలు అటల్‌జీ గర్జించారు. ఇంత గొప్ప చరిత్ర ఉన్న దేశంలో, స్వాతంత్ర్య పోరాటం నడిపినట్టు చెప్పుకునే పార్టీ ఇంకాస్త విధ్వంసం చేయాలన్న ఉద్దేశంతోనే జాతీయ భావాల పార్టీని గద్దె దించిందన్న గుట్టును విప్పారు. అంత నిరాశలోను ఆయన ఆశాజ్యోతినే వీక్షించారు. బీజేపీ ఆవిర్భావ వేళ 1980లో ముంబై వేదికగా ఆయన చెప్పిన మాటలు చిరస్మరణీయమని చెప్పక చెప్పారు. చీకటి తొలగిపోతుంది, వేకువ వస్తుంది, కమలం వికసిస్తుంది అన్నారాయన.

రైట్ మ్యాన్ ఇన్ ది రాంగ్ పార్టీ అని ఎంతమంది ఎద్దేవా చేసినా ఆయన కమలం నీడలోనే ఉన్నారు. ఆయన రాజకీయం, ఆయన ప్రజాసేవ, చింతన అన్నీ ఎన్నికల గెలుపోటములతో, పదవీ వైభోగాలతో ముడిపడినవి కానేకాదు. ఒక్క ఓటు కోసం తనవైన విలువలను కాస్త సడలించి ఉంటే, ప్రధానిగా కొనసాగి ఉండేవారు. కానీ చరిత్ర ఒక మహోన్నత నేతకు సంబంధించిన వాక్యాలను కోల్పోయి ఉండేది. అది తెలుసు వాజపేయికి. అందుకే ఆయన తన జీవితం మీద పడే మచ్చ కంటే, పార్టీకి మిగిలే అపకీర్తి కంటే, చరిత్రలో తన పేరు పక్కన చేరే హేళనాత్మక వ్యాఖ్యలకే భయపడ్డారు. అంతరాత్మను అందలం ఎక్కించారు. ఆయన పదవి నుంచి దిగిపోయారు. ఒక్క ఓటుతో ఆయన ప్రభుత్వం కూలిపోయింది. ప్రభుత్వాలను నిలుపుకోవడానికి పార్టీలకు పార్టీలనే చీలుస్తూ ప్రజాస్వామిక హత్యలు యథేచ్ఛగా సాగిన కాలంలో ఇది అపూర్వం.

1996లో బీజేపీ పార్లమెంటులో మెజారిటీ స్థానాలు ఉన్న పార్టీ. ఆ మేరకు రాష్ట్రపతి అవకాశం ఇచ్చారు. అటల్‌జీ ప్రధాని అయ్యారు. కానీ సభలో మెజారిటీ లేదు. తాను రాజీనామా చేస్తున్నానని చెప్పడానికి సభలో దాదాపు 90 నిమిషాలు వాజపేయి చేసిన ప్రసంగం, అప్పటికి పార్లమెంటు సాక్షిగా ఓడిన పార్టీని, దేశ ప్రజల హృదయాలలో ప్రభంజనంలా తాకింది. తరువాత గెలిపించింది. భారత రాజకీయాలను అనిశ్చితిని మరింత అనిశ్చిత స్థితి వైపు శరవేగంగా తీసుకుపోతున్న నాటి వాతావరణాన్ని వాజపేయి దేశ ప్రజల దృష్టికి తెచ్చిన తీరు నభూతో నభవిష్యతి. నాడు కాంగ్రెస్ కూటమిలో 14 పార్టీలు ఉన్నాయి. అవన్నీ ఎన్నికలలో కలసి పోటీ చేసినవి కాదు. పోలింగ్ కేంద్రాలలో కాంగ్రెస్ వ్యతిరేకమే. కానీ పార్లమెంటు ప్రాంగణంలో బీజేపీ వ్యతిరేక అజెండాతో చేతులు కలిపాయి. ఇలాంటి పతనం కాంగ్రెస్, దాని మిత్రులలోనే కనిపిస్తుంది. దీనిని దేశ ప్రజల మనసుకు హత్తుకుపోయేలా చెప్పడంలో వాజపేయి చూపిన ప్రతిభ అనిర్వచ నీయం. అయితే అది ఊకదంపుడు కాదు. ప్రమాదపుటంచులకు చేరుతున్న భారత రాజకీయ దిగుజారుడును అడ్డుకునే ప్రయత్నమనే చెప్పాలి. అది తరువాతి ఎన్నికలలో ప్రతిఫలించింది కూడా. అందుకే పరాజయంలోను అటల్‌జీని నాటి దేశ ప్రజలు ఆకాశమంత ఎత్తులో దర్శించారు. 1996, మే 27,28 తేదీలలో భారత ప్రజానీకం సాక్షాత్తు పార్లమెంటు వేదికగా గీతోపదేశం విన్నది. దేశం ఎప్పటికీ గుర్తుంచుకోదగిన, కుళ్లు రాజకీయాల పట్ల ఒక స్పృహను కలిగించే సందేశం ఆయన వినిపించారు.

## శతజయంతి

‘ప్రజాతీర్పు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉంది. కాంగ్రెస్ బలం సగానికి తగ్గిపోయింది. విభిన్న ప్రదేశాలలో వేర్వేరు పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించాయి. ఇప్పుడు ఆ పార్టీలే కేంద్రంలో తిరిగి కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యాయి. కాంగ్రెస్ కూడా తగుదునమ్మా అంటూ తయారైంది. మిమ్మల్ని ప్రజల తిరస్కరించారు. మమ్మల్ని పూర్తిగా అంగీకరించలేదు. అయితే వేర్వేరుగా పోరాడిన వారు ఇప్పుడు కలసి ప్రజాతీర్పు మా పక్షాన్నే ఉందంటున్నారు. ఇదెక్కడి విచిత్ర తర్కం?’ అని ఆయన వేసిన ప్రశ్న క్షుద్ర రాజకీయ చరిత్రను ఎప్పుడూ నిలదీస్తూ ఉండేదే. లోక్‌సభలో బీజేపీ ఎక్కువ స్థానాలు సాధించిన పార్టీ కాబట్టి ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి ఆహ్వానించారు. మేం విశ్వాస తీర్మానంలో నెగ్గడానికి ప్రయత్నించాం. కానీ కొన్ని పార్టీలు తమ ఓట్లు పోతాయి కాబట్టి సమర్ధించలేమని చెప్పాయి. ఇక్కడే ఒక ప్రశ్న. జాతి ప్రయోజనాలను కూడా త్యజించి ఓట్ల కోసం పాట్లు పడతామా? అని వాజపేయి వేసిన ప్రశ్న ఎప్పటికీ విలువైనదే. దేశంలో ఎక్కువ పార్టీలకు ఇప్పటికీ ఆయన ప్రబోధం తలకెక్కలేదు. 12 శాతం ఉన్న మైనారిటీలు ముస్లింలు. సిక్కులు 2 శాతం ఉన్న మైనారిటీలు. వీరి గురించి మీరెందుకు మాట్లాడరు అని ఆనాడే వాజపేయి నిలదీశారు. ఈ దేశంలో మైనారిటీలు అంటే ముస్లింలు మాత్రమే అనే భావనకు బలం చేకూర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది. 1984లో తాము సిక్కులకు అనుకూలంగా మాట్లాడి నష్టపోయామని వాజపేయి గుర్తు చేశారు.


తన మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌ను ఆ చర్చలోకి లాగినందుకు కూడా వాజపేయి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మీకు ఆర్ఎస్ఎస్‌తో అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. కానీ ఇక్కడ వినిపించిన ఆరోపణలకు అర్థమే లేదని తేల్చి చెప్పారాయన. వాజపేయి సమయస్ఫూర్తికి గీటురాయి వంటి ఒక ఉదంతం అప్పుడే పార్లమెంటులో జరిగింది. అటల్‌జీ దిగిపోతే హెచ్‌డి దేవెగౌడ ప్రధాని కావడం ఖాయం. అయితే ఆయన కూడా ఒక సందర్భంలో ఆర్ఎస్ఎస్ సేవలను శ్లాఘించారని అటల్‌జీ గుర్తు చేశారు. దీనితో కాంగ్రెస్‌లోని సంకీర్ణ పేకమేడ ఎక్కడ కూలిపోతుందోనని అన్ని బీజేపీయేతర పక్షాలు చేసిన అల్లరి జుగుప్సాకరం. అప్పుడే గొడవ చేసిన కమ్యూనిస్టులకు కూడా వాజపేయి కర్రు కాల్చి వాత వేశారు. 1962 చైనా దురాక్రమణ తరువాత జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొనడానికి ప్రథమ ప్రధాని నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను ఆహ్వానించారే కాని, కమ్యూనిస్టులను కాదని గుర్తు చేశారు. అటల్‌జీ కుళ్లు రాజకీయం చేయరు. ఆయన జీవితంలో అలాంటి దాఖలాలు లేవు. కానీ ఆయన సమయం చూసి చేసే ప్రకటనలు విపక్షాల కూసాలు కదిలేవి. తరువాత అదే జరిగింది. ప్రధాని పదవికి రాబోతున్న దేవెగౌడ అత్యవసర పరిస్థితి (1975) వేళ ఆర్ఎస్ఎస్ చేసిన త్యాగాలను శ్లాఘించారన్న మాట ఆనాటి పరిస్థితులలో కాంగ్రెస్ కూటమికి గొడ్డలి పెట్టు. అది పేపర్ క్లిప్పింగ్‌తో సహా చూపడంతో పెద్ద గొడవే రేగింది. దానికి వాజపేయి ముక్తాయింపు, ‘దేవెగౌడ ఆర్ఎస్ఎస్‌ను సరిగా అర్థం చేసుకున్నా’రన్న మాట. అలాగే గణతంత్ర దినోత్సవానికి నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను ఆహ్వానించడం అనే మాట ఉదారవాదిలో వచ్చిన మార్పును, ఇప్పటికీ మారని పిడివాదుల ధోరణినీ ప్రతిబింబించింది. అదీ వాజపేయి మాటలోని పదును, లోతు. చారిత్రకత.

భారతీయ జనసంఘ్‌కు ఒక తాత్వికత ఉంది. దార్శనికత ఉంది. ఆ విషయం నాటి ఆ సంస్థ నాయకుల మాటలలో వెల్లడి అవుతూనే ఉండేది. చాలామంది అనుకుంటున్నట్టు జనసంఘ్ కాంగ్రెస్ ‘దుశ్శాసనానికి’ ప్రతిక్రియగా ఉద్భవించలేదు. భారతీయ జీవన వికాసానికి సంబంధించిన మహత్తర లక్ష్య సాధన కోసం అవతరించింది అని చెప్పారాయన. ఆ సందర్భంలోనే ఆయన చెప్పిన ఒక విలువైన మాట ఉంది. ‘ఈ దేశాన్ని విదేశాల కార్బన్ కాపీగా మార్చడాన్ని జనసంఘ్ వ్యతిరేకిస్తున్నది. విదేశాల అనుభవం నుంచి గ్రహించడానికి మనం వ్యతిరేకులం కాదు. కానీ విదేశాల పూజారులంగా మాత్రం తయారు కావడాన్ని సహించలేం. మన దేశ పరిస్థితులు, భారతీయత గీటురాయిపై విదేశాల అనుభవాలను పరిశీలిస్తాం... వర్తమాన పరిస్థితులను పురస్కరించుకుని భవిష్యత్తును నిర్మించుకొనడం జనసంఘ్ లక్ష్యం’ (జాగృతి, 13.5.1960) అన్నారాయన. జనసంఘ్‌కు కొనసాగింపు బీజేపీ. కానీ కొన్ని సవరణలు ఉన్నాయి. లక్ష్యాలు మాత్రం అవే. నిర్మాణాత్మక దృక్పథం కలిగి ఉన్న ఏ రాజకీయ పక్షమైనా, సామాజిక సంస్థ అయినా ఈ మాటలను గీటురాళ్లుగా తీసుకొనవలసి ఉంటుంది. వాజపేయి తలుచుకోవడం అంటే భారత్‌ను నిర్మాణాత్మకంగా మలిచే కృషిలో, చింతనలో భాగస్వాములం కావడమే. అది ఎప్పటికీ అవసరం.

**- డా. గోపరాజు నారాయణరావు**

# తలవంచలేము

వీగి పోతామేమోగాని
తలవంచలేము
సత్యం సంఘర్షణ శక్తితో
న్యాయ పోరాటం నిరంకుశత్వంతో
చీకటి ఎలుగెత్తి పోటీకి పిలిచింది
అంతిమ కిరణం అస్తమైపోతుంది
నిష్ఠాదీపాన్ని తొణికిపోకుండా..
వజ్రాఘాతమే కానివ్వు
భూకంపమే రానివ్వు



ఇది సరిసమాన యుద్ధం కాదు
మేము శూన్యహస్తులం వారు సన్నద్ధులు
అన్ని రకాల శస్త్రాల నిపుణులు
ఇక పశుత్వం నిర్లజ్జమై ఎగిసినా
మరల మరల పోరాడతాం
అంగదుడు సాగించే దౌత్యంతో
ప్రాణం పణంగా పెట్టి చేస్తాం ప్రతీకారం
సమర్పణ భావం ఇక అప్రస్తుతం
పోటీలో పెట్టేశాం అన్నీ
ఆగలేమిక..
వీగి పోతామేమోగాని తలవంచలేము

మూలం : అటల్ బిహారి వాజపేయి
అను: శ్రీపెరంబుదూరు నారాయణరావు



# జన హృదయనేత

**‘నీ దేశం, నీ సంస్కృతి పట్ల ఎవరైనా అగౌరంగా వ్యవహరిస్తే మీరు ధైర్యంతో, గర్వంగా వాటి గొప్పదనం చెప్పండి. కన్నతల్లిని, జన్మభూమిని గౌరవించని వారితో దేశానికి ఎప్పటికైనా ప్రమాదమే!.’ 1986లో హైదరాబాద్ పాతబస్తీలో శాలిబండ వద్ద సుధా టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభలో అటల్ బిహారీ వాజపేయి అన్నమాటలివి. వాజపేయి శత జయంతి తరుణంలోను ఆ మాటలు దేశ రాజకీయ పరిస్థితులకు సరిగ్గా సరిపోతాయి.**

‘అటల్’ అంటే హిందీలో మొండి, పట్టుదల అని అర్థాలు. ఏదైన సంకల్పం చేస్తే దృఢనిశ్చయంతో పూర్తి చేయడంలో ముందుండే వాజపేయి స్వభావం మొండితనం, పట్టుదల ఆ పేరుకు సరిగ్గా సరిపోతాయి. అయితే ఆ మొండి వ్యక్తే ఎంతో మృదుస్వభావి. ఉదారవాది. మానవతావాది. ఆయన అతివాది కాదు. మితవాది. అజాతశత్రువు.

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో డిసెంబర్ 25, 1924న మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన వాజపేయి 16 ఏళ్ల వయస్సులోనే ఆర్ఎస్ఎస్ స్వయంసేవకుడిగా చురుకుగా వ్యవహరించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమం తమ సొంత ఆస్తిగా భావిస్తూ వందేళ్లుగా కుళ్లు రాజకీయాలు నడుపుతున్న కాంగ్రెస్‌కు వాజపేయి లాంటి ఎందరో స్వయంసేవకుల పోరాటాలు గుర్తుకు రావు. వాజపేయి జర్నలిస్టుగా, కవిగా, రచయితగా, ప్రజాసేవకుడిగా రాణించారు. మొదట జన్‌సంఘ్‌లో క్రియాశీలకంగా పనిచేసి, 1980లో జనసంఘ్ భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందడంతో తొలి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన 1977లో ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించారంటేనే ఆయనకు దేశ సంస్కృతి పట్ల ఎంత అభిమానం ఉండేదో స్పష్టమవుతుంది. దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో జైలుకెళ్లిన ఆయన ధైర్యం కోల్పోకుండా నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారు.

**భావి ప్రధానిగా గుర్తింపు**

జనసంఘ్ తరపున 1957లో బలరాంపూర్ నుండి ఎంపీగా వాజపేయి గెలవడం భారతదేశ రాజకీయాల్లో కీలక మలుపు. వాజ్‌పేయి ప్రసంగాలకు ముగ్ధులైన నాటి ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ “ఈయన ఎప్పటికైనా దేశ ప్రధాని అవుతారనే చెప్పిన మాటలు 1996లో నిజమయినా, దురదృష్టవశాత్తు అది 13 రోజుల ముచ్చటే అయ్యింది. పార్లమెంట్‌లో మెజార్టీ నిరూపించుకోలేకపోయిన వాజపేయి ఎలాంటి బేరసారాలకు పాల్పడకుండా ఎంతో నిజాయతీతో రాజీనామా చేశారు. ఆ సందర్భంగా ఆయన పార్లమెంట్‌లో “పదవి కోసం పాకులాడే తత్వం మాది కాదు. సంఖ్య ఆధారంగా అధికారం ఉండవచ్చు, పోవచ్చు. పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ప్రజాస్వామ్యం ఎప్పటికీ నిలవాలి, వాటి విలువలు వర్ధిల్లాలి....” అంటూ చేసిన ప్రసంగం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచింది.

1998లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మెజార్టీ రావడంతో వాజపేయి రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టినా, జయలలిత రూపంలో మరోసారి ఆటంకాలు రావడంతో ఒక్క ఓటు తేడాతో మెజార్టీ కోల్పోవడంతో మరోసారి 13 నెలలకే ఆ ప్రభుత్వం కూలిపోయింది. మిత్ర పక్షాలతో బీజేపీకి సరిపడడం లేదని అప్పటి ప్రతిపక్షాలు వ్యాఖ్యానిస్తే... “ఏదో ఒకరోజు బీజేపీ సొంతంగా మెజార్టీ సాధించి అనుకున్న లక్ష్యాలను పూర్తిచేస్తుంది...” అని అప్పుడు వాజపేయి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నరేంద్ర మోదీ రూపంలో వాస్తవం కావడం విశేషం. అనంతరం 1999లో వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 300 పైగా స్థానాలు సాధించడంతో ఆయన మూడోసారి ప్రధాని అయ్యారు. ఐదేళ్లు పూర్తిగా పాలించిన కాంగ్రేసేతర మొదటి ప్రధాని ఆయనే. దేశ భవిష్యత్తుకు పునాదిలేస్తూ అనేక కీలక

కార్యక్రమాలు చేపట్టారు.

**పరుగులు పెట్టిన దేశాభివృద్ధి**

వేగవంతమైన సామాజిక మార్పులతో కూడిన అర్థిక అభివృద్ధితోనే దేశ సాధికారత సాధ్యమవుతుందని నమ్మిన వాజపేయి దేశాభివృద్ధిని పరుగులు పెట్టించారు. ఆయన ప్రభుత్వం మౌలిక వసుతులను ఆధునీకరించి, కల్పించడంతో పాటు ఆర్థిక సంస్కరణలో భాగంగా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్స హించారు. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. ఆయన హయాంలో చేపట్టిన 'కనెక్టివిటి ఇండియా' ప్రాజెక్టు దేశానికి మణిహారం.

దేశంలో నాలుగు వైపుల ఉండే నాలుగు మెట్రో నగరాలను అనుసంధానం చేస్తూ, జాతీయ రహదారులను కలుపుతూ 2001లో 'స్వర్ణ చతుర్భుజి' ప్రాజెక్టును చేపట్టారు. దీంతో దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులకు ఊహించని రీతిలో మహర్దశ వచ్చింది. ఇందులో భాగంగా రహదారులను విస్తరించడానికి భూములు సేకరించాల్సిన అవసరం ఉండంతో, పేదల భూములను ప్రభుత్వ కొల్లగొడు తుందనే విమర్శలొచ్చినా, ఆయన వెనకడుగు వేయక, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తూ దీర్ఘ కాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని ముందడుగు వేయడంతో దేశ రూపురేఖలు మారాయి. తాను మాటల మనిషిని కాదు, చేతల మనిషిని అని నిరూపిస్తూ అనతికాలంలోనే 5400 కిమీల మేర రహదారులను అభివృద్ధి చేసిన ఘనత వాజపేయిదే.

గ్రామాల అభివృద్ధి దేశ పురోగతికి సోపానం అని నమ్మిన వాజపేయి 'గ్రామీణ సడక్ యోజన' ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జాతీయ రహదారులకు సమాంతరంగా గ్రామీణ రహదారు లను కూడా వేగవంతంగా అభివృద్ధి చేయడంతో దేశ వ్యాప్తంగా రోడ్డు రవాణా సదుపాయాల్లో నూతన ఒరవడికి నాంది పలికినట్టయ్యింది. రోడ్ల విస్తరణతో పాటు రైలు, విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన వాజ్‌పేయి ప్రభుత్వం ధైర్యవంతంగా ముందుకు సాగింది. ఈ రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి, సంస్కరణలకు, పెట్టుబడుల కోసం అసరమైన విభాగాల్లో ప్రయివేటీకరణకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నించిన సందర్భంలో ప్రధానంగా వామపక్షాల నీడన ఉండే ఉద్యోగ సంఘాల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైన సమయంలో వాజపేయి వ్యూహాత్మంగా వ్యవహరించి ప్రైవేట్ పెట్టుబడులు సంస్థ అభివృద్ధికి మాత్రమేనని, ఉద్యోగులకు నష్టం జరగదనే భరోసా కల్పించారు. దీంతో ఈ రంగాలు కూడా వేగవంతంగా పురోగతి సాధించడంతో రవాణా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చి మౌలిక సదుపాయాల కల్పనలో దేశాభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. దేశంలోని విమానాశ్రయాలు అంతర్జాతీయ విమానాశ్రయాల స్థాయిలో, రైల్వే స్టేషన్లు విమానాశ్ర యాల స్థాయిలో అభివృద్ధి చెందాయి.

ప్రపంచంలో అగ్రరాజ్యాలు ఆధునిక సాంకేతిక తతో దూసుకుపోతున్న దశలో భారత్ కూడా టెక్నాలజీని వినియోగించుకోవాలనే సంకల్పంతో వాజపేయి ప్రభుత్వ రంగ సంస్థల్లో మార్పులు చేర్పులు చేపట్టడంతో దేశ సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. ఇందులో భాగంగా టెలికాం కమ్యూనికేషన్ రంగాల్లో ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించాని సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవ డంతో అవి ప్రగతిపథంలో సాగుతున్నాయి. ఐటీ రంగానికి ప్రోత్సహించేందుకు విదేశీ పెట్టుబడు లను ఆహ్వానించడంతో హైదరాబాద్, బెంగుళూరు, పుణే వంటి నగరాలు ఐటీ రంగంలో దూసుకుపోయి, ఇప్పుడు కోట్లాది యువతకు ఉపాధి కల్పించే స్థితికి చేరుకున్నాయి. అందరికీ చదువు అందాలనే లక్ష్యంతో వాజపేయి ప్రభుత్వం తీసుకొచ్చిన 'సర్వ శిక్ష అభియాన్' పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు వరంగా మారింది.

అటల్ బిహారీ వాజపేయి ప్రజాదరణతో బీజేపీ వేగవంతంగా వృద్ధి చెందుతుందని భావించిన ప్రతిపక్షాలు ఆయనను పార్టీకి దూరం చేసే కుటిల యత్నాలు చేసినా ఆయన తన శైలిలోనే వారికి సమాధానం ఇచ్చారు. 'సరైన వ్యక్తి అయిన అటల్ బీజేపీలో ఉండాల్సిన నేత కాదు' అని ప్రతిపక్షాల వ్యాఖ్యలకు... ఆయన "అధికారం కోసం పార్టీ మారడం, పార్టీ చీల్చడం, కొత్త గ్రూపులు కట్టడం చేయాల్సి వస్తే ఆ అధికారం నాకు వద్దు..." అంటూ ఎంతో సున్నితంగా వారికి జవాబిచ్చి తన నిజాయతీని నిరూపించుకున్నారు. ఆయన సాధారణ ప్రజల కోసం ఎంత తపన పడేవారో ఆయన రాసుకున్న కవితలు తేటతెల్లం చేస్తాయి. "ఓ దేవుడా.. నన్ను సామాన్యుల గొంతు వినలేనంతగా ఎదగనివ్వకు.. నన్ను అంతలా దిగజారనివ్వకు..'' అని కవితా రూపంలో ప్రార్థించారు. మరో సందర్భంలో ఆయన "ఓ దేవుడా నా జీవిత చరమాంకంలో కూడా నిన్ను ప్రార్థించే శక్తి ఇవ్వు" అనే మాటలు ఆయనకు సంప్రదాయాలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం.

భారతీయులు చిరకాలంగా గుర్తుంచుకునేలా, దీర్ఘకాలిక ప్రణాళికలతో దేశాభివృద్ధికి కృషి చేసి, అవినీతి రహిత నిజాయతీ పాలన అందించి దేశ ప్రజల మన్ననలు పొందిన అటల్‌జీని నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యున్నత భారతరత్న పౌరపురస్కారంతో గౌరవించింది. ఆయన జయంతి రోజైన డిసెంబర్ 25వ తేదీని 'సుపరిపాలన దినోత్సవం'గా ప్రకటిం చింది. శతజయంతి సందర్భంగా ఇప్పుడే కాదు, మరో వంద సంవత్సరాలైనా ఆయన దేశాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు ప్రజల మదిలో ఎల్లకాలం నిలిచిపోతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

'వాజపేయి' అంటే అర్థం – మహోన్నతం. యజ్ఞ, యాగాదులకు ప్రాధాన్యమిచ్చే భారతీయ హిందూ సనాతన ధర్మంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన 'సోమయాగం'లో ఏడో ప్రక్రియ 'వాజపేయ' యజ్ఞం. సోమయాగంలో చేసే త్యాగాలను బట్టి ఫలితా లుంటాయి. ఇందులో భాగంగా 'రాజసూయ యాగం' చేసినవారు గొప్ప రాజు అయితే, 'వాజపేయ యాగం' చేసిన వారు సమ్రాట్. ప్రజాస్వామిక యుగం కాబట్టి వాజపేయి మనవరకు అంతే.

– శ్రీపాద



**వాజపేయి ప్రమాణ స్వీకారోత్సవాలు 1996 (13 రోజులు), 1998 (13 నెలలు), 1999 (ఐదేళ్లు)**

# ధరణీతలంతో దౌత్యం

స్వతంత్ర భారత విదేశాంగ విధాన రూపశిల్పిగా ప్రథమ ప్రధాని నెహ్రూ పేరు స్థిరపడి ఉండవచ్చు. కానీ, భారత విదేశ వ్యవహారాలు స్వాతంత్ర్యం పోరాటకాలం నుంచి రూపుదిద్దుకుంటూ వచ్చినవే. మనకు మనమై ఇతర దేశాల మీద మొదటిగా దాడికి దిగకపోవడం అనే విధానం కూడా అందులో భాగమైంది. అందుకే విదేశాంగ విధానం మౌలిక సూత్రాలను నెహ్రూ తరువాత ఎవరూ సమూలంగా మార్చే ప్రయత్నం చేయలేదు. కానీ 1947 తరువాత ప్రపంచం పెనుమార్పులు చూసింది. ఆ క్రమంలోనే మౌలికతకు భంగం కలుగకుండా దేశ ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ విదేశాంగ విధానానికి మార్పులు తీసుకువచ్చిన వారిలో రెండు పేర్లు ప్రధానంగా వినిపిస్తాయి. అవి-జనతా పార్టీ కాలంలో విదేశాంగ మంత్రిగా పనిచేసిన అటల్ బిహారీ వాజపేయి, కాంగ్రెస్ నాయకుడు పీవీ నరసింహారావు.


నవాజ్ షరీఫ్‌తో


షారోన్‌తో


బిల్ క్లింటన్‌తో


పుతిన్‌తో

వాజపేయి జనసంఘ్ కాలం నుంచి విదేశ వ్యవహారాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన నాయకుడు. అందుకే ఆయనకు జనతా పార్టీ ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆ బాధ్యత అప్పగించారు. అటల్ విదేశాంగ మంత్రిగా రెండేళ్లే పనిచేసినా ఆ శాఖకు నవ్యతను తెచ్చారు. ఆయన విదేశ వ్యవహారాలను 1977-79 ఒక దశగాను, 1998-2004 వరకు మరొక దశగాను పరిశీలించవలసి ఉంటుంది.

జనతా పార్టీ హయాంలో ప్రచ్ఛన్న యుద్ధ పీడిత ప్రపంచంలో వాజపేయి విదేశ వ్యవహారాలను నిర్వహించారు. ప్రధానిగా ఏకధ్రువ ప్రపంచంలో విదేశ వ్యవహారాలను రూపొందించారు. ఇక్కడ కీలకం భారత్‌కు అనుకూలంగా ఉన్న సోవియెట్ రష్యా, భారత్‌కు ప్రతికూలంగా ఉండే అమెరికా మరొక వైపు. ఈ పరిస్థితిని గొప్ప దౌత్య ప్రతిభతో వాజపేయి అధిగమించారంటారు విశ్లేషకులు. 1977లో ఇందిర ఓడిపోయారు. ఇది సోవియెట్ రష్యా ఊహించలేదు. కొన్ని రోజులు కమ్యూనిస్టు రష్యా మీడియా ఇందిర ఓటమి వార్తను కూడా నిలిపివేసింది. అవన్నీ ఎలా ఉన్నా సోవియెట్ రష్యాతో సంబంధాలు కొనసాగక తప్పదు. అక్కడే వాజపేయి తన ప్రతిభను చూపారు. అందుకు మొదటి మెట్టుగా వాజపేయి చేసిన పని, కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన రాయబారిని ఐకే గుజ్రాల్‌ను కొనసాగించాలని నిర్ణయించారు. ఆయన పట్ల సోవియెట్ రష్యాకు విశ్వాసం ఉంది. అదే సమయంలో నాటి విదేశాంగ మంత్రి ఆంద్రీ గ్రొమైకోకు భారత్ ఆహ్వానం పలికింది. భారత్‌లో ప్రభుత్వాలు మారినా ప్రజల అంతరంగం ఆనాటిదేనని ఈ విధంగా స్పష్టం చేశారు ఇది సోవియెట్ రష్యాకు పెద్ద ఊరట.

నిజమే, మొదట నెహ్రూ విదేశాంగ విధానాన్నే వాజపేయి అనుసరించారు. అది నాటి అనివార్యత. నెహ్రూ అనుసరించిన 'సైద్ధాంతిక' విదేశాంగ విధానంలో మొదటగా మార్పులు తెచ్చి, ఆచరణశీల దృక్పథంతో వ్యవహరించడం పీవీ నరసింహారావు హయాంలో ప్రారంభమైంది. విదేశాంగ విధానంలో పీవీ పార్టీలకు అతీతంగా అటల్‌బిహారీ వాజపేయి మద్దతు తీసుకున్నారు. పీవీ విదేశాంగ విధానాన్ని కార్యసాధకంగా మలచిన ఘనత అటల్ బిహారీ వాజపేయిదే!

1998 నాటి అణుపరీక్షలు నిర్వహించాలన్న నిర్ణయం, పొరుగుదేశాలతో సన్నిహిత సంబంధాలు నెరపడం, ఫిబ్రవరి 20,1999న పాకిస్తాన్‌తో చారిత్రక లాహోర్ ఒప్పందం, 2003లో చైనా సందర్శన, ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రతినిధుల సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించడం, భారత్-అమెరికా సన్నిహిత సంబంధాలకు కృషి వంటివి సాధారణ పౌరులకు మామూలుగా అనిపించవచ్చు. కానీ ఆయన అనుసరించిన విదేశాంగ విధానం, రాజనీతిలో వ్యూహాత్మకమైన 'వాస్తవిక బహుత్వవాదం' ఇమిడి ఉంది. ఆ విధంగా భారత విదేశాంగ విధానం ఆయన నేతృత్వంలో మరింత పద్ధతిగా, కార్యసాధకంగా రూపొందింది. ఆయన అనుసరించిన విధానం 19వ శతాబ్దంలో గొప్ప యూరోపియన్ వ్యూహకర్తలు ప్రిన్స్ మెటర్నిక్, క్యాస్టలెరిఘాలను గుర్తుకు తెస్తుంది. నిజానికి ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు ఒక గుర్తింపు, ప్రత్యేకత రావడం ప్రారంభమైంది అటల్‌జీ హయాం నుంచే.

**మూడు అంశాలకు ప్రాధాన్యం**

వాజ్‌పేయి తాను అనుసరించే విధానాల్లో ముఖ్యంగా మూడు అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 1. జాతీయ భద్రతను మరింత దృఢతరం చేసేందుకు బలీయమైన జాతీయశక్తిగా దేశాన్ని మలచడం, 2. ప్రాంతీయ, ఉప-ప్రాంతీయ గ్రూపులకు అతీతమైన శక్తిగా మెలుగుతూ ఆర్థికాభివృద్ధి, వ్యూహాత్మక అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం. 3. సాఫ్ట్ పవర్ కార్డును బలమైన రీతిలో ప్రయోగించడం. ఈ మూడు విధానాలను అనుసరించడం ద్వారా నాలుగు ఫలితాలను సాధించడం ఆయన

ప్రధాన లక్ష్యం. అవి 1. జాతీయ భద్రత, హిందూ జాతీయశక్తిని మరింత విస్తరింపజేయడం, 2. పొరుగు దేశాలతో సన్నిహిత సంబంధాలు, ప్రాంతీయ, ఉప-ప్రాంతీయ గ్రూపులతో సన్నిహితంగా మెలుగుతూ దేశ అర్థిక, వ్యూహాత్మక మరియు సామాజికాభివృద్ధి అజెండాను మరింత వేగవంతం చేయడం.

వాస్తవికవాదులు ఎప్పుడూ అధికారాన్ని దేశప్రయోజనాలకు అనుగుణంగానే నిర్వచిస్తారు. దేశాన్ని బలోపేతం చేయడం, విస్తరించడం, శత్రుసంహారం రాజు ప్రధాన బాధ్యత అని చాణక్యుడు అర్థశాస్త్రంలో చెప్పాడు. నిజానికి భారత్, పశ్చిమ దేశాల్లో అధికార భావన అనేది బలీయమైన చోదకశక్తిగా పనిచేస్తోంది. ఇతరుల అభిప్రాయాలను మనకు అనుకూలంగా మలచుకునేలాగా చేయడమే జాతీయశక్తికి నిర్వచనం. వాస్తవికవాదిగా అటల్‌జీ అంతర్జాతీయ సంబంధాలు ఏవిధంగా ఉండాలనే దానిపై ఒక స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్లారు. ఈ శక్తి ప్రభావం రాజ్యం ఇతర దేశాలపై తన పలుకుబడిని వివిధ స్థాయిలో ప్రసరింపజేసి, సానుకూల రాజకీయ ఫలితాలను ఇచ్చింది. ఈ జాతీయశక్తిని వినియోగించుకునే సామర్థ్యం, ఈ శక్తి ప్రభావంపైనే విదేశాంగ విధానంలో సాఫల్య, వైఫల్యాలు ఆధారపడి ఉంటాయి.

మన విదేశాంగ విధానాన్ని వాజపేయి ‘సైద్ధాంతికవాదం’ నుంచి ‘కార్యసాధక దిశ’కు సమూలంగా మళ్లించారు. ఆ విధంగా అత్యంత సాహసంగా వ్యవహరించారనే చెప్పాలి. వాజపేయి అనుసరించిన ‘వాస్తవికత’ను నిజానికి ‘వాస్తవిక బహుత్వవాదం’ అనవచ్చు. ఈ విధానంలో మొత్తం నాలుగు కారకాలుంటాయి. 1. హార్డ్ పవర్ 2. సాఫ్ట్‌పవర్, 3. బహుళ కూటముల్లో కొనసాగడం, 4.ఏ కూటమిని ఏర్పాటు చేయకపోవడం. 2001లో ఒక సందర్భంలో వాజపేయి, ‘నూతన ప్రపంచ క్రమం విజయవంతం కావడమనేది బహుత్వవాద ప్రజాస్వామ్య వ్యవస్థల విజయంపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న మతాంధత, పగ-ద్వేషాలతో కూడిన సైద్ధాంతిక పోకడలను అంతం చేయడానికి ఇది చాలా అవసరం’ అన్నారు.

**తిరుగులేని నిర్ణయం**


1995లో అమెరికా నాయకత్వంలోని దేశాలు అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ)ని ముందుకు తెచ్చాయి. కానీ ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యత్వాన్ని కలిగిన పి-5 దేశాలకు దీన్నుంచి మినహాయింపునిచ్చే ఈ ఒప్పందంపై భారత్ సంతకం చేయడానికి నిరాకరించింది. ఈ నేపథ్యం లో పి-5 దేశాలు ‘సమగ్ర అణు పరీక్షల నిరోధక ఒప్పందాన్ని’ (సీటీబీటీ) ముందుకు తెచ్చాయి. చైనా ఒత్తిడితో దీనిపై ప్రతిదేశం తప్పనిసరిగా సంతకం చేయాలన్న నిబంధన విధించారు. దీన్ని కూడా భారత్ తిరస్కరించింది. ఒకవేళ 1999 నాటికి భారత్ దీనిపై సంతకం చేయకపోతే, యు.ఎన్. విధించే వాణిజ్యపరమైన ఆంక్షలను ఎదుర్కొనక తప్పదని ఆ దేశాలు హెచ్చరించాయి. 1998 నాటికి మనదేశంలో అటల్‌జీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.ఎన్‌పీటీ లేదా సీటీబీటీ ఒప్పందాలు వివక్షతో కూడిన వని మనదేశం నిశ్చితాభిప్రాయం. ఇప్పుడు భారత్ ముందున్నవి రెండే అవకాశాలు. ఒకటి అణ్వస్త్రాన్ని వదులుకోవడం లేదా పొందడం. 1998లో అటల్‌జీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు.

**అణుపరీక్షలు**

1998 మే 11, 13 తేదీల్లో పోఖ్రాన్‌లో మనదేశ రక్షణరంగ శాస్త్రవేత్తలు ఐదు అణ్వస్త్రాలను పరీక్షించారు. వీటిల్లో ఒకటి థర్మో న్యూక్లియర్ ఆయుధం. 1974 అణ్వస్త్ర పరీక్షలు జరిపినప్పుడు భారత్ వీటిని కేవలం శాంతియుత ప్రయోజనాలకే ఉపయోగిస్తామని వాగ్దానం చేసింది. కానీ ఇప్పుడు భారత్ ఆ హామీనుంచి బయటకు వచ్చింది. ఏప్రిల్ 6, 1998న పాకిస్తాన్ ఘోరీ క్షిపణిని ప్రయోగించడమే భారత్ నిర్ణయానికి కారణం. ఆటంబాంబుల తయారీ మన దేశానికి అవసరమని ఆర్ఎస్ఎస్ రెండో సరసంఘచాలక్ పరమ పూజనీయ గురూజీ ఏనాడో చెప్పారు. ఈ అణ్వస్త్ర పరీక్షల ద్వారా వాజపేయి ఆయన కలను నిజంచేసే దిశగా అడుగు ముందుకు వేశారు. అంతేకాదు చైనానుంచి మన దేశానికి వ్యూహాత్మకంగా ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలోనే ఈ అణు పరీక్షలు నిర్వహించక తప్పలేదని ప్రధాని వాజపేయి, నాటి అమెరికా అధ్యక్షు డు బిల్ క్లింటన్‌కు స్పష్టంగా చెప్పారు. ఆవిధంగా భారత్‌ను హార్డ్ పవర్‌గా ప్రపంచానికి వెల్లడిచేస్తూ, రెండో వైపు చైనా, పాక్‌లతో సంబంధాలకు ఆయన కృషిచేశారు. నిజం చెప్పాలంటే వివేచన, నిగ్రహం అనే రెండు అంశాల మధ్య సున్నితమైన సమతుల్యతను సాధిస్తూ తన విదేశాంగ విధానాన్ని నడిపారు. తర్వాత ప్రపంచ దేశాల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకత నేపథ్యంలో, అణ్వస్త్రాన్ని మొదటిసారి ఉపయోగించబోమని, ఇక ముందు అణ్వస్త్ర పరీక్షలు భారత్ నిర్వహించదని ఆయన స్పష్టం చేశారు. ఇదే ఆయన అనుసరించిన వాస్తవికతతో కూడిన వ్యూహాత్మక వ్యవహారశైలి. అంతేకాదు, అణ్వస్త్ర ప్రయోగంపై తగిన నిర్ణయం తీసుకోవడానికి ‘నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజరీ బోర్డును (ఎన్ఎస్ఏబీ)’ని కూడా ఏర్పాటు చేశారు.

**సహనమే ఆయుధం**

1999 కార్గిల్ యుద్ధం సమయంలో అటల్‌జీ ఎంతో సహనాన్ని ప్రదర్శించారు. కార్గిల్ నుంచి పాక్ మూకలు ఖాళీచేయనంతవరకు కాల్పుల విరమణ సాధ్యంకాదని స్పష్టం చేస్తూనే, భారత వైమానిక దళానికి, నియంత్రణరేఖను దాటవద్దని కచ్చితమైన ఆదేశాలిచ్చారు. కార్గిల్ యుద్ధం (1999), 2001లో పార్లమెంట్‌పై ఉగ్రదాడి, ఆగ్రా సదస్సు విఫలం వంటివి జరిగినా పాక్‌తో స్నేహహస్తాన్ని చాచడానికి వెనుకాడలేదు. ఇందుకోసం తెరవెనుక దౌత్యం నడిపిన కారణంగా నవంబర్ 3, 2003న పాకిస్తాన్ నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ప్రతిపాదనను ముందుకు తీసుకురాగా అందుకు భారత్ అంగీకరించింది. అదేవిధంగా 1998లో అణ్వస్త్ర పరీక్షలు జరిపినందుకు చైనా గుర్రుగా వున్నప్పటికీ, 2003లో వాజపేయి ఆ దేశంలో పర్యటించారు. ఆయన పర్యటనకు రెండు ప్రధాన కారణాలు. 1.చైనా ప్రధాన భూభాగంలో టిబెట్ స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతంగా గుర్తించడం, 2. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రతినిధుల



చంద్రశేఖర్, పీవీలతో సరస సంభాషణ


అద్వానితో


అబ్దుల్ కలాంతో


మోదీతో

యంత్రాంగాన్ని ఏర్పాటుచేయడం.

**సాఫ్ట్ పవర్‌గా ఎన్.ఆర్.ఐ.లు**

1990 దశకంలో అమెరికాకు చెందిన ఒక తత్వవేత్త ఎస్.నై జూనియర్ సాఫ్ట్ పవర్ అనే పదాన్ని మొట్టమొదటిసారి ప్రాచుర్యంలోకి తీసుకువచ్చాడు. "ఏదైనా ఒక దేశం తాను కోరుకున్న విధంగా ఇతరదేశాలు పనిచేసేలా చేయడమే" సాఫ్ట్‌పవర్ అని అయన అన్నాడు. అయినా ఇందులో కీలకం ఆర్థిక, సాంస్కృతి ప్రభావమే. వాజపేయి ఉద్దేశంలో ఇతరుల ప్రవర్తనను మూడు పద్ధతుల్లో తనకు అనుకూలంగా మలచుకోవచ్చు. 1.నిర్బంధం లేదా దండన (స్టిక్స్) 2. చెల్లింపులు (తాయిలాలు), 3. ఆకర్షణ (సాఫ్ట్ పవర్). ఇక హార్డ్ పవర్ కేవలం 'దండన' లేదా 'నిర్బంధం' పైనే ఆధారపడుతుంది. శశిథరూర్ మాటల్లో చెప్పాలంటే "సాఫ్ట్‌పవర్‌లేని హార్డ్‌పవర్ వల్ల భావోద్వేగాలు, శత్రువులు పెరుగుతారు. అదే హార్డ్‌పవర్‌లేని సాఫ్ట్‌పవర్‌ను బలహీనతగా చూస్తారు". ఇప్పుడు వాజపేయి తన సాఫ్ట్‌పవర్‌ను ఎంతటి విజ్ఞతతో ప్రయోగించారో పరిశీలిద్దాం. అణు పరీక్షలు జరిపిన తర్వాత అమెరికాతో పాటు మరో 14 దేశాలు మన దేశంతో పాటు పాకిస్తాన్‌పై కూడా ఆంక్షలు విధించాయి. జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా, స్వీడన్, కెనడా, డెన్మార్క్ వంటి దేశాలు ఇందులో ఉన్నాయి. ఫలితంగా ఇతరదేశాలనుంచి పెట్టుబడులు, ఇతరత్రా వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోయాయి. ద్వైపాక్షిక సంబంధాలు కూడా నిలిచిపోవడంతో దేశం ఒక విధంగా ప్రపంచ సమాజంలో 'ఒంటరితనం' అనుభవించింది. కానీ పశ్చిమదేశాల ఆధిపత్య ధోరణికి ఎంతమాత్రం భారత్ తలొగ్గలేదు. ఈ సవాలును స్వీకరించడానికే నిర్ణయించుకుంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ముందుగా భారత్ విదేశాల్లో నివసించే భారతీయులకు (ఎన్ఆర్ఐలకు) 'రీసర్జంట్ ఇండియా బాండ్స్'ను అమ్మడం మొదలుపెట్టింది. వీటి అమ్మకాల ద్వారా 4బిలియన్ యు.ఎస్. డాలర్ల ఆదాయం సమకూరింది. ఫలితంగా 1998 ఏప్రిల్ నాటికంటే 1998 అక్టోబర్‌లో విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరిగాయి. నిజంగా యు.ఎస్. ఆంక్షల నేపథ్యంలో దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా కాపాడిన ఘనత ఎన్.ఆర్.ఐ.లదేనని చెప్పక తప్పదు. ఆపత్కాలంలో అండగా నిలిచినందుకు కృతజ్ఞతగా 'ప్రవాసీ భారతీయ దివస్'ను (పీబీడీ) నిర్వహిస్తామని వాజ్‌పేయి ప్రకటించారు. 2003, జనవరి 9న దీన్ని నిర్వహించారు. అప్పటినుంచి ఏటా ఇదే తేదీన పీబీడీని నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఆవిధంగా ఇండియా విదేశాంగ విధానంలో ఎన్ఆర్ఐలు సాఫ్ట్ పవర్ భాగస్వాములుగా మారారు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ఏదేశానికి వెళ్లినా అక్కడి భారత సంతతి వారితో తప్పని సరిగా సమావేశమ వడం వెనుక ఇంతటి నేపథ్యం ఉంది. అంతేకాదు భారతీయ సాంస్కృతిక, నాగరికత లోని సమున్నతత్వం, ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్పందనశీలక సమాజం... ఇవన్నీ భారత సాఫ్ట్‌పవర్‌లో ముఖ్యమైన భాగాలే. ఆసియా, మధ్యప్రాచ్యం, యూరప్ దేశాల్లో భారత్ పలుకుబడిని మరింత విస్తరించడంలో ఎన్.ఆర్.ఐ.ల పాత్ర విస్మరించలేనిది. 1990 ప్రాంతంలో కేవలం ఆగ్నేయాసియా దేశాల్లో నివసించే భారత సంతతి 6.7 మిలియన్లు. అణు పరీక్షల తర్వాత క్రమంగా అమెరికాతో మనదేశ సంబంధాలను మెరుగుపరచి, నేటి స్థాయికి తీసుకు రావడంలో అక్కడి భారత సంతతి ప్రజల పాత్ర మరువలేనిది! అంతేకాదు ఉగ్రవాదం వల్ల కలుగుతున్న కష్టనష్టాలను ఎదుర్కొనేందుకు వివిధ వర్గాలను ఏకతాటిపై నడపడంలో భారత్ ప్రజాస్వామ్యాన్ని సాఫ్ట్‌పవర్‌గా ఉపయోగిస్తున్నది. కేవలం సాఫ్ట్ పవర్ కారణంగానే భారత్, బహుపాక్షిక ప్రజాస్వామ్య ప్రోత్సాహక సంస్థల్లో సభ్యురాలు కాగలిగింది. ఇందులో 2000లో ఏర్పాటైన 'కమ్యూనిటీ ఆఫ్ డెమోక్రసీ'కి భారత్ వ్యవస్థాపక సభ్యురాలు!

**బహుళ కూటములు-అలీన విధానం**

ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత యు.ఎస్. మాత్రమే సూపర్‌పవర్‌గా మిగిలింది. రష్యా, చైనా, జపాన్, భారత్ వంటి దేశాలు ప్రపంచంలో కీలక దేశాలుగా వున్నప్పటికీ, బలీయమైన బహుళ ధ్రువాత్మక ప్రపంచ క్రమాన్ని ఏర్పరచలేక పోవడానికి ప్రధాన కారణం ప్రపంచానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న అమెరికా! ఈ నేపథ్యంలో భారత్ తెలివిగా అభివృద్ధి చెందిన, వర్ధమాన దేశాలతో వివిధ స్థాయిల్లో సంబంధాలను ఏర్పరచుకొని ఉమ్మడి ప్రయోజనాల సాధన కోసం కృషిచేసింది. ఇందుకోసం భారత్ బహుళకూటమి వ్యూహాన్ని అమలు చేసింది. దీన్నే ప్రస్తుత విదేశాంగ మంత్రి డా॥జయశంకర్ మాటల్లో చెప్పాలంటే "భారత రాజకీయ, వ్యూహాత్మక ఆలోచనలకు అనుగుణంగా భాగస్వామ్య దేశాలు వ్యవహరించేలా చేయడం''. ఈ బహుళకూటమి వ్యూహాన్ని అమలుచేసే ప్రక్రియలో భాగంగా వాజపేయి తరచుగా విదేశీ పర్యటనలు జరిపారు. ఫలితంగా యు.ఎస్, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, జర్మనీ, చైనా, వంటి దేశాలు, యూరోపియన్ యూనియన్, ఐబీఎస్ఏ, ఆసియన్ గ్రూపులతో మన ప్రయోజనాలకు అనుగుణంగా సంబంధాలు ఏర్పడి క్రమంగా బలపడ్డాయి. అణుపరీక్షల తర్వాత 1998 నుంచి 2000 మధ్యకాలంలో నాటి మన విదేశాంగ మంత్రి జస్వంత్ సింగ్ అప్పటి యుఎస్ విదేశాంగ మంత్రి స్ట్రోబ్ టాల్‌బొట్‌తో 9రౌండ్ల సమావేశాలు జరపడం, ఆ దేశంతో సంబంధాలకు వాజపేయి ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యతనిచ్చిందో తెలియజేస్తుంది. 2000 సంవత్సరంలో అప్పటి యు.ఎస్. అధ్యక్షుడు బిల్ క్లింటన్ మనదేశం లో పర్యటించినప్పుడు "ఇండియా రిలేషన్స్: ఎ విజన్ ఫర్ ది ట్వంటీఫస్ట్ సెంచరీ" ఒప్పందంపై పరస్పరం సంతకాలు చేయడం వాజపేయి విదేశాంగ విధానంలో సాధించిన గొప్ప విజయం. రెండు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలన్నది ఈ ఒప్పందం సారాంశం. ఈ ఒప్పందం తర్వాతి కాలంలో యు.ఎస్–ఇండియా ఫైనాన్షియల్ అండ్ ఎకనామిక్ ఫోరమ్, యు.ఎస్–ఇండియా కమర్షియల్ డైలాగ్,



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



యు.ఎస్‌– ఇండియా వర్కింగ్‌ గ్రూప్‌ ఆఫ్‌ ట్రేడ్‌ వంటి పలు యంత్రాంగాలు ఏర్పాటు కావడానికి దోహదం చేసింది. మనదేశంలో క్లింటన్‌ పర్యటన తర్వాత, 2000 సెప్టెంబర్‌లో వాజపేయి అమెరికాలో పర్యటించారు. ఈవిధంగా క్రమంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటం, ద్వైపాక్షిక వాణిజ్యంపై సానుకూల ప్రభావం చూపింది. 2002లో అమెరికాకు భారత్‌ ఎగుమతులు 11.7 బిలియన్‌ డాలర్లకు చేరుకోగా, మనదేశానికి అమెరికా దిగుమతులు 3.7బిలియన్‌గా కొనసాగాయి. 2024 నాటికి ఇరుదేశాల సంబంధాలు రక్షణ, వాణిజ్య, సాంకేతిక పరిజ్ఞాన రంగాలకు విస్తరిం చాయి. తర్వాత యు.ఎస్‌.లో జరిగిన ఎన్నికల్లో జార్జ్‌ బుష్‌ అధికారంలోకి వచ్చారు. ఆయన హయాంలో ఆ దేశ భద్రతా సలహాదారుగా పనిచేసిన కండోలిజా రైస్‌, చైనాను ఎదుర్కోవడంలో భారత్‌ ప్రాధాన్యతను గుర్తించారు. ఇక అ ప్పటినుంచి యు.ఎస్‌.తో మన సంబంధాలు మరింత పటిష్ట మవుతూ వచ్చాయి.

**రష్యా చమురు క్షేత్రంలో వాటా**

ఇక రష్యా విషయానికి వస్తే సుదూర తూర్పు రష్యా ప్రాంతంలోని షకాలిన్‌-1 చమురు, సహజ వాయు క్షేత్రంలో 20% వాటాను పొందడం వాజపేయి ప్రభుత్వ దౌత్యవిజయంగా చెప్పాలి. ఈ క్షేత్రంలో భారత్‌ 17 బిలియన్‌ డాలర్లు పెట్టుబడి పెట్టింది. విదేశాల్లో అతిపెద్ద భారత్‌ పెట్టుబడిగా ఇది నిలిచింది. ఆ విధంగా దేశ ఇంధన భద్రతకోసం వాజపేయి అనుసరించిన వ్యూహాన్నే ఇప్పటికీ చురుగ్గా అనుసరిస్తున్న కారణంగా, ప్రస్తుతం భారత్‌ 20దేశాల్లో ఈ రంగంలో తన ఉనికిని ప్రదర్శిస్తున్నది. 2001లో వాజపేయి-పుతిన్‌ల మధ్య 'మాస్కో డిక్లరేషన్‌'పై సంతకాలు జరిగాయి. ఇది ఇరుదేశాల మధ్య భద్రత వర్తక సంబంధాలను మరింత బలోపేతం కావడానికి దోహదం చేసింది. వాజపేయి హయాంలోనే 2000 సంవత్సరంలో ఈయూ-భారత్‌ సదస్సు జరిగింది. యూరోపియన్‌ దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకోవడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యం. తర్వాతి కాలంలో ఇది వార్షిక సదస్సుగా మారింది. దీని తర్వాత జర్మనీ, ఫ్రాన్స్‌, యు.కె.లతో మన సంబంధాలు మరింత బల పడ్డాయి. పొరుగు దేశాలకు ప్రాధాన్యత విధానానికి వాజపేయి బీజం వేశారు. పి.వి. నరసింహారావు హయాంలో ప్రారంభించిన లుక్‌ ఈస్ట్‌ పాలసీకి వాజ్‌పేయి మరింత మెరుగులు దిద్ది ముందుకు తీసుకెళ్లారు. మొదట్లో ఈ విధానం ఆసియన్‌ దేశాలతో వాణిజ్యం, పెట్టుబడులపై మాత్రమే దృష్టిపెట్టింది. అయితే వాజపేయి దీని నిర్వచనాన్ని మరింత విస్తృతం చేసి ఆస్ట్రేలియా, జపాన్‌, దక్షిణ కొరియాలతో కూడా సంబంధాలను పెంపొందించే దిశగా వ్యూహాన్ని అమలు పరచారు. ఈ నేపథ్యంలోనే 'సీ లైన్‌ ఆఫ్‌ కమ్యూనికేషన్‌' (ఎస్‌ఎల్‌ఓసీ) ఏర్పాటుతో పాటు ఉగ్రవాదాన్ని నిరోధించడంలో పరస్పరం సహకరించుకోవడానికి కూడా ఈ దేశాలు అంగీకారా నికి వచ్చాయి. అంతేకాకుండా 'బే ఆఫ్‌ బెంగాల్‌ ఇనిషియేటివ్‌ ఫర్‌ మల్టీ సెక్టోరల్‌ సైంటిఫిక్‌, టెక్నొలాజికల్‌ అండ్‌ ఎకనామిక్‌ కొఆపరేషన్‌ (బిమ్‌స్టెక్‌), మెకాంగ్‌ గంగా కొఆపరేషన్‌ (ఎంజీసీ) ఏర్పాటుకు వాజపేయి విధానాలే దోహదం చేశాయి. ఎంజీసీలో సభ్యులుగా కంబోడియా, లావోస్‌, మయన్మార్‌, థాయ్‌లాండ్‌, వియత్నాం, భారత్‌లు సభ్యులు! సభ్య దేశాల మధ్య భద్రత ఆర్థిక సహకారం కోసం ఈ గ్రూపు ఏర్పాటైంది.

★

# శాంతి మంత్రమే

**'మేం యుద్ధాన్ని కోరుకోం.. విశ్వశాంతిని కాంక్షిస్తాం..' అన్నారాయన. మరో సందర్భంలో, 'ఓటమిని అంగీకరించను.. పోరుకు వెనుకాడను..కాలం నుదిటిపై పాతను చెరిపేస్తా.. కొత్త రాతను లిఖిస్తా..' అన్నారు.. మాజీ ప్రధాని, దివంగత అటల్‌ బిహారీ వాజపేయి కవితల్లోని ఈ వాక్యాలు ఆయన కార్యదక్షతలోనూ ప్రతిఫలిస్తాయి. అణ్వాయుధ పరీక్షతో అగ్రరాజ్య ఆధిపత్యాన్ని సవాలు చేయడంతో పాటు, పొరుగు దేశానికి శాంతి సందేశాన్ని వినిపించారు. వైఖరిని మార్చుకోకుండా తోక జాడిస్తే కదనరంగంలో ఓడించి బుద్ధి చెప్పారు. భారత్‌కు శాంతి మంత్రమే కాదు, యుద్ధతంత్రం కూడా తెలుసునని చాటి చెప్పారు అటల్‌ బిహారీ వాజపేయి హయాంలో జరిగిన కార్గిల్‌ యుద్ధం ఒక చరిత్రాత్మక ఘట్టం.**

మత ప్రాతిపదికన, భారత్‌ మీద విద్వేషంతో ఏర్పడిన పాకిస్తాన్‌ తన శత్రుత్వాన్ని నిరంతరం ఏదో రూపంలో ప్రదర్శిస్తూనే ఉంటుంది. భారత్‌తో కయ్యానికి కాలుదువ్వి 1947, 1965, 1971 యుద్ధాలకు దిగి ఓడినా బుద్ధి రాలేదు. వెయ్యేళ్ల జిహాద్‌ ప్రకటించుకున్న పాక్‌ పాలకులు మన దేశంతో ప్రత్యక్ష యుద్ధాల్లో గెలవలేక వక్రమార్గాన్ని ఎంచుకున్నారు. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి మన దేశంలోకి పంపడంతో పాటు, సరిహద్దును కబ్జా చేయడం ఇందులో భాగం. మన దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్‌ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలతో దేశ భద్రతను నిర్లక్ష్యం చేసింది. అటు అగ్రదేశాల కనుసన్నల్లో మెలుగుతూ దేశ రక్షణరంగంపై కూడా పెద్దగా దృష్టి పెట్టలేదు. అలాంటి సమయంలో తొలి కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాజపేయి ఆ తప్పిదాలను సరిదిద్దారు. 1998లో రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతం పోఖ్రాన్‌లో అణుపరీక్షలు నిర్వహించారు. మన అణ్వాయుధ పాటవాన్ని చాటి చెప్పారు. అమెరికా బెదిరింపులు, ఆంక్షలకు తలొగ్గకుండా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఆపరేషన్‌ 'శక్తి'పేరుతో మే 11,13 తేదీల్లో జరిపిన పరీక్షలివి. భారత క్షిపణి పితామహుడు అబ్దుల్‌కలాం కీలకపాత్ర పోషించారు. దీనితో అణు సామర్థ్యం కలిగిన ఆరవ దేశంగా భారత్‌ నిలిచింది. ఈ పరిణామంతో పాకిస్తాన్‌ కూడా చైనా నుంచి అరువు తెచ్చుకొన్న పరిజ్ఞానంతో హడావుడిగా అణు పరీక్షలు పరీక్షలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు బిల్‌ క్లింటన్‌ భారత్‌, పాక్‌ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ద్వైపాక్షిక ఒప్పందం చేసుకోవాలని సూచించారు. మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్‌ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్‌, జై కిసాన్‌' నినాదానికి చివరలో.. సైన్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం చాటిచెప్పేలా వాజపేయి 'జై విజ్ఞాన్‌'ను జోడించారు.

**లాహోర్‌ బస్సుయాత్ర**

భారత్‌– పాకిస్తాన్‌ల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నా ఇరు దేశాల ప్రజల మధ్య సామరస్య పూర్వక వాతావరణం ఉండాలని వాజపేయి భావించారు. ఇందులో భాగంగా దేశ విభజన తర్వాత తొలిసారిగా రెండు దేశాల మధ్య ఢిల్లీ-లాహోర్‌ బస్సును ప్రారంభిస్తూ 1999 ఫిబ్రవరిలో వాజపేయి తానూ వెళ్లారు. పాకిస్తాన్‌ నాటి ప్రధాని నవాజ్‌ షరీఫ్‌తో చర్చలు జరిపి లాహోర్‌ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం రెండు దేశాలు మధ్య శాంతి, స్థిరత్వం కోసం, కశ్మీర్‌ కేంద్రంగా ఉన్న అన్ని సమస్యలను శాంతియుత మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలి. అణ్వాయుధాలను ప్రమాదవశాత్తు లేదా అనధికారి కంగా ఉపయోగించడాన్ని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

**బుద్ధి మారని పాక్‌**

ఒకవైపు లాహోర్‌ ఒప్పందం సిరా తడి ఆరకముందే మరోవైపు పాకిస్తాన్‌ తన

# కాదు.. యుద్ధ తంత్రమూ తెలుసు

దుష్టబుద్ధిని బయటపెట్టుకుంది. ఆ దేశ సైనిక దళాల ప్రధాన అధికారి పర్వేజ్ ముషార్రఫ్ సరికొత్త కుట్రకు ప్రణాళికను తయారు చేశారు. దీని లక్ష్యం నేషనల్ హైవే -1ను దిగ్బంధనం చేసి కశ్మీర్, లడఖ్ ప్రాంతాలను విడదీయడం, భారత సైన్యాన్ని సియాచిన్ నుండి వెనక్కి పంపడం, కశ్మీర్ సమస్య అంతర్జాతీయ వేదిక మీదకు తీసుకురావడం. ఈ కుట్రను లాహోర్ శిఖరాగ్ర సమావేశానికి ముందే నవంబర్ 1998 చివరిలో రూపొందించారని బయటపడింది. దీనికి ఆపరేషన్ కోహి-పైమా (కెపి) అనే పేరు పెట్టుకున్నారు. ఈ కుట్ర విజయవంత మైతే కశ్మీర్ విముక్తికర్తగా ప్రధాని షరీఫ్ చరిత్రలో నిలుస్తారని ఆయనలో ఆశలు నింపారు. ఆ ఏడాది పొరపాటు అని నవాజ్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు).

**కార్గిల్ విజయం**

పాకిస్తాన్ కపట వైఖరి ఇరు దేశాల మధ్య నాలుగో యుద్ధానికి దారి తీసింది. చొరబాట్లకు బుద్ధి చెప్పడమే లక్ష్యంగా భారత సైన్యం మే 26న 'ఆపరేషన్ విజయ్' మొదలు పెట్టింది. పెద్ద సంఖ్యల్లో సైనికుల్ని కార్గిల్‌కు తరలించింది. మూడు నెలల పాటు సాగిన ఈ యుద్ధంలో మన సైనికులు వీరోచితంగా పోరాడి టోలోలింగ్ , టైగర్ హిల్స్, బాత్రా టాప్ పర్వతాలను శత్రువుల చెరనుంచి విడిపించారు. ఈ విజయ సాధనలో 527మంది సైనికులు బలిదానం చేశారు. 1,363 మంది గాయపడ్డారు. సైన్యానికి అవసరమైన ప్రపంచానికి మరింతగా తెలిసొచ్చింది.

**వాజపేయి యుద్ధనీతి**

కార్గిల్ పోరు తీవ్రంగా సాగుతున్న సమయంలో ఎయిర్ చీఫ్ మార్షల్ అనిల్ యశ్వంత్ ప్రధాని వాజపేయికి ఫోన్ చేసి.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని శత్రు స్థావరాలను ధ్వంసం చేసేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా కోరారు. అయితే స్వీయ నియంత్రణ పాటించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎల్‌ఓసీని దాటవద్దని చెప్పారు. ఈ నిర్ణయం భారత దౌత్య విజయానికి కీలకమైనదిగా విశ్లేషకులు భావించారు. వాజపేయి యుద్ధనీతిని ఆసియన్ దేశాలు, యూరోపియన్ యూనియన్ దేశాలే కాకుండా అమెరికా, చైనా కూడా స్వాగతించాయి. కార్గిల్



ఆగస్టు-సెప్టెంబర్‌లో సియాచిన్‌పై పాకిస్తాన్-భారత్ చర్చలు ప్రతిష్టంభనతో ముగిశాయి. ఆ తర్వాత అక్టోబర్‌లో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌గా ముషార్రఫ్‌ను ప్రధాని నవాజ్ నియమించారు. తమ కుట్ర అమలులో భాగంగా 1999 మే నెలలో పాకిస్తాన్ సైనికులు, మిలిటెంట్లు కార్గిల్ ప్రాంతాలను ఆక్రమించారు.

ఈ దురాక్రమణ వార్త తెలియగానే ప్రధాని వాజపేయి ఆ దేశ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు ఫోన్ చేశారు. 'మీరు నాతో చాలా దారుణంగా వ్యవహ రించారు. లాహోర్‌లో నన్ను హత్తుకుంటూనే, మీవాళ్లను కార్గిల్ ఆక్రమణ కోసం పంపిచారు..' అన్నారు. అయితే నవాజ్ షరీఫ్ తనకు ఆ విషయం తెలీదని బుకాయించారు. ముషార్రఫ్‌తో మాట్లాడి మళ్లీ ఫోన్ చేస్తానన్నారు. పాకిస్తాన్‌లో ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలకు విలువలేదని, సైన్యం తీసుకునే నిర్ణయాలే కీలకమని మరోసారి నిరూపితమైంది (కార్గిల్ యుద్ధం జరిగిన పాతికేళ్ల తర్వాత ఈ ఏడాది మేలో లాహోర్ ఒప్పందాన్ని ఉల్లంఘించడం పాకిస్తాన్ చేసిన ఆయుధ, ఆహార సరఫరా అందించిన 'టండా టైగర్' దళంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. 150 మంది గాయపడ్డారు. పాక్ సైనికులు దాదాపు 12 వందలకు పైగా మరణించారు.

జూలై 14న ఆపరేషన్ విజయ్ విజయవంత మైందని వాజపేయి ప్రకటించారు. దీంతో పాటు పాకిస్తాన్‌తో చర్చలకు భారత్ షరతులు విధించింది. జూలై 26న యుద్ధం అధికారికంగా ముగిసింది. పాకిస్తాన్ చొరబాటుదారులను పూర్తిగా వెళ్లగొట్టామని భారత సైన్యం ప్రకటించింది. దాదాపు రెండు నెలల 20 రోజుల తర్వాత పాక్ సైన్యం పూర్తిగా వెనక్కి తగ్గింది. దాదాపు 130 స్థావరాలను భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంది.

కార్గిల్ విజయంతో భారత సైన్యం సామర్థ్యం ప్రపంచానికి తెలియడంతో పాటు, ఇరుగుపొరుగు దేశాలకు ఒక హెచ్చరికను కూడా ఇచ్చినట్టయింది. దేశానికి దృఢమైన నాయకత్వం ఉన్నందునే ఈ విజయం సాధ్యమైంది. ఈ యుద్ధంతో అటల్‌జీ ఖ్యాతి యుద్ధం తర్వాత నవాజ్ షరీఫ్‌ను గద్దె దింపాడు ముషార్రఫ్. ఆ తర్వాత తానే దేశ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాడు. రెండేళ్ల తర్వాత 2001లో పర్వేజ్ ముషార్రఫ్ ఆగ్రాలో శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. ఈ శిఖరాగ్ర సదస్సు ఆశించిన ఫలితా లను సాధించలేదు. 'మనం విలువైన వనరులను యుద్ధాలపై వృథా చేస్తున్నాం. యుద్ధం చేయడం తప్పనిసరైతే.. నిరుద్యోగం, వ్యాధులు, పేదరికం, వెనుకబాటుతనంపై చేయాలి..' అంటూ అటల్‌జీ ఒక కవితలో చెప్పారు.




**క్రాంతిదేవ్ మిత్ర**

సీనియర్ జర్నలిస్ట్





ఈ యువకుడు భారతదేశానికి ప్రధాని కాగలడు అంటూ ప్రథమ ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ ఒకానొక సందర్భంలో అటల్ బిహారీ వాజపేయి గురించి ఒక బృందంతో అన్నట్టు చెబుతారు. ఆ నెహ్రూయే మరొక సందర్భంలో వాజపేయి వంటి వ్యక్తులని అక్కడికి అనుమతించడం నాకు నచ్చదు అని కశ్మీర్ విషయంలో లేఖ రాశారు. ఈ విషయం అభిషేక్ చౌధురి రాసిన పుస్తకం 'వాజపేయి: ది ఎసెంట్ ఆఫ్ ది హిందూ రైట్ 1924-1977 అన్న పుస్తకంలో నమోదు చేశారు. దాని గురించి క్లుప్తంగా.

# 'వాజపేయి వంటి వ్యక్తులని అక్కడికి అనుమతించడం నాకు నచ్చదు'

ఆ యువ జనసంఘీయుడు పెద్ద తలనొప్పేమీ కాదని కొద్దికాలం అనుకున్నారు వాజపేయి గురించి నెహ్రూ. కానీ అటల్‌జీ కొన్ని చర్యలు క్షమింపరాని తప్పిదాలుగా నెహ్రూకి కనిపించాయి. వాజపేయి అడపా దడపా జమ్ము సందర్శించేవారు. జమ్ముకు సమీపంలోని కశ్మీర్ లోయ ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. అక్కడితో ఆగేవారు కాదాయన. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న 370 అధికరణాన్ని తొలగించవలసిందిగా భావోద్వేగంతో, కవితాత్మకంగా పార్లమెంటులో విన్నవిస్తూ ఉండేవారు. ఇదంతా చూసి షేక్ అబ్దుల్లా సన్నిహితుడు పీర్ మహమ్మద్ గిలానీ నెహ్రూ కలుసుకుని మరీ ఫిర్యాదు చేశాడు. 1958లో గులాం బక్షీ ప్రభుత్వం ఉండేది. కశ్మీర్‌లో పుట్టి పెరిగిన మమ్మల్ని గులాం బక్షీ ప్రభుత్వం రాష్ట్రంలోకి అనుమతించడం లేదు. కానీ వాజపేయి వంటి యువ జనసంఘీయులని, అభ్యంతరకర ప్రసంగాలు చేయడానికి మాత్రం అనుమతిస్తున్నారు అన్నదే ఆ ఫిర్యాదు సారాంశం. ఇది 1958 ఫిబ్రవరిలో జరిగింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా నెహ్రూ ముఖ్యమంత్రి గులాం మహమ్మద్ బక్షీకి ఒక లేఖాస్త్రం సంధించారు. వాజపేయి అత్యంత అభ్యంతరకరమైన వ్యక్తి అని అందులో వ్యాఖ్యానించారు. అతడు జమ్ముని ఆగమాగం చేయగల సమర్థుడు. దానితో నీవు అనుసరిస్తున్న విధానానికి గండి కొట్టగలడు అని కూడా ఆ లేఖలో హెచ్చరించారు నెహ్రూ. పనిలో పనిగా కేబినెట్ కార్యదర్శి విష్ణు సాహేకు కూడా ఒక లేఖ రాశారాయన. ఆ హిమాలయ రాష్ట్రానికి భవిష్యత్తులో ఈ యువ జనసంఘీయుడిని అనుమతించబోమని మీరు నాకు కచ్చితంగా చెప్పాలి అన్నది ఈ లేఖ సారాంశం. ఆ లేఖలోనే, వాజపేయి వంటి వ్యక్తులను స్వేచ్ఛగా అక్కడికి అనుమతించడం నాకు నచ్చదు అని రాశారు. అయితే ఆ తరువాత కొద్దికాలానికి ఇద్దరి మధ్య వేడి కాస్త చల్లారింది. 1958 ఆగస్టులో అంతర్జాతీయ పరిస్థితి మీద చర్చ జరిగింది. అందులో వాజపేయి మాట్లాడారు. నెహ్రూ అనుసరిస్తున్న విదేశాంగ విధానంగా మొత్తంగా చూస్తే బాగానే ఉంది అని వాజపేయి శ్లాఘించారు. అయితే... తనదైన సహజ శైలిలో... భారత్‌కు నేరుగా ఏమీ పర్యవసానాలు ఎదుర్కొనవలసి అవసరం లేనప్పటికీ కొన్ని అంతర్జాతీయ సంఘటనలలో అనవసరంగా తలదూర్చుతున్నారని ఒక వాత వేశారు. ఈ విమర్శ గురించి ప్రథమ ప్రధాని పట్టించుకోలేదు. ఎందుకంటే నాటికి వాజపేయి తొలిసారి ఎంపీ కావడమే కాదు, పాస్‌పోర్టు కూడా ఆయనకు లేదు. అయితే భారత విదేశాంగ విధానం సరైన మార్గంలో వెళుతున్నదని వ్యాఖ్యానించినందుకు వాజపేయికి నెహ్రూ ధన్యవాదాలు తెలియచేశారు. అలాగే భారతదేశానికి ఎలాంటి లబ్ధి చేకూర్చని విషయాల జోలికి పోకపోవడమే మంచిదన్న మీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నానని కూడా చెప్పారు. తీరా రెండో సంవత్సరంలో ప్రవేశించేసరికి వాజపేయి కాస్త వైఖరి మార్చుకున్నారు. నలుగురు సభ్యులున్న ప్రతిపక్షం జనసంఘ్ నేతగా లోక్‌సభలో ఉండవలసినంత పదునుగా తన ఉపన్యాసాలు ఉండడం లేదని ఆయన అభిప్రాయానికి వచ్చారు. తాను పార్టీ కార్యక్రమాలలో, బహిరంగ సభలలో మాట్లాడినంత తీవ్ర స్థాయిలో మాట్లాడడం లేదని ఆయన అభిప్రాయం. అప్పుడే బాగా ఎదురు చూసిన తరువాత లోక్‌సభలో మాట్లాడే అవకాశం వచ్చింది. అదికూడా నూన్ ఒప్పందం గురించి. భారత భూభాగాన్ని ఇతరులకు ధారాదత్తం చేయడానికి ఏ ఒక్కరికీ భారత రాజ్యాంగం హక్కు ఇవ్వలేదని వాజపేయి అన్నారు. నూన్ ఒప్పందానికి వ్యతిరేకంగా జనసంఘ్ సభ్యులతో పాటు వాజపేయి కూడా అరెస్టు కావడం నెహ్రూకు నచ్చలేదు. అయితే పాకిస్తాన్‌తో సరిహద్దు సమస్య పరిష్కారం కాగలదన్న ఉద్దేశంతో నెహ్రూ బేరుబరి ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు (ఇప్పటి బాంగ్లా) అప్పగించడానికి అంగీకరించాడు. ఇదే నూన్-నెహ్రూ ఒప్పందం. దీని గురించి జనసంఘ్, వాజపేయి నెహ్రూను తీవ్రంగానే విమర్శించాయి.

– జాగృతి డెస్క్

# ఆర్థిక 'బాంధవుడు' మన్మోహన్



స్వతంత్ర భారతదేశ ఆర్థికవ్యవస్థలో 1991 దశకం ప్రథమార్థం అత్యంత క్లిష్టసమయం. కాంగ్రెస్ పార్టీ తరపున అనూహ్య పరిస్థితులలో ప్రధానమంత్రి పీఠం అధిష్టించిన పీవీ నరసింహారావుకు అది అగ్నిపరీక్ష కాలం. దేశంలోని బంగారం తాకట్టులోకి వెళ్లి కుదేలైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం అంత సులువైన పని కాదు. అప్పటికే రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా ప్రతిభ కనబరచిన మన్మోహన్ సింగ్‌ను తమ జట్టులోకి తీసుకుని విత్త శాఖను అప్పగించారు. 'కరవుకాటకాలతో అల్లాడే కుగ్రామంతో, బీద కుటుంబంలో పుట్టి, ఉపకార వేతనాలతో చదివిన నాకు ఈ దేశం అతి ముఖ్యమైన బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దానిని నిలుపుకుంటూ అంకిత భావంతో సేవలు అందించేందుకు ప్రయత్నిస్తానని మాటిస్తున్నాను' అని కేంద్ర ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ (జూలై 24,1991) చేసిన విన్నపం, ఆయన తీసుకు వచ్చిన ఆర్థిక సంస్కరణలలో ప్రతిఫలించాయి.

దేశ జీడీపీ వృద్ధిరేటు 1.1 శాతంతో, విదేశీ మారక ద్రవ్యం 83 కోట్ల డాలర్లకు పరిమితమై ఆర్థిక సంక్షోభం పడగలెత్తిన వేళ పీవీ రాజనీతిజ్ఞత, మన్మోహన్ మేధస్సు జమిలిగా దేశాన్ని ఆర్థిక ఇక్కట్లను నుంచి గట్టెక్కించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ రుగ్మతకు సంస్క రణల శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, ప్రతిపక్షాల మన్ననలనూ అందుకొన్నారు. ఆ సంస్కరణలతో ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది. వాటిని వడిసిపట్టుకున్న ప్రస్తుత నరేంద్రమోదీ ప్రభుత్వం విదేశ మారక ద్రవ్య నిల్వలను 65 వేల కోట్ల డాలర్లను దాటించింది. 3.9 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో దేశం ప్రపంచంలో అయిదవ ఆర్థికశక్తిగా పరుగులు తీయిస్తోంది. మన్మోహన్ సేవలను స్మరించుకుంటూ ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేసిన ప్రత్యేక సందేశంలో... 'అంతులేని లేమితో జీవితమే పోరాటంగా మారిన స్థితి నుంచి అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చ నేందుకు మన్మోహన్ సింగ్ జీవితం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. దేశ విభజన అనంతరం స్వగ్రామంలోనే సర్వస్వం వదిలేసి భారత్ చేరిన ఆయన తమ జీవిత ప్రస్థానంలో అనేక/ అసంఖ్యాక విజయాలు సాధించడం అసామాన్య అంశం. దేశం అత్యంత క్లిష్ట పరిస్థితులలో ఉన్న కాలంలో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, పీవీ నరసింహారావు మంత్రి వర్గంలో ఆర్థిక మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థను నవ్య పథంలోకి తీసుకెళ్లారు' అని నివాళులు అర్పించారు.

ఇక గురుశిష్యులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లను 'ఆకస్మిక,యాదృచ్ఛిక' ప్రధాన మంత్రులుగా విశ్లేషించే వారు అదే సమయంలో వారు ప్రతిభా సంపత్తితో ఎదిగిన తీరును అంగీకరి స్తారు. మన్మోహన్ పదేళ్ల ప్రధాన మంత్రి హోదాలో పార్టీ అధిష్ఠానం అదుపాజ్ఞలలో పాలన సాగించారనే వ్యాఖ్యలు ఎదుర్కొన్నా, వ్యక్తిగత ప్రయోజనాలు/స్వార్థం కోసం పాకులాడలేదు. తన రాజకీయ పరిమితులు తెలిసి, తన పరిధిలోనే పనిచేశారు తప్ప వివాదాలకు పోలేదు. జాతి శ్రేయస్సుకు అవసరమైన లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చారే కాని అవినీతి మకిలి అంటేలా స్వార్థ రాజకీయ నేతల జాబితాలో చేరలేదు. 1999 లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ పడినప్పుడు (ఆ ఎన్నికలలో పరాజితులయ్యారు) ఎన్నికల ఖర్చుకోసం పరిచయస్థుల వద్ద అప్పు చేయడమే ఆయన నిజాయతీ,నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనమని విపక్ష నేతలు సయితం అంగీకరిస్తారు. ఆయన నిజాయతీని, చిత్తశుద్ధిని అనుమానించేందుకు వీలులేక పోయినప్పటికీ యూపీఏ రెండవ ప్రభుత్వంలో కొందరు సహచర మంత్రులపై పోటెత్తిన అవినీతి ఆరోపణలకు ప్రభుత్వాధినేతగా వాటిని కాయక తప్పని పరిస్థితి. అయినా ప్రధాన మంత్రిగా సాధించిన కొన్ని విజయాలు ఆయన ఘనతను పెంచాయి. 1990 దశకం ఉత్తరార్థంలో అణ్వస్త్ర పరీక్షలతో దూరం జరిగిన దేశాలకు స్నేహహస్తం అందించారు.


మన్మోహన్ జీవన నేపథ్యాన్ని పరిశీలిస్తే, దేశ ద్వితీయ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి స్ఫురణకు వస్తారు.ఆయనలానే నిరాడంబరుడు, ప్రచారానికి విముఖుడు. ప్రజాసేవకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నదే వారి భావన. కీలక ఇండో–అమెరికా అణు ఒప్పందానికి మన్మోహన్ ప్రధాన కారకుడైనా ఎలాంటి ప్రచారం కోరుకోలేదు. 'నా కంటే గొప్ప విజయాలు సాధించిన వారు ఎందరో ఉన్నారు' అంటూ తనకు ప్రకటించిన పురస్కారాన్ని (ఇండియన్ ఆఫ్ ది ఇయర్) ఇంటి వద్దే స్వీకరించారని నిర్వాహకులు చెప్పడం గమనార్హం.

భారత్ క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు పీవీ రాజకీయ చాణక్యం, మన్మోహన్ మేధాశక్తి తోడైందని ఆ సొంత పార్టీలోనే అత్యధికులు అంగీకరిస్తారు కానీ మరణానంతరం దక్కిన గౌరవంలో ఇద్దరిమధ్య వ్యత్యాసం కనిపి స్తుంది. డిసెంబర్ 26న కన్నుమూసిన మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించేందుకు తెలంగాణ శాసనసభ 30న ప్రత్యేకంగా సమావేశమైంది. ఆయనకు 'భారతరత్న' ప్రదానం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించగా, బీజేపీ సహా అన్ని పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయం. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం (డిసెంబర్ 23, 2004)లో కన్నుమూసిన పీవీ అంతిమ సంస్కారం నిర్వహణలో ఆయన పార్టీ అధిష్ఠానం, నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి, హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరిగిన తీరును ప్రత్యేకంగా ప్రస్తావించనవసరంలేదు. అంతిమ యాత్రకు ఆయన భౌతిక కాయాన్ని బలవంతంగా స్వరాష్ట్రానికి తరలించినట్లు, మోదీ ప్రభుత్వం మన్మోహన్ విషయంలో అనుసరించక దేశ రాజధాని లోనే అధికార లాంఛనాలతో నిర్వహించింది.

– జాగృతి డెస్క్




**ఆ తరువాత సంక్రాంతి వచ్చి వెళ్లిపోయింది. పూర్వంలా సరదాలేదు. ఏదో వచ్చాము... ఉన్నాము అన్నట్లు గడిచింది... పూర్వం పెద్ద పండగ అంటే ప్రతీ ఇల్లు కళకళలాడేది... ఊరంతా పెళ్లి వాతావరణం ఉండేది.... పేకాటలు, ఏట్లో స్నానాలు, భోగి మంటలు, ఆటలు, పిండి వంటలు ఇలా ఆనందంగా గడిచేది. పండుగ తరువాత ఊరు విడిచి వెళ్ల బుద్ధి అయ్యేది కాదు... హరిదాసులు, గంగిరెద్దుల వాళ్లు, ఇంటి ముందర రథం ముగ్గులు, మంచులో తడిసిన కనకాంబరాలు, చామంతులు... ఇలా ఎన్నో అనుభూతుల్ని సంక్రాంతి మూట కట్టుకొని వచ్చేది... ఇప్పుడవన్నీ ఏవి?**



"ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహాలు" అనీ శ్రీశ్రీ చెప్పినట్లు "ఏవి తల్లీ ఆ సంక్రాంతి శోభలు" అని అడగాలనిపిస్తోంది..

సంక్రాంతి తరువాత భారమైన గుండెతో కాలేజీకి వెళ్లిపోయాను.

కాలేజీలో రోజులు భారంగా గడుస్తున్నాయి... కానీ రాను రాను నాకు మా సివిల్ ఇంజనీరింగ్ అంటే ఇష్టం ఏర్పడసాగింది. థాంక్స్ టు మై లెక్చరర్స్... వాళ్లు ఎంతో విజ్ఞానదాయకంగా ప్రతీ పాఠాన్ని బోధిస్తున్నారు. ఆ విధంగా, రెండు సంవత్సరాలు ఆడుతూ పాడుతూ గడిచిపోయాయి. రెండవ సంవత్సరంలో మాకు ఆటో కేడ్ డ్రాయింగ్ చెప్పారు. పూర్వం సివిల్ ఇంజనీరింగ్ డ్రాయింగులను పెద్ద పెద్ద డ్రాయింగ్ పేపర్లపై సెట్ స్వేర్స్, టీ స్కేర్స్, స్కేళ్లు, పెన్సిళ్లతో గీసేవాళ్లు... ఇప్పుడవన్నీ అదృశ్యమై పోయాయి... అంతా ఇప్పుడు కంప్యూటర్‌లోనే గీసేస్తున్నాము... పూర్తైన తరువాత ప్రింట్లు తీసుకోవాలి.



గన్నవరపు నరసింహమూర్తి

ఈ విషయంలో మా ప్రొఫెసర్ గారు ఒక మంచి విషయాన్ని చెప్పారు. "మనిషికి, సమాజానికి పనికిరానిది, అవసరం లేనిదేదైనా అది అదృశ్యమై పోతుంది" అనీ డార్విన్ చెప్పాడు. ఒకప్పుడు రేడియోలు... ఇప్పుడు లేవు... బ్లాక్ అండ్ వైట్ టీవీలు, లేండ్ లైను ఫోన్లు, టైపు మిషన్లు, స్టీమ్ ఇంజన్లు, ఇంకు పెన్నులు, మూడు చక్రాల రిక్షాలు, పెంకుటిళ్లు, పాత రకం బజాజ్ స్కూటర్లు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో... కొత్తనీరు వస్తే పాతనీరు పోక తప్పదు... కాలంతో పాటు మార్పులు... మనిషి తనకు అక్కర్లేని వాటిని విసర్జించుకుంటూ పోతాడు.

మార్పులకు అలవాటు పడ్డవాడే ప్రపంచంలో మనగలడు. గతకాలము గొప్పదనీ చెప్పుకోడానికే బాగుంటుంది కానీ అది తిరిగి రాదు.. చక్రభ్రమణం ఎప్పుడు పురోగామే కానీ తిరోగామి కాదు...

మధ్య మధ్యలో ప్రొఫెసర్లు మంచి వేదాంతం చెప్పేవారు... ఇప్పుడు మనిషి అన్నింటికి కంప్యూటర్స్ మీదే ఆధారపడుతునాడు. సివిల్ ఇంజనీరింగ్ నాలుగు సంవత్సరాలలో మేము సుమారు పాఠ్య పుస్తకాలు చదవవలసి ఉంటుంది. అందులో కాలేజీలో చెప్పేది 30 శాతమే ఉంటుంది. మిగతాది మనం చదువుకోవాలి. దానికీ ఎంతో ఏకాగ్రత అవసరం. చాలా మంది కేవలం పరీక్షలో పాసవడానికి చదువుతారు. దానివల్ల ఏ ఉపయోగం లేదనీ మా హెడ్ గారు ఎప్పుడూ చెబుతుండేవారు. ఆయన దేవరకొండ బాలగంగాధర్ తిలక్ అమృతం

కురిసిన రాత్రి లోని "హిమ శైల శృంగమైన ఎవరెస్టుని టెన్సింగు నార్కే ఒక్కడే ఎక్కగలడు" అన్న కవితను ఉదహరిస్తుండేవాడు.., ఏదైతేనేం నాలుగు సంవత్సరాల మా ఇంజనీరింగ్ చదువు ఇంకో ఆరునెలల్లో పూర్తి కావస్తోంది...

ఈ మధ్యన చదువులో పడి సమీరని కలవటం లేదు.

ఒకరోజు నేను కేంటిన్లో ఉన్నప్పుడు సమీర వచ్చి "నీకీ విషయం తెలుసా?" అనీ అడిగింది.



నేను ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తున్న సమయంలో "మాధురి ఆరు నెలల క్రితం చదువు మానేసి వాళ్ల వెళ్లిపోయింది. వాళ్ల నాన్నగారు సడెన్‌గా చనిపోయారు...ఇప్పుడు దానికి వాళ్ల చుట్టాలబ్బాయితో పెళ్లట" అని చెప్పింది.

"మాధురి చదువు మానేసిందా? పెళ్లా?! ఆశ్చర్యంగా ఉందే.. మరిన్ని రోజులుగా నాకెందుకు చెప్పలేదు" అనీ ఆమెను అడిగాను.

"నాకూ తెలియదు... సడెన్‌గా వాళ్లూరు వెళ్లింది. మళ్లీ మొన్న వచ్చి ఈ విషయాలన్నీ చెప్పింది. తన చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులున్నయట... అందుకే తప్పక ఈ పెళ్లికి ఒప్పుకుందిట" అంది సమీర...

"చాలా బాధాకరమైన విషయం చెప్పేవు. ముఖ్యంగా చదువు అందులో ఆఖరి సంవత్సరం ఇంజనీరింగ్ మానివేయడం.ఆమె తప్పు చేసిందేమో ననిపిస్తోంది. నా ఉద్దేశ్యంలో ప్రతీవారికి చదువు అందునా స్త్రీలకు చాలా ముఖ్యం...అది మానేస్తే జీవితంలో చాలా కోల్పోవలసి ఉంటుంది. నువ్వు చెప్పలేదా?" అనీ సమీరని అడిగాను.

"అన్నీ అయిపోయిన తరువాత వచ్చి చెబితే ఏం చెబుతాను... తనకన్నీ తెలుసు.. తప్పక ఈ నిర్ణయం తీసుకుంది" అంది...

నేను చాలాసేపు మౌనం దాల్చేను. ఇద్దరికీ కాఫీ చెప్పాను.

కాఫీ తాగుతూ "నువ్వు జీ ఆర్ ఈ రాసావా?" అనీ అడిగింది.

"లేదు.. అయినా నేను అమెరికా వెళ్లను సివిల్స్ రాస్తాను... చూద్దాం? ఏం జరుగుతుందో.. నువ్వు రాస్తునావా?" అనీ అడిగాను...

"రాస్తునాను.. మా అన్నయ్య వచ్చి దగ్గరుండి అప్లై చేయించాడు. రాయక తప్పదు" అంది...

"ఏదీ చేసినా ఇష్టంగా చెయ్యి... మొక్కుబడిగా చేస్తే వేస్ట్... వెళ్లడం ఇష్టం లేకపోతే ధైర్యంగా ఆ విషయం చెప్పాలి. లేదంటే ఇష్టంగా వెళ్లాలి. అంతేకానీ ఎవరి కోసమో మనం ఏ పనీ చెయ్యకూడదు. అది సరే ... మాధురి పెళ్లి ఎప్పుడో ముందుగా చెప్పు ... వెళదాం" అనీ ఆమెతో చెప్పాను.

ఆమె "అలాగే" అనీ చెప్పి వెళ్లిపోయింది. మాధురి విషయం విన్నాక ఎందుకో సమీరతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయాను.

ఆమె వెళ్లాక నేనాలోచనల్లో పడ్డాను...

జీవితం మనం అనుకున్నట్లు వెళ్లదు. అది గాల్లో ఎగిరే పక్షిలాంటిది... ఎప్పుడు ఏ వేటగాడి బాణం తగులుతుందో తెలియదు.ఎన్నో కలలతో ఈ కాలేజీలోకి అడుగు పెట్టింది మాధురి. ఆమె కళ్లలో ఎప్పుడూ మెరుపు కనిపించేది నాకు. ఏది మాట్లాడినా స్పష్టత ఉండేది. ఏదైనా డబ్బు వల్ల చదువు ఆగిపోవడం అన్నది బాధాకరం.

అయినా ఆమె తొందరపడి అటువంటి నిర్ణయం తీసుకున్నదనిపిస్తోంది నాకు.. లేకపోతే ఏదో పరిష్కారం దొరికి చదువు పూర్తయ్యేది... ఇది మా అమ్మల తరం కాదు... స్త్రీలు అన్నింటా ముందుకు పోతున్న తరం... పోటీ పడుతున్న తరం... ఏదైనా ఆమె పెళ్లికి వెళ్లినపుడు అన్ని విషయాలు మాట్లాడాలి... ఆ ఆలోచన రాగానే నా మనసు కుదుట పడింది.

కాలం త్వరగా పరిగెడుతోంది. మొన్న ఇంజనీరింగ్‌లో చేరినట్లు అనిపిస్తోంది. అప్పుడే నాలుగేళ్లు అయిపోయాయా అనిపిస్తోంది. ఇంక ప్రాజెక్టు వర్క్ ఒక్కటే ఉంది. అది పూర్తయితే చదువు ముగిసినట్లే. మా ఫ్రెండ్స్ చాలా మంది అమెరికా వెళతామనీ, మరికొందరు గేట్ రాసి ఎమ్‌టెక్ చేస్తామనీ అంటునారు. నాకైతే సివిల్స్ రాయాలని ఉంది... చూద్దాం... ఏం జరుగుతుందో... గేట్‌లో మంచి రాంక్ వస్తే ఐఐటీలో ఎమ్‌టెక్ చెయ్యొచ్చు. కాబట్టి గేట్‌కి అప్లై చేసాను. అది ఫిబ్రవరిలో పరీక్ష. ఆ తరువాత సివిల్స్ ప్రిలిమ్స్ రాయాలి... ఇప్పుడు నాకింకో సమస్య... నాన్నగారికి ఒంట్లో బాగుండటం లేదు... ఇంటికి దగ్గరగా ఉండాలి. వ్యవసాయం చూడాలి... అమ్మకి తోడుగా ఉండాలి.. తోడబుట్టిన వాళ్లు లేకపోవడం కూడా సమస్యే...

ప్రాజెక్ట్ వర్క్ పూర్తైంది. చాలా మంది నా స్నేహితులు ప్రాజెక్టును తాము స్వంతంగా చెయ్యలేక ఒక ఇనిస్టిట్యూట్ సహాయం తీసుకున్నారు. వాళ్లు రకరకాల ప్రాజెక్టులను తయారు చేసి మనకిస్తారు. ప్రొఫెసర్ల చేత అప్రువల్స్ కూడా వాళ్లే చేయిస్తారట... ఆఖరికి చదువు కూడా వ్యాపారమైపోయింది. ఇంక విద్యార్థులేం నేర్చుకుంటారు. ఎలా తమ జ్ఞానాన్ని సమాజానికి ఏం పంచుతారు? నేను మాత్రం స్వంతగా ప్రొఫెసర్ గారి సలహాతో పూర్తి చేసి సమర్పించాను. నా ప్రాజెక్టుని చూసి మా ప్రొఫెసర్ గారు ఎంతో మెచ్చుకున్నారు... ప్రాజెక్టులు బాగుంటే వాటిని స్టాన్‌ఫోర్డ్ లాంటి విశ్వ విద్యాలయాల్లో లైబ్రరీలో విద్యార్థుల అధ్యయనం కోసం ఉంచుతారు.వాటిలో చాలా మంది ప్రాజెక్టులు నోబెల్ పురస్కారాలందుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. కానీ మనదేశంలో చదువులు పూర్తి వ్యాపారం అయిపోయాయి. చాలా మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు న్యూటన్ సూత్రాలు గానీ, ట్రిగోనామెట్రీ, కాలిక్యులస్‌లు తెలియవు. మా ప్రొఫెసర్ గారు ఎన్నోసార్లు మా క్లాసులో 500లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులను వీటిపై ప్రశ్నలు వేసి ఖంగుతిన్న సందర్భాలెన్నో ఉన్నాయి.

(సశేషం)



**ఓం** మిత్రాయనమః, ఓం సూర్యాయనమః, ఓం భాస్కరాయ నమః... అంటూ అక్కడ కొందరు బాలురు, యువకులు సూర్య నమస్కారాలు చేస్తున్నారు. అది పాఠశాల ప్రాంగణం. ఆ ప్రక్కనే దేవాలయం, అక్కడ కూడా సూర్య నమస్కారాలు చేస్తున్నారు.

అది తమస్సు పోయి ఉషస్సు వస్తున్న వేళ. సూర్యాగమన సందర్భం. సూర్యునికి నమస్కారాలు.

ఇది సంప్రదాయం. ఇది ఆరోగ్యదాయకం. సూర్య నమస్కారాలు చేసినపుడు శరీరానికి వ్యాయామం కలుగుతుంది. ఉల్లాసం వల్ల శక్తి పుడుతుంది. ఉత్సాహంతో పనిచేసే మానసిక స్థితి ఏర్పడుతుంది.

మానవుడు సౌరశక్తిని తనలోకి ఆహ్వానించడమే సూర్యనమస్కారాల ఉద్దేశం. దీనికి ఒక సంప్రదాయం (రిచువల్) ఉంది. అది సంక్రాంతి నుండే సంక్రమించింది.

**మకర సంక్రాంతి**

సూర్యుడు ద్వాదశ రాశులలో ప్రతి మాసం ఒక రాశిలో ప్రవేశిస్తాడు. ఏ రాశిలో సూర్యుడు ప్రవేశిస్తే ఆ సంక్రాంతి అన్నమాట. మకర రాశిలో సూర్యుడు ప్రవేశించిందే మకర సంక్రాంతి. మిగతా సంక్రాంతులకు లేని ప్రాధాన్యం మకర రాశికే ఉంది. కారణం, వాతావరణంలో వచ్చే మార్పే. మకర రాశిలో సూర్యుడు ప్రవేశించే వరకు చలిగా ఉన్న వాతావరణం, అప్పటి నుండి వేడిగా మారుతుంది. ప్రకృతిలో తేజస్సు వస్తుంది. ఆ తేజస్సు వ్యక్తిలో కూడా రావాలనే సూర్యోపాసన చేయడం అనే సంప్రదాయం ప్రారంభమయ్యింది.

**పురాణ కథలు**

1. భీష్ముడు అంపశయ్యపై ఉత్తరాయణం వరకు ఉన్నాడు. ఉత్తరాయణ ప్రారంభంలో వచ్చే ఏకాదశి నాడే ఆయన పరమాత్మలో కలిసిపోయాడు. ఆ ఏకాదశి సంక్రాంతికి ముందే వస్తుంది. అందువల్ల ఏకాదశి నుండి సంక్రాంతి వరకు నియమ నిష్ఠలతో ఉంటారు.

2. అండాళ్ : ప్రసిద్ధిగాంచిన పూడికుడుత్త (గోదాదేవి) సంక్రాంతి పండుగనాడే శ్రీరంగనాధునిలో లీనయ్యింది. అందుకే భోగి, కల్యాణం కనుమ అని మూడురోజులు ఈ పండుగ నిర్వహిస్తారు. జీవాత్మ అయిన గోదాదేవి పరమాత్మ అయిన శ్రీరంగనాధునిలో లీనం కావడం వల్లనే ఈ పండుగ జరుపుకొంటున్నారు.

3. దేవతలను ఓడించి అమరావతిని బలిచక్రవర్తి ఆక్రయించాడు. శ్రీ మహా విష్ణువు వామనమూర్తియై, బలిని సమీపించి, మూడడుగులు నేల దానంగా గ్రహించి, త్రివిక్రముడై బలిని పాతాళానికి పంపించాడు. ఈ అంశం కూడా సంక్రాంతితో ముడివడింది.

4. ఇంద్రుడు వ్రేపల్లె మీద రాళ్ల వాన కురిపించాడు. తనకివ్వాల్సిన ఆహుతులు వ్యవసాయదారులు – గోరక్షకులు అయిన ఆనాటి ప్రజలు ఇవ్వని కారణంగా ఇంద్రునికి ఆగ్రహం వచ్చింది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు గోవర్ధన గిరినెత్తి వారినందరిని కాపాడాడు. ఇంద్రుడు శ్రీకృష్ణుడు ముందు మోకరిల్లాడు. ఈ అంశం కూడా సంక్రాంతి పర్వదినానికి కారణమయ్యింది.

**చారిత్రకాలు**

1. కొన్ని చారిత్రక కథలు కూడా ఈ పండుగతో ముడివడ్డాయి. కాటమరాజు చెల్లెలైన 'గోబి' సంక్రాంతినాడే పరమాత్మునిలో లీనమయింది. ఆమె భగవంతుణ్ణే భర్తగా భావించింది. ఆనాటి నుండి జనం సంక్రాంతి పండుగ సందర్భంగా ఆ గోబీకి గుర్తుగా గొబ్బెమ్మలను పెట్టడం ప్రారంభించి.

2. గోదాదేవి పురాణ కథే అనిపించినా శ్రీవిల్లిపుత్తూరులో ఆమె జననం, విష్ణుచిత్తుని కూతురై నియమ నిష్ఠలతో జీవించడం, ధనుర్మాసమంతా అనేక వ్రతాలు నిర్వహించి 30 పాశురాల తిరుప్పావై రచించడం, శ్రీరంగనాధునిలో లీనం కావడం ఇదంతా చారిత్రక సంఘటనే. ఈనాటికీ ఆ తల్లి తిరుప్పావై ధనుర్మాసంలో పఠన పాఠనాదుల్లో ఉంది.

3. స్వామి వివేకానందులు 1863వ సంవత్సరంలో దుందుభి పుష్యబహుళ సప్తమినాడు జన్మించాడు. ఆ రోజు సంక్రాంతి. 63వ సంవత్సరంలో జనవరి 12. అయితే ఆ తర్వాత సంక్రాంతి జనవరి 14 నాడుకు మారింది. సూర్య సంక్రమణంలోని ఈ మార్పు ఇది. వివేకానందస్వామి జయంతి పర్వదినంగా మారడం సహజమే. అది చరిత్రలో నిలిచే ఘట్టమే.

**సామాజికాంశాలు**

1. హిందూదేశం వ్యవసాయ ప్రధానమయింది. వర్షాకాలంలో వేసిన పంటలన్నీ ఇంటికి వచ్చే సమయమిది. అందువల్ల సంక్రాంతి పండుగ సంబరాల పండుగయ్యింది.

2. ఇండ్లు ధాన్యంతో సుసంపన్నంగా ఉన్న కారణాన అల్లుళ్లు, ఆడపడుచులు వస్తారు. చీరెసారె పెడతారు. ఈ కోలాహలమంతా పండుగే అయింది.

3. ఇంటికి వచ్చిన ధాన్యం (నవధాన్యాలు) నడింటిలో కుప్పలుగా పోసి, మధ్యలో పాలు పొంగించే ఆచారం పూర్వముండేది. ఇప్పుడు కూడా ప్రతి ఇంటిలో ఈ ఆచారం ఉన్నది. అయితే నవధాన్యాలు లాంఛనంగా పిడికెడు పోసి మధ్యలో పాలు పొంగిస్తారు.

4. గంగిరెద్దులాట, కోళ్ల పందాలు, దున్నపోతుల ఆటలు, బండ్ల పందాలు, ఇంటి ముంగిట నిండా పరచిన ముగ్గులు. ఇవ్వన్నీ సంక్రాంతి సంబరాలే.

5. పులగం వండడం. ఇంటికి వచ్చినవారి నోరు తీపి చేయడం, నువ్వుల బెల్లం పంచడం – ఇవన్నీ ఇంట్లోనూ ఐదుగురు కలిసినచోట సామాజిక ఉత్సవాల్లోనూ కనిపిస్తాయి.

# నిజమైన సంక్రాంతి

**ప్రాకృతికాంశాలు**

ఉహుంహూం అనే విధంగా ఇంత కాలం వణికించిన చలి, మంచు సూర్యుని వేడి కిరణాలు తాకగానే మెల్లమెల్లగా తమ ప్రతాపాన్ని చూపడం మానివేస్తాయి. కాంతి సర్వత్రా విస్తరిస్తుంది.

మబ్బులు తొలగడం, వేడి వేడి వాతావరణం వ్యాపించడం వ్యక్తుల్లో ఉత్సాహాన్ని పెంచుతుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఈ ఉత్సాహం కూడా పండుగ జరుపుకోడానికి కారణమయింది.

**ఇప్పుడు సంక్రాంతి ఎక్కడెక్కడ!?**

ఒక పండుగ పుట్టడానికి కారణాలున్నాయి. దాని వెనుక పరమార్థాలున్నాయి. అవన్నీ మనం ఆచరిస్తున్నాం. పదిమందికి చెప్పుకొంటున్నాం.

సం అంటే సమ్యక్ అని, క్రాంతి అంటే విప్లవం లేదా, అభ్యుదయమని కదా అర్థాలు. ఇవాళ హిందువు క్రాంతిని ఎలా! ఎప్పుడు! ఎక్కడ! ఎందుకు! సాధించాలన్నదే ప్రశ్న.

**1. భూమి సమస్య:** హిందూ ధాత్రికి క్రాంతి లేదు, వికాసం సంగతి దేవుడెరుగు. రోజురోజుకు కబ్జాలు పెరుగుతున్నాయి. మన సముద్రాన్ని, మన నేలను విస్తరణ వాదంతో చొచ్చుకువచ్చే విదేశీ శక్తులు ఆక్రమిస్తున్నాయి. కాబట్టి ఈ హిందువుల జన్మభూమికి అభ్యుదయం జరగాలి. ఇంతవరకు ఏయే భూములు ఎక్కడెక్కడ ఎవరెవరు ఆక్రమించారో ఆ భూములను ఈ దేశం తనవిగా చేసుకోవాలి. అప్పుడే క్రాంతి–సంక్రాంతి.

**2. జనాభా సమస్య :** జనం పెరగడం క్రాంతి. కాని ఈ దేశంలో హిందువులు పెరగడంలేదు. ఇతర విదేశీ మతాలవారి సంఖ్య పెరుగుతున్నది. జననాల రేటులోనూ వారే ఎక్కువగా ఉన్నారు. హిందువు కుటుంబ నియంత్రణ పాటిస్తున్నాడు. వారెవరు పాటించడం లేదు. హిందువులను వారు మతాంతరీకరణ చేస్తున్నారు. వారి జనాభాను అలా పెంచు కొంటున్నారు. హిందువుల సంఖ్య తగ్గకూడదు, పెరగాలి. అప్పుడే సంక్రాంతి మరి.

**3. చొరబాటు సమస్య:** భూభాగం గుండా, సముద్రాల గుండా, ఆకాశం గుండా ఈ దేశంలోకి అక్రమంగా ఎందరో విదేశీయులు ప్రవేశిస్తున్నారు. ఇక్కడ స్థిరపడిపోతున్నారు. సరిహద్దుల్లో అయితే ఓటర్ల లిస్టులోకి ఎక్కారు. రేషనుకార్డులు సంపాదించారు. భూములు కొంటున్నారు. ఈ దేశంలోని కొన్ని పార్టీలకు చందాలిచ్చి, డబ్బు కుమ్మరించి అందులోని వ్యక్తులను కొనేసి వారిని తమ సంస్థ మౌత్‌పీస్‌లుగా వాడుకొంటున్నారు. వీరందరిని అరికట్టాలి. వారి వారి దేశాలకు పంపాలి. అప్పుడే దేశంలో క్రాంతి సంక్రాంతి.

**4. విద్యారంగం సమస్య :** ప్రభుత్వం నిర్వహించే విద్యారంగం నానాటికి తీసికట్టుగా తయారవుతోంది. ప్రభుత్వంలోని పెద్దలే విదేశీ మిషనరీల విద్యాసంస్థల్ని మెచ్చుకొంటున్నారు. విద్య ద్వారా వారు తమ మత విషాన్ని ఇంజెక్ట్ చేస్తున్నారన్న సంగతి అందరికీ తెలుసు. హిందువుల పాఠశాలలూ ఉన్నాయి. ఆశ్రమ విద్యాలయాలు ఉన్నాయి. అవి హిందుత్వాన్ని గురించి చెప్పవు. పాఠాలు చెబుతాయి అంతే! తమ మత ప్రచారం ద్వారా ఈ దేశంలో తమ అనుయాయులను పెంచాలనుకొన్న మత సామ్రాజ్యవాద దేశాల ఏజెంట్లుగా పనిచేసారు. హిందువుల విద్యాలయాలు కేవలం పొట్టకూటికి నిర్వహించేవిగా తయారు కాకూడదు. ఆదర్శాలు, ఆచరణ రెండు ఉండాలి. ఈ ఆలోచనలతో హిందువులు తమ విద్యాలయాల్లో హిందూ సంస్కారాలకు ప్రాధాన్యమిస్తే సంక్రాంతి సాధ్యమవుతుంది.


**5. సామాజిక సమస్యలు :** ఇవి కోకొల్లలు. అంటరానితనం, హెచ్చుతగ్గుల భేదభావం, వరకట్న దురాచారం, జంతుబలి... ఇలా ఎన్నో ఇవన్నీ సామరస్యంగా పరిష్కరించుకొనే ఏర్పాట్లు; అన్నిటికి మించి కలిసికట్టుగా పనిచేయడం ఇదే సంక్రాంతి.

**సంక్రాంతివైపుగా పయనం**

వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం క్రాంతివైపుగా పయనించాలనే ప్రతి వ్యక్తి క్రియాశీల కార్యకర్త కావాలి. భారతీయమైన భావజాలాన్ని అనుసరించాలి. విదేశీయుల వివిధ విధాల కుట్రల్ని భస్మంచేసి గుణపాఠం నేర్పి, భారతీయతలోని ఔన్నత్యం తెలిపేట్టుగా చేయాలి. తన వృత్తిలో తాను నైపుణ్యాన్ని సంపాదించి, విజయాలు సాధిస్తూనే దేశం మీద దృష్టిపెట్టి నడవాలి. అప్పుడే ఈ దేశంలో నిజమైన సంక్రాంతి నెలకొంటుంది.

**– ధర్మవీర**

**– జాగృతి, జనవరి 11–17, 1999**





## 12, జనవరి వివేకానంద జయంతి, యువజన దినోత్సవం

ఇచ్చి పుచ్చుకొనడమే జీవన రహస్యం. ఎప్పుడూ పాశ్చాత్యుల పాదాల వద్దనే కూర్చొని వారి నుండి ప్రతిదానినీ– చివరకు మతాన్ని కూడా వారి నుండి నేర్చుకొనడమేనా మన కర్మ? వారి నుండి మనం యంత్ర విజ్ఞానాన్ని నేర్చుకొనవచ్చు. ఇంకా అనేక విషయాలు నేర్చుకోవచ్చు. కాని మనం కూడా వారికి కొంతనేర్పవలసి ఉంది. అదే ధర్మం, ఆధ్యాత్మికత. ప్రపంచం సంపూర్ణమైన నాగరికత కోసం ఎదురు చూస్తోంది; భారత విజ్ఞానం కోసం ఎదురు చూస్తోంది; దశాబ్దాల తరబడి కడగండ్లలోనూ, పతిత దశలోనూ ఉన్నప్పటికీ జాతి అంటి పెట్టుకొని ఉన్న ఆ మహాద్భుత ఆధ్యాత్మిక సాంప్రదాయాలకు ఎదురుచూస్తోంది. మన పితరుల విజ్ఞానఖని కోసం బాహ్య ప్రపంచం ఎంత తహతహలాడిపోతోందో మీకు తెలియదు. మనం ఏదో మాట్లాడుకుంటూనే ఉంటాం; మనలో మనం పోట్లాడుకుంటూనే ఉంటాం. మనం పరమపవిత్రమైన వాటిని గూర్చి కూడా ఏదో ఎగతాళి చేస్తాం, నవ్వుతాం. మనకు పరమపవిత్రమైన ప్రతిదానినీ ఎగతాళి చేయడం, న్యూనపరచడం మన జాతిలో ఒక దురలవాటయింది. ఈ దేశపు గోడల మధ్య మన పూర్వులార్జించి దాచి ఉంచిన ఆ అమృతం కోసం, మన సరిహద్దుల ఆవల చేతులు జాపి ఆశగా జూస్తున్న లక్షలాది మానవుల సంగతి మనకు అర్థం కావడంలేదు. అందువల్ల మనం సిరులు దాటి వెళ్లాలి. వాటివల్ల మనం పొందవలసిన దానికే ఆధ్యాత్మికతను బదులు తీర్చాలి. భౌతిక రంగంలోని మహా విశేషాలకు ఆధ్యాత్మికరంగంలోని మహా విశేషాలను తిరిగి ఇద్దాం. మనం ఎప్పుడూ శిష్యులుగానే ఉండరాదు. గురువులుగా కూడా ఉండాలి.

# అమెరికా మీద వివేకా

ఈ మహనీయునికి తల్లిదండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్ దత్త. తన విశ్వప్రేమ, మానవ సేవా ప్రబోధాలను ప్రపంచంలో తొలుదొల్త అమెరికా నుంచే ప్రారంభించారు. అందుకే అమెరికన్లు ఈయన పట్ల అత్యంత శ్రద్ధాసక్తులు ప్రదర్శించడం అన్ని విధాలా తగినదే.

అమెరికన్ మహానగరాలలోని వేదాంత కేంద్రాలు ఈయన కీర్తి ప్రతిష్ఠలకు ప్రబల తార్కాణంగా విలసిల్లుతున్నాయి. హాలీవుడ్‌లో వేదాంత సమాజం ప్రధాన కార్యాలయంలో దివ్యజ్యోతిలా వెలుగొందే ఈయన కాంస్య విగ్రహం ప్రధాన స్థానాన్ని అలంకరిస్తున్నది. స్వామి వివేకానందునికి, అమెరికాకు మధ్య గల ప్రగాఢ బంధాలు అవగాహన చేసుకోవాలంటే గత చరిత్రవైపు దృష్టి మళ్లించాలి. వేదాంత ఉద్యమం అంతర్జాతీయంగా ప్రజ్వరిల్లటానికి కారణభూతుడైన శ్రీరామకృష్ణ 1886లో దివ్యసమాధి పొందారు. ఆయన శిష్యుడు నరేంద్రనాథ్ దత్త (వివేకానందుడు) భారతదేశం నలుమూలలా తాత్త్విక సమస్యల పరిష్కరించే ధ్యేయంతో పర్యటించాడు. తన యాత్రానుభవాల ఫలితాలను గురించి ఆయన కన్యాకుమారి ఆగ్రంలో సుదీర్ఘంగా యోచింపసాగాడు.

ప్రపంచ కొలంబియన్ ప్రదర్శనతోపాటు పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్ (మత సభ) షికాగో నగరంలో జరుగపోతున్నదని 1892 చివరలో స్వామీ వివేకానంద తొలిసారి తెలుసుకున్నారు.

మానవుని భౌతికాభ్యుదయాన్ని తెలిపేందుకు ఆ ప్రదర్శన ఏర్పాటు కాగా, ప్రపంచంలో తత్త్వ మీమాంసలో నిమగ్నులైన మహామహులనందరినీ ఒకచోట సమకూర్చాలనే ధ్యేయంతో ఆ మతసభ ఏర్పాటు చేశారు.

భారత అవసరాల గురించి తాను కంటున్న కలలకు ఆ సభ ఆశయాలు కూడా ఎంతో సన్నిహితంగానూ, నిర్దుష్టంగానూ ఉండడంచేత వివేకానందుడు తన సహచరుల వద్ద డబ్బు పోగు చేసుకొని మే 31, 1893న అమెరికాకు ప్రయాణమైనాడు.

పదివేల మైళ్ల దూరం, నెమ్మదిగా నడిచే నావలో ముక్కూ, మొగం ఎరుగని ఆ కొత్త గడ్డకు అలా పయనించడం ఎంత సాహసకృత్యమో, బహువేగ ప్రయాణ సౌకర్యాలు గల ఈనాడు మనకు బాగా అర్థమవుతుంది.

కోట్లాది భారతీయులను పునరుజ్జీవన మొనరించటానికి తన ప్రణాళికలకు అమెరికాలో సహాయం

## సాహిత్యం జాతీయ స్ఫూర్తిని ఇవ్వాలి..

**పరిగి :** జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత సమావేశం పరిగిలోని శ్రీనివాసనగర్ మామిడితోటలో డిసెంబర్ 29వ తేదీన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి కవులు, రచయితలు పాల్గొని వివిధ అంశాలపై గోష్ఠి నిర్వహించారు. “దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు–సమస్యలు– పరిష్కారాలు–సాహిత్యకారుల బాధ్యత” అనే అంశంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్యపరిషత్ ప్రాంత గౌరవ అధ్యక్షులు కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రసంగిస్తూ–సమానత్వ సాధన, భాషా వికాసం, సంస్కృతి వికాసం, అన్యాయాన్ని ఎదిరించడం, ఏకాత్మభావన కోసం కవులు, రచయితలు రచనలు చేయాలని, సమాజంలో దేశభక్తిని, జాతీయ భావాలను ప్రేరేపించవలసిన బాధ్యత సాహిత్యకారులదేనని అన్నారు. ప్రాచీన సాహిత్యం మొదలు ఆధునిక సాహిత్యం వరకు దానిలోని విలువలను సమాజానికి అందించి భారతీయ సాహిత్యాన్ని కాపాడాలని ఆచార్య కసిరెడ్డి కోరారు. ప్రజల వద్దకు సాహిత్యం చేరాలి, ఆధునిక కవుల, రచయితలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. దేశభక్తి పూరిత రచనలు విరివిగా రావాలని సూచించారు. డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర, సాహిత్యం చాలా గొప్పదని అన్నారు. తెలంగాణ పోరాట భూమి అని, పోరాటం నుండి వచ్చిన సాహిత్యం తెలంగాణ సాహిత్యమన్నారు. తెలంగాణ కవులకు రచయితలు సామాజిక స్పృహ కల్గి ఉంటారన్నారు. తెలంగాణ సాహిత్యాన్ని, సంస్కృతిని కాపాడుకోవాలని సూచించారు.

జాతీయ సాహిత్యపరిషత్ ప్రచార కార్యదర్శి, ఆధ్యాత్మికవేత్త, కవి, రచయిత భాస్కరయోగి మాట్లాడుతూ బాధ్యత గల్గిన కవుల సంఖ్య పెరగడంతో పాటు సాహిత్య విమర్శకులు, సమీక్షకులు అవసరం చాలా ఉందని, సాహిత్యాన్ని పాఠకులకు చేర్చాల్సిన బాధ్యత వారిదేనని సూచించారు.

# భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికందీయాలి

సమాజత్వం లేనిదే స్నేహం ఉండజాలదు; ఒక పక్షం ఎల్లప్పుడూ రెండవ పక్షం పాదపీఠం వద్ద కూర్చొనే ఉంటే సమానత్వం ఉండజాలదు. నీవు ఇంగ్లీషువాళ్ల తోనూ, అమెరికావాళ్లతోనూ సమానంగా ఉండదలిస్తే నీవు వారికి కొంత నేర్పనూ నేర్పాలి. వారి నుండి కొంత నేర్చుకోవాలి. శతాబ్దాల తరబడి ప్రపంచానికి నేర్పదగిన మహాజ్ఞానం నీవద్ద ఉంది. దాని నీవు బోధించాలి. మన రక్తంలో వేడి కావాలి, మన నాళాల్లో ఉత్సాహం ఉప్పొంగాలి. మేల్కొనండి, లేవండి, ఆదర్శం అందేవరకూ ఆగకండి. 'ఉత్తిష్ఠత' జాగ్రత, ప్రాప్యవరాన్ని బోధత' ధైర్యంగా ఉండండి. పిరికితనాన్ని తోలిపారేయండి.

ఒక్కొక్క జాతి ఒక్కొక్క ప్రత్యేక పద్ధతిలో కృషి చేస్తుంటుంది. కొన్ని జాతులు రాజకీయాల ద్వారాను, కొన్ని సంఘ సంస్కరణల ద్వారాను, మరికొన్ని ఇంకా ఇతర మార్గాలలోను కృషి చేస్తుంటాయి. మనకు సంబంధించినంతవరకు మనం పురోగమించ వలసింది ధర్మపథాన మాత్రమే. ఆంగ్లేయుడు రాజకీయాల ద్వారానే మతాన్ని కూడా అర్థం చేసుకుంటాడు. అమెరికన్ బహుశా సంఘ సంస్కరణల ద్వారా అర్థం చేసుకుంటాడు. కాని హిందువు మాత్రం రాజకీయాలను కూడా ధర్మం ద్వారా ప్రతిపాదిస్తేనే అర్థం చేసుకుంటాడు. సాంఘికతత్త్వం కూడా అతనికి ధర్మం ద్వారా అర్థం కావల్సిందే. ప్రతి ఒకటి అతని ధర్మం ద్వారా చేరవలసిందే. ఎందువలనంటే అతని జాతీయ జీవన గీతికలో ప్రధాన భాగం అదే. నేడిదే ప్రమాదంలో ఉంది. మనకు ఆధ్యాత్మికాదర్శాలు కావాలి. ఆధ్యాత్మిక మహాపురుషుల పాద సన్నిధిన మనం ఉత్సాహంతో మూగుతాం. మన నాయకులు ఆధ్యాత్మిక శక్తి సంపన్నులై ఉండాలి. భారతదేశం ప్రపంచాన్ని జయించి తీరాలి. ఇంతకు తక్కువ ఆదర్శం నాకు వద్దు. ఇది చాలా పెద్దది కావచ్చు. నా ఆదర్శం మాత్రం అదే. మనం జయించినన్నా జయించాలి లేదా మరణించాలి.

**జాగృతి, 14-1-1958**

# నందుని ప్రభావం

చేకూర్చుకోవాలనీ, వేదాంతతత్త్వ విలువలను పాశ్చాత్యులకు బోధించాలనీ ఆయన అమెరికాకు బయలుదేరాడు.

షికాగో నగరంలో అడుగుపెట్టేసరికి తాను పార్లమెంటు జరగవలసిన తేదీ కంటే చాల ముందుగానే వచ్చినట్లు దానిలో పాల్గొనేందుకు తగిన అర్హతాపత్రాలు తనకు లేనట్లు, చాలినంత డబ్బు దగ్గర లేనట్లు వివేకానందుడు గ్రహించాడు.

"ఈ దేశంలో ధనం, పదవి, భేషజాలకంటే విజ్ఞానానికే ఎక్కువ విలువ కలదన్న" అకుంఠిత విశ్వాసంతో ఆయన బోస్టన్ నగరానికి పయనమయ్యాడు. దైవ కృపచేత బాస్టన్‌లో విజ్ఞానవంతురాలు మిస్ కేట్ శాన్‌టర్న్‌తో ఆయనకు పరిచయమయింది. ఆమె వివేకానందుని హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్ హెన్రీ రైట్‌కు పరిచయం చేసింది. ఆమె స్నేహితులందరకూ ఆయన పరిచితుడయ్యాడు. ఆ భారతీయుని స్ఫురద్రూపం, చిత్తశుద్ధి, సిద్ధాంతాలు చూచి వారెంతో మెచ్చుకొని బోస్టన్‌లో జరిగే రెలిజియన్స్ పార్లమెంటు (మతసభ)లో పాల్గొనేటందుకు కావలసిన అర్హతలను ఆయనకు సమకూర్చి పెట్టారు.

ఆ సభలో ఆయన అపార విజ్ఞానం, ప్రబోధనా నైపుణ్యం, వాగ్ధాటి చూచి ఇతర సభ్యులంతా ఆశ్చర్యపడి ఆయనను పురుషోత్తముడని శ్లాఘించారు. సభ ముగిసిన ఆ తర్వాత వివేకానంద అమెరికాలో రెండేళ్లు గడిపి, వేలాది ప్రజలకు ప్రేమ సందేశాన్ని, భారత ఇతిహాసాన్ని కరతలామలకం చేశాడు.

తన తత్త్వమేమిటో అధిక సంఖ్యాకులకు తెలియని ఆ దేశంలో ఆయన అంత ప్రసిద్ధ పురుషుడెట్లా అయినాడు? కొంతవరకు ఆయన మహత్తర రూపురేఖా విలాసాలు, ఆయనలో గల ప్రేరణాశక్తి కారణం. అమెరికాలో వాస్తవికంగా గల ఆరాధనా స్వాతంత్ర్యం, తాత్త్విక జిజ్ఞాసలో అమెరికన్లకు గల ప్రగాఢాసక్తి అయన సందేశాలకు జోహారు అర్పింపజేసినవి. విరోధభావ మేర్పడవలసిన ఆగత్యం లేదు.

అమెరికాలో వివేకానందుని పర్యటనలో కొన్ని కష్టాలు కూడా రాకపోలేదు. ఆ విషయాలనూ, ఆయన విజయాలనూ సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే మేరీ లూసీ బర్క్ రచించిన ("స్వామి వివేకానంద్ ఇన్ అమెరికా", కలకత్తా అద్వైత ఆశ్రమమ్, 1958) అనే పుస్తకం చదవండి.

భారతీయ సమస్యలు తత్త్వంలో అమెరికన్లకు దేశ వ్యాప్తంగా చాల శ్రద్ధాసక్తులు రేకెత్తించింది ఈ భారత పుత్రరత్నమేననక తప్పదు.

**– జాన్ టి రీడ్,** (జాగృతి 18.10.1957)



జాతీయ సాహిత్యపరిషత్ ప్రాంత అధ్యక్షులు వడ్లూరి ఆంజనేయరాజు, కార్యదర్శి మావుడూరి సూర్య నారాయణమూర్తి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. తరువాత కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘటన కార్యదర్శి కృష్ణగౌడ్, వికారాబాద్ అధ్యక్షులు వీరకాంతం, కరినగర్ అధ్యక్షులు గాజుల రవీందర్, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ జయదేవ్, వివిధ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ★





తెలంగాణ రైతులకు ఆదినుంచీ ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించడం, అన్నదాతలు చకోర పక్షుల్లా ఎదురుచూడటం ప్రతిసారీ జరుగుతోంది. గతంలో పదేళ్ల పాటు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ హయాం ఎదురు చూపులతోనే సరిపోయింది. ఒక్క రైతుబంధు మినహా ఏ హామీ కూడా నెరవేరలేదు. ప్రకటనలు, దాటవేతలు, వాయిదాలు వేయడం సర్వసాధారణమై అందరికీ అలవాటయిపోయింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు కూడా అమలు వాయిదాల మీద వాయిదాలు, కొర్రీల మీద కొర్రీలుగా కొనసాగుతున్నాయి. ఉన్న పథకాలను కొనసాగించడం కూడా గగనమైపోతోంది. ఎన్నికలకు ముందు హామీలు ఇవ్వడం, గెలిచి ప్రభుత్వంలోకి వచ్చాక ప్రకటనలు చేయడం, ఆశపెట్టడం, నియమాలు, నిబంధనలు, మార్గదర్శకాలంటూ కాలం సాగదీయడం, ముహూర్తాలు, ఆర్థిక పరిస్థితులంటూ మరింతగా ఆందోళనలో పడేయడం.. ఎదురు చూసీ చూసాక.. చివరకు పాక్షికంగా అమలు చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ఆ పథకాలు అమలయ్యే సరికి తాము ఆ లబ్దిదారుల జాబితాలో ఉంటామో లేదో అన్న సందేహాలు రైతులను వెంటాడుతున్నాయి.

# నిరంతర నిరీక్షణలో కర్షక

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యేడాది దాటిపోయింది. అధికారంలోకి వచ్చీ రాగానే రూ. రెండు లక్షల లోపు రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామని ప్రకటించింది. అయితే, రుణమాఫీ ఇదిగో, అదిగో అంటూ దాదాపు ఎనిమిది నెలల పాటు ఊరించి ఊరించి మూడు నాలుగు దశలుగా అమలు చేశారు. అయితే, వాటిలోనూ ఇంకా సంపూర్ణంగా రుణమాఫీ కాలేదని బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడా అంశం మరుగునపడింది.

ఇప్పుడు రైతు భరోసా అంశం తెరపైకి వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట ఈ పథకాన్ని అమలు చేసింది. వ్యవసాయ భూములున్న రైతులందరికీ పెట్టుబడి సాయం పేరిట ఎకరానికి పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం



అందచేసింది. అయితే, వ్యవసాయ భూములే కాకుండా.. వ్యవసాయేతర భూములు, ఖాళీ భూములకు కూడా రైతుబంధు పథకం కింద ఆర్థిక సాయం అందజేశారు. ఎవరికి ఎన్ని ఎకరాలు భూములున్నా ఆ పథకాన్ని అమలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాన్ని ప్రత్యేకంగా లేవనెత్తి రైతుబంధు పథకాన్ని నిలిపేశారు. దానిని సమీక్షిస్తామని, అర్హులకు... వ్యవసాయం చేసేవాళ్లకే ఇస్తామని, అలాగే, లబ్ధిదారులకు భూమిపై సీలింగ్ విధిస్తామని ఇలా.. రకరకాల ఆలోచనలు, అంచనాలు, ప్రకటనలతో రైతుబంధు పథకం నిలిచిపోయింది. తాము అధికారానికి వచ్చాక దాన్ని రైతుభరోసా పథకంగా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే, నాలుగైదు నెలలపాటు.. రైతు రుణాల మాఫీ అంశంతో రైతుభరోసా అమలు, సమీక్ష వెనక్కి వెళ్లిపోయింది. ప్రభుత్వం ఏర్పాటై యేడాది పూర్తయినా రైతు భరోసాపై ఇంకా ఓ అంచనాకు రాకపోవడంపై చర్చ జరుగుతోంది.

రైతు భరోసాపై కాంగ్రెస్ సర్కారు తనదైన రీతిలో మళ్లీ వాయిదాల పర్వాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రైతుభరోసాకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నామంటూ ఆర్థిక సాయం అందించే అంశాన్ని సాగదీస్తోంది. ఇందులో భాగంగానే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ మంత్రుల కమిటీ రైతుభరోసాను విశ్లేషిస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ ఈ అంశంపై చర్చించింది. గత ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు పూర్తిగా మార్చేయాలని ప్రతిపాదిస్తోంది. సాగు చేస్తున్న వ్యవసాయ భూములకు మాత్రమే రైతుభరోసా సాయం అందించాలని అనుకుంటోంది. ఇక, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవాళ్లకు ఇవ్వాల్సిందేనా? అన్న అంశంపై కూడా తర్జనభర్జనలు పడుతున్నారు. కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు.. అంటే వ్యవసాయ సాగుకు పనికిరాని భూములకు రైతు భరోసా ఇవ్వొద్దని నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. అలాగే, కటాఫ్‌ను ఏ ప్రాతిపదికన నిర్ణయించాలన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ అంశాలను నిర్ధారించేందుకు మరికొన్ని సార్లు సమావేశం కావాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతే క్యాబినెట్‌కు సిఫారసు చేయాలని తీర్మానించింది. అంటే.. రైతుభరోసా.. ఇంకెంత దూరం? అన్నదానిలో స్పష్టత లేదు.

ఇప్పటికే రుణమాఫీ సరిగా రాలేదని ఆవేదన చెందుతున్న రైతులకు.. రైతుభరోసా అయినా సరిగ్గా వస్తుందా అనే సందేహాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం నిన్న మొన్నటిదాకా సంక్రాంతికి రైతుభరోసా ఇస్తామని చెప్పిందని, ఇప్పుడు మంత్రివర్గ ఉపసంఘం పేరుతో సంక్రాంతి తర్వాత అంటుండటంతో.. ఇంకెన్నాళ్లు ఎదురుచూడాల్సి వస్తుందోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. పైగా ఈ పథకం ద్వారా ప్రతీ రైతుకీ సంవత్సరానికి ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా రైతులకు చాలా అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే..




# లోకం

ఎవరిని ఏ ప్రాతిపదికన అర్హులుగా ఎంపిక చేస్తారనేది పెద్ద చర్చగా మారింది. ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు విడుదల చెయ్యలేదు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వం వహిస్తున్న మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వాస్తవ పరిస్థితిని వివరించారు. అనంతరం, ఉపసంఘం పలు అంశాలపై చర్చించింది. గతంలో ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహించిన సదస్సుల్లో వ్యక్తమైన అభిప్రాయాలు, అధికారులు తయారుచేసిన నివేదికలపైనా వివరంగా చర్చించారు.

గతంలో ఉపసంఘం చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనల్లో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు రైతుభరోసా ఇవ్వొద్దనే అభిప్రాయాలు వ్యక్తమైన విషయం ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే, ఐటీ చెల్లించే సింగరేణి ఉద్యోగులు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో సుమారు 4 లక్షల మంది ఉన్నారని, వీరందరికి ఇవ్వకపోతే ఇబ్బంది అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం–కిసాన్ పథకం మార్గదర్శకాలు కూడా ఉపసంఘం భేటీలో చర్చకు వచ్చాయి. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లు, ఐదేళ్లలో మూడుసార్లు లేదా వరుసగా రెండేళ్లు ఐటీ చెల్లించినవారు, వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, సీఏలు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులకు పీఎం– కిసాన్ పథకాన్ని వర్తింప చేయటం లేదు. అయితే, దీనిని రాష్ట్రంలో పూర్తిగా అనుసరించలేమని, కొన్ని వర్గాలను మినహాయించి మిగిలిన వర్గాలకు రైతుభరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

గడిచిన ఆరేళ్లలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య, సాగవుతున్న భూ విస్తీర్ణం, బడ్జెట్ కేటాయింపులపైనా ఉప సంఘం సమావేశంలో చర్చించారు. మొత్తం కలిపి రూ.80,453 కోట్లు చెల్లించగా.. ఇందులో సాగు చేయని భూములకు రూ.21,284 కోట్లు చెల్లించినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశంపై ఉపసంఘం సభ్యులు దృష్టి సారించారు. సాగుకు యోగ్యంకాని భూములకు ఎట్టి పరిస్థితుల్లో రైతుభరోసా ఇవ్వొద్దని తీర్మానించారు. కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు, స్థిరాస్తి వెంచర్లు, రహదారుల భూసేకరణలో పోయిన భూములకు కూడా గత ప్రభుత్వంలో ఇచ్చారని, ఇలాంటి జాబితాలో ఉన్న భూములకు రైతుభరోసా ఇవ్వకూడదని ఏకాభిప్రాయానికి వచ్చారు. సాగు చేసిన భూములకు మాత్రమే రైతుభరోసా ఇచ్చే పక్షంలో... సంపన్నులకు, భూస్వాములకు ఇవ్వాలా?వద్దా? అనే చర్చ కూడా వచ్చింది. పదుల ఎకరాల్లో భూములున్న వారి సంగతేంటి? కటాఫ్ పెట్టాలా? కటాఫ్ పెడితే ఎన్ని ఎకరాలకు నిర్ణయించాలి? తదితర అంశాలపైనా చర్చించారు. 10 ఎకరాల వరకు కటాఫ్ పెడితే.. 12 ఎకరాలున్న రైతులకు 10 ఎకరాలకు రైతుభరోసా ఇచ్చి మిగిలిన రెండెకరాలకు మినహాయించాలనే ప్రతిపాదన వచ్చింది.

కాగా, వ్యవసాయశాఖ అధికారులు స్లాబుల వారీగా రూపొందించిన నివేదికపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐదు, ఆరు, ఏడున్నర, పది ఎకరాల వారీగా కటాఫ్ నిర్ణయించి.. ఒక్కోదానికి ఎంత బడ్జెట్ అవుతుంది? అనే గణాంకాలు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చారు. ఇందులో 20 లక్షల మందిని తొలగిస్తే ఎలా ఉంటుంది? ఎంత బడ్జెట్ తగ్గుతుంది? అన్న వివరాలనూ వ్యవసాయశాఖ అధికారులు ఉప సంఘం ముందుంచారు. దీనిపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనే చర్చించి, తుది నిర్ణయం తీసుకుందామని మంత్రివర్గ ఉపసంఘం భావించింది. విధి విధానాలు పూర్తిగా ఖరారైన తర్వాతే బడ్జెట్ లెక్కలు తేలనున్నాయి. కాగా మంత్రివర్గ ఉపసంఘం మరికొన్నిసార్లు సమావేశం కావాలని కూడా నిర్ణయిం చింది. రైతులకు సంబంధించిన అంశం కావటం, ప్రతిపక్షాలు అవకాశం దొరికితే విమర్శలు గుప్పించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరిన్ని భేటీలు నిర్వహించి సమగ్రంగా చర్చించిన తర్వాతే ప్రతిపాదనలు సిఫార్సు చేయాలని ఉపసంఘం సభ్యులు నిర్ణయించారని చెబుతున్నారు.

అయితే, ఇలాంటి సమావేశాలు ఇంకెన్నిసార్లు నిర్వహించి రైతుభరోసాను ఖరారు చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. అయితే, రైతు భరోసా పథకం అమలుపై పలు అనుమానాలు చుట్టుముడుతున్నాయి. దీనికోసం రూపొందించే మార్గదర్శకాలు ఎలా ఉంటాయోనన్న బెంగ అన్నదాతల్లో మొదలయ్యింది. రైతు భరోసా పథకాన్ని కుటుంబంలో ఒక రైతుకే అమలు చేస్తారన్న ప్రచారమే అందుకు కారణం. తెలంగాణలో చాలా కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు కూడా రైతులు ఉన్నారు. కానీ.. ఆ కుటుంబంలో ఒకరికే రైతు భరోసా దక్కుతుందంటే.. మిగతా వారు ఏమవ్వాలి? వారు కూడా చేసేది వ్యవసాయమే కదా. వారూ రైతులే కదా. మరి వారిని అనర్హులుగా ప్రభుత్వం నిర్ణయిస్తుందా? అనేది ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం దీనిపై ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. అంతేకాదు.. ఏడు ఎకరాలకే కటాఫ్‌గా నిర్ణయించాయి, అంతలోపు భూములున్న వారికే రైతుభరోసా వర్తింపజేస్తారన్న ప్రచారం జరుగుతోంది. కాగా, రాష్ట్రంలో దాదాపు 90 శాతం మంది రైతులకు 7 ఎకరాల లోపే భూమి ఉందని ప్రభుత్వం వివరణ ఇస్తోంది. అందువల్ల రైతు భరోసాను ఆ మేరకే ఇస్తారా అనేది కూడా తేలాల్సి ఉంది. ఒకవేళ అంతకంటే ఎక్కువ ఎకరాల్లో పంటను సాగుచేస్తున్నా.. ఏడు ఎకరాల వరకే పొందే పరిస్థితి ఉంటే.. కొంతమంది రైతులు నష్టపోతారనే వాదన ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది రైతులను అనర్హులుగా చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. గరిష్ఠంగా 45 లక్షల మంది రైతులకే ఈ పథకం కింద ఆర్థికసాయం చేసే అవకాశం ఉందని అంటున్నాయి. జరుగుతున్న ప్రచారాలను బట్టి చూస్తే.. .రైతుభరోసా ఎవరికి వస్తుంది? ఎవరు రాకపోవచ్చు?అనేది పల్లెల్లో పెద్ద చర్చగా మారింది.

తెలంగాణలో చాలా కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు కూడా రైతులు ఉన్నారు. కానీ.. ఆ కుటుంబంలో ఒకరికే రైతు భరోసా దక్కుతుందంటే.. మిగతా వారు ఏమవ్వాలి? వారు కూడా చేసేది వ్యవసాయమే కదా. వారూ రైతులే కదా. మరి వారిని అనర్హులుగా ప్రభుత్వం నిర్ణయిస్తుందా? అనేది ఆందోళన కలిగిస్తోంది.

**సుజాత గోపగోని,**
6302164068, సీనియర్ జర్నలిస్ట్

ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభలు డిసెంబరు 28,29 తేదీల్లో విజయవాడలోని కేబీఎన్ డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగాయి. పొట్టిశ్రీరాములు ప్రాంగణంలోని రామోజీరావు ప్రధాన వేదికపై రెండు రోజుల్లో 12 సదస్సులు జరిగాయి. మరో రెండు చిన్న వేదికలపైనా.. 11 కవితా, సాహిత్య సమ్మేళనాలు, భాషోద్యమ, విద్యారంగ సదస్సులు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి భాషాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముగింపు సభలో మొత్తం 18 తీర్మానాలను ఆమోదించారు. అన్నింటిలో, న్యాయపాలనపై సదస్సు ఆసక్తికరంగా ఉంది. తెలుగు భాషను పదిలం చేసుకోవడానికి ప్రజలు, రాజకీయ నేతలు, ప్రభుత్వాలు, రచయితలు, మేధావులు చేయిచేయి కలిపి అడుగులు వేయాలని ఈ మహాసభలు దిశానిర్దేశం చేశాయి. మొదటిరోజు సభను సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. వెంకటరమణ ప్రారంభించారు. రెండో రోజు కూడా పలువురు న్యాయమూర్తులు, రాజకీయ ప్రముఖులు, సినీ, సాంస్కృతిక రంగ దిగ్గజాలు ముఖ్యఅతిథులుగా తరలివచ్చారు. రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, ప్రతినిధుల సదస్సులో మాతృభాషాభిమానం పరవళ్లు తొక్కింది. మాతృభాష నిర్లక్ష్యానికి గురవుతున్న విధానంపైనే ప్రతి సదస్సులో వక్తలు మాట్లాడారు. తెలుగుకు మళ్లీ వెలుగులద్ది భావితరాలకు చేరువ చేసేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలనే అంశంపై పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిలోనూ తెలుగును నేర్పించడం ఆరంభిస్తే.. అమ్మ భాషకు అంతమే ఉండదని నినదించారు. ప్రజలు కోరుకుంటే.. ప్రభుత్వాలు కూడా మాతృభాషలో పాలనకు మార్గం సుగమం చేస్తాయని పేర్కొన్నారు.




# అమ్మభాషకు అందలం

రాజకీయంగా భిన్న సిద్ధాంతాలను పక్కనపెట్టి మాతృభాష పరిరక్షణ కోసం కలిసికట్టుగా ప్రయాణం చేద్దామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మహాసభలో రెండోరోజు 'తెలుగు భాషాభివృద్ధి– తెలుగు భాష పరిరక్షణ – రాజకీయ నాయకుల పాత్ర' అనే అంశంపై సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతూ, అధికారుల కోసం తెలుగుభాషపై ఓ సదస్సు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఆదేశాలు తెలుగులో వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మహాసభలను మొదటిరోజు సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజా కిరణ్, ఇతర అతిథులతో కలిసి ప్రారంభించారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవాధ్యక్షులు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ, తెలుగు భాషను గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు తదితర ఎందరో ప్రముఖులు పరిపుష్టం చేశారన్నారు. అయినా నేడు వాడుక భాష ప్రజలకు దగ్గర కాలేదని, ఏ ప్రభుత్వాలు కూడా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయలేదన్నారు. 'రాష్ట్రంలో తక్షణమే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి. గత ప్రభుత్వం తెలుగుభాషను అణచివేయడానికి తీసుకువచ్చిన జీవో ఎంఎస్ 85 రద్దు చేయాలి. ఆ జీవోపై భాషాభిమాని గుంటుపల్లి శ్రీనివాస్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసి విజయం సాధించారు. అయితే ఆ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ పిటిషన్‌ను రద్దు చేసేలా చూసి పూర్వంలా తెలుగులో బోధనా విధానాన్ని ప్రవేశపెట్టాలి. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను పునరుద్ధరించాలి' అని జస్టిస్ వెంకట రమణ కోరారు.

తెలుగు పాలనా భాష కావాలని మండలి బుద్ధప్రసాద్ అభిలషించారు. రచయితలందరూ ఒకచోట కలిసి తమ భావాలను పంచుకోవటానికి ఒక వేదికను నిర్మించి అందరూ కార్యోన్ముఖులై భాషాభ్యుదయమే ధ్యేయంగా భావించే అవకాశం కల్పించటమే ఈ మహాసభల ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలల్లో నిర్బంధ తెలుగు మాధ్యమం అమలు జరిగే వరకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని, అవసరమైతే తాను కూడా సత్యాగ్రహం చేస్తానని తమిళనాడు హోసూరు లోక్‌సభ సభ్యుడు గోపీనాథ్ అన్నారు. తెలుగు వ్యక్తిగా పార్లమెంట్‌లో సైతం తాను తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేశానని ఆయన గుర్తు చేశారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల స్ఫూర్తితో తెలుగు ప్రజలు భాషాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ మాట్లాడుతూ, దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే నాలుగో భాష తెలుగు అని, అలాంటి భాషాభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి మాట్లాడుతూ, ప్రపంచ తెలుగు రచయితల సంఘం మరింత సంస్థాగతంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మాతృభాష సొంత కళ్లు అయితే పరాయిభాష కళ్లజోడు వంటిదన్న పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు సూచనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. మాతృభాషలో పట్టు ఉంటేనే ఏ భాష అయినా సులభంగా నేర్చుకోగలగుతామన్నారు.




ప్రసంగిస్తున్న సత్యకుమార్

రెండవ రోజు సదస్సులో సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేసి భాషను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయ నేతలు ఉపయోగిస్తున్న భాషపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మాతృభాష పరిరక్షణ కోసం త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలుగు పదసంపదను పెంచుకోవడానికి భాషా పండితులు నిఘంటువును తయారు చేయాలని, ఆ పదాలను పాటలు, కవిత్వాలు రాసే రచయితలకు పరిచయం చేయాలని సినీ గేయ రచయిత అనంతశ్రీరాం సూచించారు

అమెరికా తదితర దేశాలలో స్థిరపడిన తెలుగువారు తమ పిల్లలకు మాతృభాష నేర్పిస్తున్నారని, వారికి భాషపై అంత ప్రేమ ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మనకు ఎందుకు లేదని సినీ నిర్మాత అంబికా కృష్ణ ప్రశ్నించారు. తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు ఆంగ్ల పదాలకు సరిపోయే సమానార్థక పద సంపదను సృష్టించుకుని స్థిరీకరించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.కృష్ణమోహనరావు సూచించారు. సమానార్థక పదాలు లేకపోవడంతో తెలుగులో తీర్పును రాయడానికి ఎక్కువ సమయం పడుతోందని మరో




న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. తీర్పులు మాతృభాషలో వెలువరించాలంటే ముందుగా ప్రభుత్వాలు చట్టాలను తెలుగులోకి అనువదించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. ఆత్మాభిమానం ఉన్న తెలుగువారు పరాయి భాషలో సంభాషించడంపై ఆలోచించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ పేర్కొన్నారు. బ్రిటిషర్లతో పాటు ఇప్పటి మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని న్యాయ స్థానాల్లో ఇప్పటికీ అక్కడి మాతృభాషల్లోనే తీర్పులు ఇస్తున్నారని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి గుర్తు చేశారు. రాజకీయ నేతల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపినప్పుడు భాష దానికదే ఎదుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. తెలుగు భాషకు ప్రత్యేకంగా ఓ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తే బాగుంటుందని పీసీసీ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ సూచించారు.


**తెలుగు మాధ్యమం అమలు ప్రయత్నాలు**

భాషాభిమానులు, కవులు, రచయితలు, మేధావులు కోరుతున్నట్టుగా రాష్ట్రంలో అన్ని విద్యాలయాల్లోనూ ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు మాధ్యమం అమలు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్ర వరంలోని గౌతమి గ్రంథాలయం, విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయం మన భాషా వికాసానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో తోడ్పాటును అందించాయని, వాటిని సాహితీ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే నేటితరం పిల్లలకు భాషపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఎకో టూరిజం, వైల్డ్‌లైఫ్ టూరిజంతో పాటు సాహితీ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. భాషను పరిరక్షించడానికి ప్రభుత్వాలే కాకుండా పౌరసమాజం తగిన పాత్ర పోషించాలని సూచించారు. మాతృభాషను పరిరక్షించ డానికి, ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

మాతృభాషలో విద్యా బోధన జరిగినప్పుడు విద్యార్థుల్లో సంపూర్ణ మానసిక వికాసం పెంపొందుతుందని తెలిపారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు, ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ గేయ రచయిత భువనచంద్ర, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు యువ రచయితలకు వివిధ సాహిత్య ప్రక్రియలపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

## మహాసభలో తీర్మానాలు...!

★ ఇంటా బయటా, అన్ని సామాజిక జీవన వ్యవహారాలలో తెలుగు వినియోగాన్ని పెంపొందించాలి.
★ సమస్త వృత్తులు, జీవన విధానాలలో కనుమరుగైపోతున్న తెలుగు పదాలను వెలికితీసి ప్రాచుర్యం కల్పించడంతోపాటు,రచయితలు భాషాభిమానాన్ని కలిగించే రచనలు చేయాలి.
★ ఆంగ్ల పదాలకు సమానమైన, సహజమైన పదాలను లు రచయితలను సృష్టించాలి.
★ బాలల మనో వికాసానికి తోడ్పడేలా కనీసం ప్రాథమిక విద్య వరకూ తెలుగులోనే బోధన జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.
★ డిగ్రీస్థాయిలో అన్ని సెమిస్టర్లలో తెలుగుని ఒక పాఠ్యాంశంగా బోధించాలి.
★ సాంకేతిక విద్యనూ మాతృభాషలోనే బోధించాలనే కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ఈ మహాసభ స్వాగతిస్తోంది.
★ గత ప్రభుత్వం జారీ చేసిన జీ.వో రాష్ట్ర హైకోర్టు కొట్టి వేసిన నేపథ్యంలో నాటి ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఉపసంహరించాలి.
★ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు నిధులు కేటాయించి పటిష పరచాలి.
★ ప్రజలకు ప్రభుత్వం చేరువయ్యేందుకు వీలుగా పాలనా వ్యవహారాలన్నీ, ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రభుత్వ ఉత్తర్వుల జారీ తెలుగులోనే జరిగేలా చర్యలు తీసుకోవాలి.
★ తెలుగు అకాడమీ పూర్వ ఔన్నత్యాన్ని నిలపాలి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి
★ రాష్ట్రం విభజనలో కోల్పోయి రాష్ట్ర గ్రంథాలయం, పురావస్తు ప్రదర్శన శాల, ఆర్కియాలజీ మ్యూజియం, స్టేట్ ఆర్కీవ్స్ లాంటి సంస్థలను ఏర్పాటు చేయాలి.
★ తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
★ తెలుగు సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టటానికి, తెలుగు కళారూపాలను, దృశ్యకళలను కాపాడటానికి భాషా, సాంస్కృతిక విధానాన్ని రూపొందించాలని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలను మహాసభ కోరింది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



# ముంబై చర్చ్‌లో జాతీయగీతాలాపన

క్రిస్మస్ ఉత్సవాల సందర్భంగా ముంబైలోని అఫ్గాన్ చర్చ్ దేశం దృష్టిని ఆకర్షించింది. ఆ రోజున క్రైస్తవ గీతాలతో పాటు జాతీయ గీతం కూడా ఆలపించారు. పండుగ వాతావరణంలో జాతీయ భావం వెల్లివిరిసింది. దీనితో చాలామంది ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలియచేస్తూ ఆనంద పరవశులవుతున్నారు. వీటికి లక్షలలో వ్యూస్ కూడా వస్తున్నాయి. ఆ కార్యక్రమం చూసి రోమాంచితుడనయ్యాను అని ఒక నెటిజన్ వ్యాఖ్యానించాడు. జాతీయ గీతం వారు చాలా గొప్పగా ఆలపించారు. ఇంత చక్కగా పాడడం అరుదు అని ఒక నెటిజన్ పొగిడాడు. శుభ పరిణామమే.

‘రాహుల్ గాంధీ జార్జ్ సోరోస్ సంస్థకి సహ అధ్యక్షుడు, సోనియా గాంధీ కూడా సోరోస్ డబ్బులు ఇచ్చే సంస్థ డెమాక్రటిక్ లీడర్స్ ఆసియా పసిఫిక్ సహ అధ్యక్షురాలు. ఆ సంస్థలన్నిటి ధ్యేయం కశ్మీర్‌కు స్వాతంత్ర్యం. అందుకే బెలగావి కాంగ్రెస్ సమావేశాలలో పెట్టిన భారత భౌగోళిక చిత్ర పటంలో కశ్మీర్ లేకుండా, చైనా, పాకిస్తాన్‌లలో కలిపేశారు’ అన్నారు బీజేపీ ఐటి సెల్ అధిపతి అమిత్ మాలవీయ. ఇంకా, ‘అదేదో పొరపాటున జరిగింది కాదు. వాళ్ల మనసులలో ఉన్నదే పటం మీద కనపడింది. కశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలిపేశారు’ అని కూడా ఆయన తేటతెల్లం చేశారు. కాబట్టి రాహుల్ గాంధీ ‘ప్రేమ దుకాణం’ నిరంతరం చైనా కోసం తెరిచే ఉంటుందని కూడా బీజేపీ వారు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం బెలగావిలో జరుగు తున్న కాంగ్రెస్ సీడబ్ల్యుసీ సమావేశాలలో ఇలాంటి మ్యాప్ దర్శనమిచ్చింది. అంటే కశ్మీర్ లేని భారత పటం. అందుకే బీజేపీ జనవరి 26వ తేదీన ఆ విషయం దేశం దృష్టికి తీసుకువెళ్లింది.

# సిగ్గు లేదు, అందుకే



తస్లీమా నస్రీన్

భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి, ప్రజాస్వామ్య రక్షణ గురించి, రాజ్యాంగ పరిరక్షణ గురించి ఇండియా కూటమి గొంతు చించుకుంటూ ఉంటుంది. దాని నాయకుడు రాహుల్ గాంధీ నిత్యం రాజ్యాంగ ప్రతిని చేత్తో పట్టుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు తాజా ఉదంతాలను ప్రస్తావించాలి. ప్రఖ్యాత బాంగ్లాదేశ్ రచయిత్రి తస్లిమా నస్రీన్ రాసిన నాటకం ‘లజ్జ’ ప్రదర్శనను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హఠాత్తుగా నిషేధించింది. ఇంకొక పరిణామం– 36 ఏళ్ల క్రితం రాజీవ్‌గాంధీ హయాంలో నిషేధానికి గురైన సల్మాన్ రష్దీ వివాదాస్పద నవల ‘సాటానిక్ వర్సెస్’ మీద బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇప్పుడు నిషేధం తొలగి పోవడం.

‘మీరు రాసిన ‘లజ్జ’ నాటకం ప్రదర్శిస్తే, అది ముస్లింలను రెచ్చగొట్టడమే అవుతుంది. వారు దాడులకు దిగవచ్చు.’ ప్రఖ్యాత రచయిత్రి తస్లిమా నస్రీన్‌కు పశ్చిమ బెంగాల్ పోలీసులు, అంటే మమతా బెనర్జీ పోలీసులు ఇచ్చిన సంజాయిషీ ఇది. తాను రాసిన నాటకం ప్రదర్శించకుండా నిషేధించినందుకు నస్రీన్ మమతా బెనర్జీని విమర్శించారు. రెండు నెలల నుంచి ఈ నాటక ప్రదర్శన గురించి అంతటా వాల్‌పోస్టర్లతో ప్రచారం చేసిన తరువాత కూడా హఠాత్తుగా నిషేధించడం దారుణమని తన ఫేస్‌బుక్ ఖాతాలో నస్రీన్ దుమ్మెత్తి పోశారు. హుగ్లీలోని గోబర్డనంగ, పాండువ వద్ద జరుగుతున్న నాటకోత్స వాలలో ఈ ప్రదర్శన ఏర్పాటయింది. ఇప్పుడు మిగిలిన అన్ని నాటకాలకు అనుమతి ఇచ్చి ఒక లజ్జను మాత్రమే నిషేధించారు. నబాపల్లి నాట్య సంస్థాన్ ఈ ప్రదర్శన ఇవ్వవలసి ఉంది. నిజానికి ఈ నాటకం ఢిల్లీలో మూడుసార్లు ప్రదర్శించారు. అన్ని ప్రదర్శన లకు జనం ఎగబడ్డారు. ఈ నాటకం ముస్లింలను రెచ్చగొట్టి దాడులకు ప్రేరేపిస్తుందని పోలీసులు చెబుతున్నారని, గతంలో కూడా ఇదే కారణం చెప్పి ఆకాశ్ 9 టీవీ చానల్‌లో ప్రసారం కావలసిన తన సీరియల్ దస్సహహెూబాస్‌ను నిషేధించారని ఆమె ఆరోపించారు. లజ్జ ఇతివృత్తం బాంగ్లాదేశ్‌కు సంబంధించినది, కానీ అది చూసి బెంగాలీ ముస్లింలు ఎందుకు రెచ్చిపోవాలని, ఎందుకు దాడులకు దిగాలని కూడా ఆమె ప్రశ్నించారు. ముస్లింల దాడుల కారణం చెప్పే తనను బెంగాల్‌లో లేకుండా చేశారని ఆమె గుర్తు చేశారు. మమతా బెనర్జీ రాష్ట్రంలో కళాకారులు, రచయితల గొంతు ఎందుకు నొక్కుతు న్నారని, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడవలసిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. ముస్లింలు రెచ్చిపోయి దాడులు చేసే ప్రమాదం ఉంది కాబట్టి నాటక ప్రదర్శనను నిషేధించడం సరికాదని, ఇలా చెప్పడం శాంతిభద్రతల రక్షణ విషయంలో మమత ప్రభుత్వం విఫలమైనట్టేనని బీజేపీ ఐటీసెల్ అధినేత అమిత్ మాలవీయ విమర్శించారు. ఇలాంటి నిషేధాలు పశ్చిమ బెంగాల్ కనీవినీ ఎరుగునిదని


# కాంగ్రెస్‌కు కావలసిందే కశ్మీర్‌లేని భారత్




సమావేశాలు కూడా ఆ రోజే మొదలయ్యాయి. రాహుల్, సోనియా, ప్రియాంకల కటౌట్‌లు మూడింటి మీద కూడా ఇలా కశ్మీర్ లేని భారత పటాన్నే చిత్రించారు.

అదేమీ పొరపాటు కాదు, అది బుజ్జగింపు రాజకీయాలలో భాగం. భారతీయ ముస్లింలు పాకిస్తాన్‌కే ఎక్కువ విధేయులని వాళ్ల నమ్మకం అని కూడా మాలవీయ దుయ్యబట్టారు. అసలు కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆధునిక ముస్లిం లీగ్. దాని ఆశయమే దేశాన్ని చీల్చడమని ఆయన అన్నారు. కర్ణాటకలోని బెలగావిలో రెండురోజుల సీడబ్ల్యుసీ సమావేశాలు డిసెంబర్ 26న మొదలయ్యాయి (కానీ మన్మోహన్ మరణించడంతో నేతలంతా ఢిల్లీ రావలసి వచ్చింది). బెలగావి సమావేశాలకు మాత్రమే గాంధీజీ 1924లో అధ్యక్షత వహించారు. ఇప్పుడు నకిలీ గాంధీలు, నకిలీ కాంగ్రెసు సమావేశాలు నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి, జేడీ (ఎస్) నాయకుడు హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారు. గాంధీజీ సిద్ధాంతాలకు పునరంకితం కావాలన్న నినాదంతో ఈ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఎందుకంటే గాంధీ సిద్ధాంతాల నిర్మూలనకు ఒక పథకం ప్రకారం దేశంలో కుట్ర జరుగుతున్నదట. మొత్తానికి మన్మోహన్ సింగ్ శాపమేదో కాంగ్రెస్‌కు ఉంది. లేకపోతే రెండు రోజుల సమావేశం ఒకరోజుతో ఎలా ముగుస్తుంది? ఎన్ని అవమానాలు పడ్డారో పాపం, ఆయన! ★

# 'లజ్జ' వద్దన్నారు




సల్మాన్ రష్దీ

ఆయన అన్నారు. కళ, సంస్కృతి, భావ ప్రకటనా స్వేచ్ఛలను ముస్లిం దాడుల పేరుతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాబట్టి మమత పదవి నుంచి వైదొలగడం మంచిదని ఆయన అన్నారు. అయోధ్యలో వివాదాస్పద మసీదు కూలిన తరువాత బాంగ్లాదేశ్‌లో మైనారిటీలపై (హిందువులపై) వారి ఆలయాలపై జరిగిన దాడుల ఆధారంగా నస్రీన్ 'లజ్జ' పేరుతో నవల రాశారు. ఆ తరువాత ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. 1993లో ఆ నవల వెలువడింది. తరువాత నుంచి ఆమె బాంగ్లాదేశ్‌లో అడుగు పెట్టలేకపోయారు. స్వీడన్, జర్మన్, అమెరికాలలోను చాలాకాలం ఉన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఆమె తలదాచుకుంటున్నారు.

'సాటానిక్ వర్సెస్' నవల గురించి కొన్ని మాటలు. సల్మాన్ రష్దీ రాసిన ఆ నవలను రాజీవ్‌గాంధీ ప్రభుత్వం నిషేధించింది. చిత్రం ఏమిటంటే ఈ నవల మహమ్మద్ ప్రవక్తను విమర్శించింది కాబట్టి దైవదూషణ కిందకు వస్తుందని మూడున్నర దశాబ్దాల క్రితమే ఇరాన్ ఖొమైనా మరణశాసనం రాశాడు. ఆ ఫత్వాను అమలు చేయడానికి రెండేళ్ల కూడా ప్రయత్నం జరిగింది. ఇప్పుడు దీని మీద నిషేధం ఎత్తివేశారు. నాడు ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టులో వేసిన కేసును నవంబర్‌లో కొట్టేశారు. అందుకే రాజదాని ఢిల్లీలో ఈ నవల లభ్యమవు తున్నది. రూ.1,999 ధర ఉన్నా ఎగబడి కొంటున్నా రని పుస్తక విక్రేతలు చెబుతున్నారు. ఈ పుస్తకం మీద పోరాటం పేరుతో ముస్లిం మతోన్మాదులు చేసిన విధ్వంసం ఇంతా అంతా కాదు. ఫలితంగా రష్దీ పదేళ్లు అమెరికా, ఇంగ్లండ్‌లలో అజ్ఞాతంలో ఉండిపోయారు. ఆగస్ట్ 12,2022న అమెరికాలో ఉంటున్న లెబనాన్ మూలాలు ఉన్న హాది మతార్ రష్దీ మీద హత్యాయత్నానికి పాల్పడ్డాడు. రష్దీ కన్ను పోయింది. ప్రాణాలతో బతికి బయట పడ్డారు. ఈ నవలను జపనీస్‌లోకి అనువదించిన హితోషి ఇగారషిని కూడా ముస్లిం మతోన్మాదులు చంపేశారు.

నిజానికి సాటానిక్ వర్సెస్ ప్రతులు పరిమితంగానే ఉన్నాయి. అయినా సరే, ముస్లిం సంఘాలు ఈ పుస్తకం అమ్మకాల మీద మండిపడుతున్నాయి. ఆ పుస్తకం మీద వెంటనే తిరిగి నిషేధం విధించాలని కోరుతున్నాయి. ఉత్తరప్రదేశ్ జమాత్ ఎ ఉలేమా ఇ హింద్ న్యాయ సలహాదారు ఒక మహత్తరమైన విషయం చెప్పారండోయ్! భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో ఒక మతంవారి మనోభావాలకు, అవి కూడా భారత రాజ్యాంగం ప్రసాదించినవి– దెబ్బ తగలకూడదట. సాటానిక్ వర్సెస్‌లో దైవ దూషణ ఉందని ఆయన తేల్చారు. కానీ దీని మీద నిషేధం ఎత్తివేసింది ఢిల్లీ హైకోర్టే మరి! అయినా సరే, ఒకసారి నిషేధించిన ఇలాంటి పుస్తకాన్ని మళ్లీ అమ్మకానికి పెట్టడం అంటే ముస్లింలలో ఉద్రేకాలను రెచ్చ గొట్టడమేనని కూడా సెలవిచ్చారు.కాబట్టి ప్రభుత్వం మళ్లీ నిషేధించాలని చెప్పారు.షియా పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా యాకుబ్ అబ్బాస్ కూడా ఇదే కోరారు. అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ కూడా ఇదే కోరారు. చిత్రం ఏమిటంటే, ఆ నవలలో హిందూ దేవతల మీద కూడా కారుకూతలు ఉన్నాయి. అయినా హిందూ సంఘాలు ఇప్పటిదాకా ఎక్కడా నోరెత్తలేదు.

మేధావులు, ఉదారవాదులు, సెక్యులరిస్టులు ఈ రెండు పరిణామాల గురించి ఏం చెబుతారు? దేశంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయని తెగ వాగేవాళ్లు సాటానిక్ వర్సెస్ మీద నిషేధం ఎత్తి వేయడం, అది మార్కెట్‌లో రావడం గురించి ఏమంటారు? ★




# హంతకుడికి

**డి**సెంబర్ 17న కోయంబత్తూరులో జరిగిన సంఘటనలు దేశం ముందుకు రాకపోవడానికి పెద్ద కారణాలే ఉండి ఉంటాయి. ఆ ముందు రోజు చనిపోయిన ఒక వ్యక్తి అంత్యక్రియల కార్యక్రమం అది. వందలాది మంది ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ చనిపోయిన వ్యక్తి పేరు ఎస్‌ఏ బాషా. ఇతడు ఎవరో కాదు. బీజేపీ అగ్రనేత లాల్ కిషన్ అద్వానీ లక్ష్యంగా 1998లో వరుస పేలుళ్లు జరిపి 58 మంది చావుకు కారణమైనవాడు. డీఎంకే ప్రభుత్వం ఇతడికి దాదాపు రాజలాంఛనాలతో అంత్యక్రియలు జరిపించే అవకాశం కల్పించింది. ఈ సంగతి దేశంలో చాలామందికి ఈనాటికీ తెలియదు.

తన తండ్రి ఎస్‌ఏ బాషా డిసెంబర్ 16 సాయంత్రం చనిపోయాడని కొడుకు సిద్దిక్ అలీ ప్రకటించాడు. ప్రస్తుతం పెరోల్ మీద బయటకు వచ్చిన ఇతడికి వృద్ధాప్యపు సమస్యలతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మరణించాడు. అతడికి కోయంబత్తూరులోనే ప్రఖ్యాత పూల మార్కెట్ వద్ద ఉన్న హైదరాలీ–టిప్పు సుల్తాన్ శ్మశానవాటికలో ఘనంగా నిర్వహించాలని కుటుంబం భావిస్తున్నదని కూడా అలీ ప్రకటించాడు. ఆ మేరకు ఆఖరియాత్రకు పెద్ద ఎత్తు ఏర్పాట్లు జరిగాయి. అయితే ఇందుకు బీజేపీ,కొన్ని ఇతర సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. నిరసన నిర్వహించినందుకు బీజేపీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు అన్నామలైని రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసింది.

ఫిబ్రవరి 14, 1988న కోయంబత్తూరులో అద్వాణి పర్యటన ఉంది. అప్పుడు ఆయన పార్టీ అధ్యక్షుడు. ఆయన రాకకు కొద్దిముందు వరుస పేలుళ్లు సంభవించాయి. 58 మంది చనిపోయారు. 230 మంది వరకు గాయపడ్డారు. ఈ పేలుళ్ల కారకుడే బాషా. అల్ ఉమ్మా అనే నిషిద్ధ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు. 1990లో మాత్రమే ఏర్పాటయిన ఈ సంస్థకు, బాషాకు ఎన్నో నేరాలతో సంబంధం ఉంది. హిందూ మున్నాని ప్రముఖుడు రామా గోపాలన్ మీద దాడి కేసు అందులో ఒకటి. కోయం బత్తూరు పేలుళ్ల తరువాత అల్ ఉమ్మాను నిషేధిం చారు. బాషాకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఇప్పుడు 84వ ఏట మరణించాడు.

అతడిని జైలు నుంచి బయటకు తీసుకురావడానికి చాలా ప్రయత్నాలే ముందు జరిగాయి. అందులో ఒకటి అనారోగ్య కారణాలతో విడుదల చేయమని



# జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత ఎమ్‌టీ కన్నుమూత

**ఆ**ధునిక మలయాళీ సాహిత్యంలో ప్రముఖుడు, ఎమ్‌టీ వాసుదేవన్ నాయకర్ డిసెంబర్ 24న తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 91 ఏళ్లు. ఆయన చిత్రానువాదాలకు కూడా ప్రసిద్ధి చెందారు. ఎమ్‌టీ (1933–2024) నవలలు భారతదేశంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచాయి. ఆయన కేరళలోని పాలక్కాడ్ జిల్లా కడలూరులో జన్మించారు. 1995లో ఆయన జ్ఞానపీఠం అందుకున్నారు. మొదట కొద్దికాలం ఉపాధ్యా వృత్తిలో ఉన్నప్పటికీ మాతృభూమి వారపత్రికలో చేరి పత్రికా రచయితగా మారారు. 1959లో ఎమ్‌టి వెలువరించిన నవల 'నాలు కెట్టు' (నాలుగు భాగాలు) భారతీయ సమాజంలో ప్రాధాన్యం కోల్పోతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి చర్చించింది. ఆయన 'రండమూళం' (రెండో పర్యాయం) నవల మహాభారతాన్ని భీముడి పాత్ర కోణం నుంచి రాసినది. దీనికి భారతీయ సాహిత్యంలోనే ప్రముఖ స్థానం ఉంది.



# హిందూ అధ్యయ

**వ**చ్చే విద్యా సంవత్సరం 2025–26 నుంచి హిందూ అధ్యయనంలో పరిశోధనలు ప్రారంభించాలని ఢిల్లీ విశ్వ విద్యాలయం నిర్ణయించింది. స్థాయి సంఘం ఈ మేరకు ప్రతిపాదించింది. సెంటర్ ఫర్ హిందూ స్టడీస్ పాలక మండలి పీహెచ్.డీ. కార్యక్రమాన్ని సిఫారసు చేసింది. మొదట ఈ విద్యా సంవత్సరం నుంచే ఆ పీహెచ్.డీ. కార్యక్రమం ప్రవేశపెట్టాలని

# రాచమర్యాద

కోరడం. ఇందుకు సంబంధించి అతడి కూతురు బి. ముబీనా పిటిషన్ దాఖలు చేసింది. దీనికి మద్రాస్ హైకోర్టు నిరుడు ఆగస్టులో అనుమతించింది. అది ఎందుకు జరిగిందంటే తమిళనాడు ప్రభుత్వం అంటే డీఎంకే ప్రభుత్వం ఇందుకు అభ్యంతరం చెప్పలేదు. దీనితో మూడు మాసాల తాత్కాలిక బెయిల్ ఇచ్చారు. అయితే దీని మీద ఆనాడే వివాదం మొదలయింది. బాషాకు మద్రాస్ హైకోర్టు బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇదే కేసులో శిక్షలు అనుభవిస్తున్న పలువురికి సుప్రీంకోర్టు గతంలోనే బెయిల్ నిరాకరించిందని బీజేపీ ఆందోళన నిర్వహించింది.

బాషా బెయిల్ పిటిషన్ మీద రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం పట్ల నాడు అన్నామలై తీవ్ర విమర్శలు కురిపించారు. ఇది మైనారిటీల బుజ్జగింపేనని దుయ్యబట్టారు. ఈ కేసులో శిక్ష అనుభవిస్తున్న వారంతా ఉగ్రవాదులేనని ఆయన వాదన. అంతకు మించి విస్తుపోయే నిర్ణయం కూడా డీఎంకే ప్రభుత్వం తీసుకుంది. ఈ కేసుతో సంబంధం ఉండి, జైలు శిక్ష అనుభవిస్తున్న 335 మందిని శిక్ష పూర్తి కాకుండానే విడుదల చేయాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానం ఆమోదించింది. అందులో తొమ్మిది మంది ముస్లింలు ఉన్నారు.

బాషా మత గురువు. కోయంబత్తూరు పేలుళ్ల కేసులో అరెస్టు కాక ముందు ఇతడు ఉగ్రవాద కలాపాల కోసం యువకులను తయారుచేసేవాడు. 1998 వరస పేలుళ్ల కేసులో బాషా సోదరుడు నవాబ్ ఖాన్ కూడా అరెస్టయ్యాడు. ఇతడికి 27 ఏళ్లు కఠిన కారాగారవాస శిక్ష విధించారు. నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు (2003) ఆయనను చంపుతానని బాషా బెదిరింపులు పంపాడు. 2022లో కోయంబత్తూరులో జరిగిన కారు బాంబు పేలుడులో ప్రధాన నిందితుడు మహమ్మద్ దాల్కా ఇతడి బంధువే. ఇంకొందరు బంధువులతో కలసి ఇతడు కార్యకలాపాలు నిర్వహించేవాడు. నిరంతరం వివాదాస్పద ప్రకటనలతో వార్తలలో ఉండే నామ్ తమిళార్ కచ్చి నాయకుడు సీమాన్ అయితే బాషాను తండ్రివంటి వాడని శ్లాఘించాడు. బాషా మరణం పెద్ద విషాదమని వాపోయాడు కూడా. అతడు నిర్దోషి అయినప్పటికి కాపాడుకోలే పోయానన్న క్షోభ తనను బాధిస్తున్నదని కూడా ఒక ప్రకటనలో చెప్పాడు.

మూడు మాసాల బెయిల్‌తో బయటకు వచ్చినప్పుడు వన్నియారసు (విడుతలై చిరుతైగల్ సంస్థ సభ్యుడు) బాషాను కౌగిలించుకోవడం వివాదాలకు దారి తీసింది. ఆ సంస్థ ఎల్‌టీటీఇ అనుకూల, హిందూ వ్యతిరేక సంస్థ. మరణవార్త విన్న తరువాత అతడు సామాజిక మాధ్యమాలలో బాషాకు వీర వణక్కం ప్రకటించాడు. అంటే వీర వందనం. వన్నియారసును వెంటనే జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేయాలని పలువురు కోరుతున్నారు.

దక్షిణ ఉక్కడం బాషా స్వగ్రామం. అక్కడ నుంచి కోయంబత్తూరులోని శ్మశానవాటికకు అతడి మృతదేహాన్ని తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద కసరత్తే చేసింది. అంతిమయాత్ర కూడా భారీగా జరిగింది. ఇందుకు రెండువేల మంది పోలీసులను నియమించారు. సెలవులో ఉన్నవారిని కూడా తిరిగి విధులకు హాజరు కావలసిందిగా ఆగమేఘాల మీద ఆదేశాలు ఇచ్చారు. ఈ అంతిమయాత్రకు వందలలో జనం వచ్చారు. పలు పార్టీల నాయకులు కూడా హాజరయ్యారు. ఉగ్రవాది అంతిమయాత్రకు అనుమతి ఇచ్చి అమరుడి స్థాయి కల్పించిన ఈ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన కవాతుకు మాత్రం అనుమతి నిరాకరించిందని బీజేపీ నేతలు విమర్శించారు.

ఇలాంటి నరహంతుకుడి అంతిమయాత్రకు అనుమతించి డీఎంకే తన బుజ్జగింపు ధోరణిని బయటపెట్టుకుందని బీజేపీ విమర్శించింది. ఇలాంటి వ్యక్తి అంతిమయాత్రకు అనుమతినిచ్చి డీఎంకే ప్రభుత్వం జాతీయ భద్రతకు సంబంధించి కొత్త చర్చకు తెరలేపిందని కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ విమర్శించారు. డీఎంకే తన ఓటు బ్యాంకు రక్షణ కోసం, దేశ రక్షణను పణంగా పెట్టిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి పూనావాలా విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ కనుసన్నలలో జరిగిన ఉగ్రవాద చర్యగానే చూడాలని ఆయన అన్నారు.★




# ...నంలో పీహెచ్.డీ.

అనుకున్నారు. హిందూ స్టడీస్ జాయింట్ డైరెక్టర్ ప్రేమా మల్హోత్రా ఈ వివరాలు తెలియచేశారు. విశ్వవిద్యాలయంలో హిందూ అధ్యయన విభాగం 2023లో ప్రారంభించారు. ప్రస్తుతం రెండేళ్ల పోస్టు గ్రాడ్యుయేషన్ అందుబాటులో ఉంది. తొలి విడత విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తిచేశారు. ఆర్ష వాఙ్మయం ఇక్కడ బోధిస్తారు. ★

# చిన్మయ కృష్ణప్రభు ఆరోగ్యం విషమం



**బాంగ్లాదేశ్ హిందువుల** హక్కుల కోసం పోరాడుతూ అరెస్టయిన ఇస్కాన్ సాధువు చిన్మయ కృష్ణప్రభు ఆరోగ్యం విషమంగా ఉందని నివేదికలు వస్తున్నాయి. కారాగారంలో ఆయనకు సరైన వైద్యం అందించడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కానీ రెండు పర్యాయాలు ఆయనను ఆసుపత్రిలో చేర్చారు. అందుకే జనవరి 1, కొత్త సంవత్సరం సందర్భంగా హిందువులు, హక్కుల ఉద్యమకారులు, భావ సారూప్యత కలిగిన వారు అంతా ఆయన స్వస్థత కోసం ప్రార్థనలు జరపాలని ఇస్కాన్ విజ్ఞప్తి చేసింది. ★

"సరస్వతీ నమస్తుభ్యం..
వరదే కామరూపిణీ..
విద్యారంభం కరిష్యామి.. సిద్ధిర్భవతుమే సదా..
పద్మపత్ర విశాలాక్షీ.. పద్మకేసరి వర్ణినీ...
నిత్యం పద్మాలయాందేవీ.. సామాంపాతు సరస్వతీ..!"

భక్తిశ్రద్ధలతో వాగ్దేవిని మనస్ఫూర్తిగా ప్రార్థించి, సాష్టాంగ నమస్కారం చేశాయి అక్షరాలు, వాటి వినయ విధేయతలకూ, భక్తిప్రపత్తులకూ సరస్వతీదేవి ముగ్ధురాలై పోయింది.

అక్షరాలన్నీ మూకుమ్మడిగా వచ్చి, తనని వేడుకునేసరికి తనువెల్లా పులకించిపోయింది అక్షరమాతకి. వెంటనే తన వీణని శ్రుతి చేసి, ఆనందమయంతో రాగాలాపన చేసింది. సప్త సముద్ర తరంగాలవలె సప్తస్వరాలు ఉవ్వెత్తున స్వరఝరితో ఎగిసిపడుతుంటే, అది విన్న అక్షరాలు కూడా తన్మయత్వంతో ఊగిపోతూ.. రాగాలహరిలో తేలిపోతున్నాయి.

పులకించిపోతున్న తన పిల్లలాంటి అక్షరాలను చూసి, సరస్వతీదేవి పరవశించిపోతూ.. వీణాధరియై ఆలపిస్తోంది.

ఇంతలో...

ఎక్కడో అపశ్రుతిలా.. 'ఆరున్నొక్క రాగం' వినపడే సరికి, సరస్వతీదేవి నిర్ఘాంతపోయింది..!

తన చేతిలోని వీణని శ్రుతి చేసి, తీగల్ని మళ్లీ మీటింది. అయినా.. ఆ రాగం అలాగే వినిపిస్తోంది.

అది తన వీణలోనుంచి వస్తున్న రాగం కాదని గమనించి, అక్షరాలపై చూసింది.

కంటికీ మింటికీ ఏకధారలా అక్షరాలన్నీ ఏడుస్తున్నాయి..!

వాటి శోకాన్ని గమనించి, విచలితురాలయింది సరస్వతీమాత..!!

గుండె తరుక్కుపోయి, తల్లడిల్లిపోతున్న తల్లి మనసుతో అక్షరాలను అడిగింది. "ఏంట్రా..? ఏమైందీ..??

ఆర్ద్రతతో అడిగిన సరస్వతీమాతని చూసి, ఎగిసివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్చాయి అక్షరాలు.

శోకసముద్రాలైన అక్షరాలని చూసి, కంగారుపడిపోయింది సరస్వతీ మాతృహృదయం.

చేతిలోని వీణని ప్రక్కకు పెట్టి, ఒక్క మెట్టు దిగి.. అక్షరాల దగ్గరకు వచ్చింది వాగ్దేవి.

పుత్రవాత్సల్యంతో ఆక్కున చేర్చుకొని, తల నిమురుతూ అడిగింది. "ఏంటీ..? ఏమైందీ..? ఎంతటి ఉపద్రవమైనా తీర్చుతాను. ముందు ఏం జరిగిందో చెప్పండీ..?"

చంటిపిల్లల్లా అరచేతులతో కన్నీటిని తుడుచుకుంటూ "అమ్మా..! జగన్మాతా..!! నీకు తెలియదా తల్లీ..? అందరి తలరాతలను రాసే, చతుర్ముఖుని సతీదేవివి..! మేము చెప్పాలా– అమ్మా..?!?" అడిగాయి అక్షరాలు.

సరస్వతీదేవి చిన్నగా నవ్వి, అడిగింది. "మీరూ విద్యార్థుల్లానే తయారయ్యారు. ప్రశ్నకు ప్రశ్న సమాధానం చెపితే ఎలా..? మీ మనసుకు బాధ కలిగించిన అంశం ఏమిటో మాకెలా తెలుస్తుంది..?"

**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన**



ఒక్క క్షణం ఫెయిల్ అయిన విద్యార్థుల్లా.. తలవంచుకొని నిలుబడ్డాయి అక్షరాలు.

వాటి దిగులును చూసి, "నేను స్కూల్లో టీచర్ని కాదు, మీ కన్నతల్లిని.." అంది అక్షరమాత.

ఆ ఆప్యాయతకి పులకించిపోతూ అడిగాయి అక్షరాలు.

"మేం అక్షరాలమే కదా..?" అడిగింది ఘ అక్షరం.

"ఔను.. కాదని ఎవరైనా అన్నారా..?!" అంది సరస్వతీదేవి.

"అక్షరం అంటే, 'నాశనము లేనిది' అనే అర్థం కదా..?!" అడిగింది ఋ అక్షరం.

'నిజమే కదా..!" అన్నట్లు చూసింది సరస్వతీదేవి.

"మరి, ఈమధ్య నన్ను పట్టించుకుంటున్నారా..? నన్నే కాదు చాలా అక్షరాలను మరిచిపోతున్నారు..!" అంటూ దిగులుపడింది ఋూ అక్షరం.

"నిజమే.. నాకు ఎక్కడో చదివిన మినీ కవిత గుర్తుకొస్తుంది..

***మనిషి...***
***తెలుసుకొని,***
***తెలుసుకొని,***
***తెలివిమంతుడవుతాడు..!***
***ఇంకా..***
***ఇంకా... ఇంకా...***
***అతిగా తెలుసుకొని,***
***'అతి తెలివిమంతుడవుతాడు..!!"*** చెప్పింది సరస్వతీమాత.

కన్నీటితో తడిసిన అక్షరాల పెదవులపై చిరునవ్వు వెలగలేదు..!

అదే దిగులుతో, ఆవేదనతో కురవడానికి సిద్ధంగా ఉన్న శ్రావణమేఘల్లా ఉన్నాయి అక్షరాలు.

"ప్రభవ నుండి అక్షయ వరకు తెలుగు సంవత్సరాల్లా.. మేం కూడా 60 అక్షరాలుగా ఉండేవాళ్లం. 18వ శతాబ్దం వరకు బాగానే ఉన్నాం.. 19వ శతాబ్దం వచ్చేసరికి 56 అక్షరాలమయ్యాం. ఇప్పుడు, 46కు పడిపోయాం. ఇంకా కొందరికైతే, 'తెలుగు అక్షరాలెన్ని? అవి ఏమిటి..?' అనడిగితే.. వింతగా చూస్తారే కానీ, ఏ ఒక్కరూ సరైన సమాధానం చెప్పే పరిస్థితిలో లేరు. ఇలాగైతే, రోజురోజుకీ మా సంఖ్య తగ్గిపోయి, మేం అంతరించిపోయే ప్రమాదం ఉంది.." తమ మనోవేదనని వివరించాయి అక్షరాలు.

"నిజమే.. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియాలంటే, ఒక్కసారి ఈ లోకం తీరుని గమనించండి.. మీకే తెలుస్తుంది.." అంది సరస్వతీమాత.

ఆ మాటతో ఒక్క క్షణం.. టీచర్ సిలబస్ చెప్పకుండానే, ఎగ్జామ్ పెట్టినట్లు బెదిరిపోయాయి. అక్షరాలు..!

"అయ్యో..పాపం..!" అంటూ ఉలిక్కిపడి లేచాడు విద్యాసాగర్.

అర్ధరాత్రి వేళ.. నిద్రలేచి కూర్చున్నతన్ని చూసి, తలపైకెత్తి "ఏమైందీ..? పీడకలొచ్చిందా..?" అడిగాడు ధనుంజయ్.

చిన్నగా నవ్వుతూ "మంచి కలే వచ్చింది.." అన్నాడు విద్యాసాగర్.

"నువ్ అదృష్టవంతుడివి మేష్టారూ..! నాకు ఏ కల రావడం లేదు. అసలు నిద్రనే పట్టడం లేదు.." అన్నాడు ధనుంజయ్.

"ఇంకా.. ఆస్తిపాస్తులపై ఆశ పెట్టుకుంటే, కంటిచూపులు కాపలా కాస్తుంటాయి. నిద్ర-గుర్ఖాలా గస్తీ తిరుగుతూ ఉంటుంది.." అంటూ నవ్వాడు విద్యాసాగర్.

"ఆహా.. కమ్మని తెలుగు మాట..! తెలుగు పండితుల వారి నోట తేనెలూరే కవిత్వం వచ్చింది.." అన్నాడు సంతృప్తిగా ధనుంజయ్.

"తెలుగుకు తెగులు పట్టుకుందయ్యా

# సా మాంపాతు సరస్వతి

ఉలి



ధనుంజయా..! కలలో.. అక్షరాలు అశ్రువులు రాల్చుతున్నాయ్, పాపం..!!" దిగులుపడ్డాడు విద్యాసాగర్.

"అంటే, ఏమైంది మేష్టారూ..?" అంటూ బెడ్ నుంచి లేచి కూర్చున్నాడు ధనుంజయ్.

"గ్లోబలైజేషన్..! ప్రపంచీకరణ..!! సెల్ఫోన్ చేతిలోకొచ్చేక.. ప్రపంచమే అరచేతిలో ఉందనుకుంటున్నారు.

కానీ.. ప్రపంచం కంటే, అరచేయి చిన్నది కదా..!? ఎంత ఒడిసి పట్టుకున్నా.. కొత్తగా వస్తుంటే, చేతిలో ఉన్నవి కొన్ని.. వేళ్ల సందుల్లోంచి జారిపోతుంటాయి.." అన్నాడు విద్యాసాగర్. "ఏమిటో.. మీ వేదాంతం అర్థం కాలేదు.." అనుమానం వ్యక్తం చేశాడు ధనుంజయ్.

"అర్థం కాకపోవడమే మంచిది. అర్థమైతే, నీకు నిద్రపట్టదు.. ఇక, పడుకో. ఉదయం మాట్లాడుకుందాం.." చెప్పాడు విద్యాసాగర్ దుప్పటి నిండా కప్పుకొంటూ,

"ఈ సస్పెన్స్తో, ఇక నాకేం నిద్ర పడుతుందీ.."

"వయసులో ఉన్నప్పుడు కన్నవారి క్షేమం కోసం కష్టపడతాం. చేతకాని వయసులో చేతికి అందివస్తా రనుకుంటాం.. అండగా నిలబడి, కాసింత కూడు పెట్టి, ఆదరిస్తే చాలు అనుకుంటే.. సంపాదించిన ఆస్తిపాస్తులు లాక్కొని, బయటికి తరిమేశారు.. నాలాంటి ముసలివారి పరిస్థితి ఇంతే..!" బాధపడ్డాడు రామనాథం.



అంటూ ముసుగేసుకున్నాడు ధనుంజయ్.

* * *

విద్యాసాగర్ పడుకున్నాడన్నమాటేగానీ, ఆలోచనలు కందిరీగల్లా ముసురుకుంటున్నాయి. నిద్ర సరిగా పట్టడం లేదు. అటూ ఇటూ కదులుతున్నాడు. వెల్లకిలా.. బోర్లా.. పడుకుంటున్నాడు. ఎలా పడుకున్నా, మెదడులో నిండిపోయిన ఆలోచనలు.. అతన్ని ప్రశాంతంగా నిద్రపోనివ్వడం లేదు.

***అక్షరాలు...***

***కంటతడి పెట్టుకున్న అక్షరాలు...***

***అశ్రువులవుతున్న అక్షరాలు...***

***ప్రాణభయంతో వణికిపోతున్న అక్షరాలు...***

ఒక్కసారి చనిపోవడం ఎంతో హాయి..! కానీ, 'చనిపోతాను' అనే భయం.. చచ్చేవరకు క్షణక్షణం చంపేస్తుంది..!! అది మరణం కంటే, వెయ్యింతలు భయం కరమైనది..!!!

అలాంటి భయంతోనే అక్షరాలు బెంబేలెత్తి పోతున్నాయని అర్థం చేసుకున్నాడు విద్యాసాగర్. అందుకే,

అతని కంటిమీదకు కునుకు రావడం లేదు.

విద్యాసాగర్ తెలుగుపండితుడిగా పదవీ విరమణ పొంది, ఎనిమిదేళ్లు అయింది. రిటైర్డ్ అయ్యాక కూడా ఒంట్లో ఓపిక ఉన్నంతవరకూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన చేశాడు.

వృత్తిధర్మంగా తక్కువ జీతం అయినప్పటికినీ.. మాతృభాష అంతరించి పోకూడదనే ఉద్దేశ్యంతో విద్యాబోధన చేశాడు.

అచ్చులు 16 అక్షరములు, హల్లులు 37 అక్షరములు, ఉభయాక్షరములు 3.. మొత్తం కలిపి 56 అక్షరాలు విద్యార్థులకు నేర్పించాడు. కానీ, ఆంగ్లభాషపై ఉన్న వ్యామోహంతో మాతృభాష తెలుగును నిర్లక్ష్యం చేసేవారు విద్యార్థులు. కాస్తా కఠినంగా వ్యవహరిస్తే, విద్యార్థులు దారిలోకొస్తారని ఎగ్జామ్స్‌తో ఫెయిల్ చేస్తానంటే.. ఆ ప్రైవేట్ పాఠశాల కరెస్పాండెంట్ అంగీకరించలేదు. ఇది పోటీ ప్రపంచం. మిగతా పాఠశాలలకంటే మన స్కూల్ రిజల్ట్ తక్కువ వస్తే, మనకే అవమానం అంటూ.. ఎలా రాసినా తెలుగులో అధిక మార్కులు వేయాలని ఆంక్ష విధించారు. దాంతో, చేసేదిలేక.. అలాగే చూసీచూడనట్లు పరీక్ష పేపర్లు దిద్దేసి, 'జయహో..' అనేశాడు విద్యాసాగర్.

ఇలా.. చేయడం విద్యాసాగర్‌కు నచ్చలేదు. అది రాజ్యద్రోహం కంటె భయంకర నేరం అని దిగులుపడ్డాడు. 'కంచె చేను మేసినట్లు..' బోధన చేయాల్సిన వారే సరిగా నేర్పలేకపోతే, భవిష్యత్ తరాలకి భాష ఎలా చేరుతుంది..? అప్పటి (వరకు) సజీవంగా ఎలా ఉంటుంది..? అని మధనపడి, ప్రైవేట్ ఉద్యోగానికి రాజీనామా చేశారు విద్యాసాగర్.

అంతే..ఆ మరుసటి రోజు నుండి ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. పిల్లలు పెద్దవాళ్ల అయ్యేవరకు రెక్కలు ముక్కలు చేసుకొని, చేసీ చేసీ.. అలసిపోయిన అతని భార్య వేదవతి.. విద్యాసాగర్‌ని ఒంటరివాణ్ని చేసి, ''వెళ్లిపోయి'' నాలుగేళ్ల అయింది..!

ఉద్యోగం లేక సంపాదన డబ్బులు రాక పోవడంతో కుటుంబ సభ్యులకు చేదు అయ్యాడు విద్యాసాగర్. వండి పెట్టడానికి ఇద్దరు కోడళ్ల దృష్టిలో కరివేపాకు అయ్యాడు.

ప్రైవేట్ ఉద్యోగానికి రాజీనామా చేసిన మూడో రోజునే.. విద్యాసాగర్‌ను ఓల్డేజ్ హోంలో చేర్చారు ఇద్దరు కొడుకులు.

తనపై శ్రద్ధ కంటే, తెలుగు భాషపై ఉన్న వీరాభిమానంతో.. నిరంతరం ఆలోచిస్తూ మధన పడుతున్న విద్యాసాగర్... అక్షరాలు ఆవేదనతో ఏడుస్తున్నట్లు.. మరుగున పడిపోయిన ఋ, ౠ, ఌ. ౡ.. వంటి 14 అక్షరాలు ఐ.సి.యు.లో ఉన్నట్లు.. కలలు వస్తున్నాయి.

* * *

మరుసటి రోజు ఉదయం...

ఆలస్యంగా కలతలతో నిద్రపోయిన ధనుంజయ్ ఉదయం 7 గంటలయినా మేల్కొనలేదు.

సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచిన విద్యాసాగర్‌కు ఆ ఓల్డేజ్ హోంకు ప్రతిరోజూ వస్తున్న దినపత్రికలను చదవడం అలవాటు.

ఆ రోజు న్యూస్ పేపర్లో వచ్చిన "ఆస్ట్రేలియాలో తెలుగుభాషకు పట్టం" అనే వార్త చదివి ఎంతో సంతోషించాడు విద్యాసాగర్.

అక్కడి స్కూళ్లల్లో ఆప్షనల్‌గా తెలుగుభాష.. శాశ్వత నివాసానికి కూడా ప్రామాణికంగా తెలుగు.. ఆమోదించిన ఆస్ట్రేలియా కేంద్ర ప్రభుత్వం...

విదేశాల్లోనూ తెలుగుభాషకు దక్కిన అరుదైన గౌరవాన్ని తెలుసుకొని, విద్యాసాగర్ మనసు పులకించిపోయింది. "విదేశీ భాషల్లో తెలుగు లెస్స" కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాడతను.

విదేశాల్లోనూ గౌరవం పొందుతున్న మన మాతృభాష అయిన తెలుగుని, ఇక్కడున్న మన తెలుగువారు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో అర్థం కాలేదు విద్యాసాగర్‌కు.

పాఠశాలల్లోనే భాషాపండితులకు గౌరవం దక్కటం లేదు. ముందస్తుగా.. గణితం, సామాన్య, సాంఘిక శాస్త్ర బోధకులకు ఇచ్చిన గౌరవం, జీతం.. తెలుగు భాషాపండితులకు కూడా సమాన స్థాయిలో ఇవ్వగలిగితే.. తెలుగు భాషాభివృద్ధికి పునాది పడినట్లే..! శాస్త్రం ఏదైనా.. భాషతోనే కదా బోధన జరిగేది..?! తెలుగు ఛందస్సులోనూ గురు, లఘువులు..ఉత్పలమాల, చంపకమాల గణాలు ఉంటాయి. ఇవీ లెక్కలే కదా..! క,చ,ట,త,ప లు.. గ,జ,డ,ద,బ లుగా మారడం.. ఒక విధమైన రసాయనిక చర్యనే కదా..! అని గొణుక్కున్నాడు. విద్యాసాగర్.

''శుభోదయం మేష్టారూ..'' అంటూ నిద్రలేవడంతోనే పలకరించాడు ధనుంజయ్.

"తవ సుప్రభాతం..'' అన్నాడు నవ్వుతూ విద్యాసాగర్.

"నేను ఏడు కొండలవాణ్ణి కాదు.. నా దగ్గర ఏ కొండలూ లేవూ..'' అన్నాడు ధనుంజయ్.

"సంపాదించిన కొండలు.. కొడుకులూ కోడళ్లూ లాక్కున్నాకే కదా.. ఈ ఓల్డేజ్ హోమ్‌లో చేరింది.. ఇక్కడ మనమే కొండలం.. కన్నవాళ్లకి గుది బండలం..'' నవ్వుతూ చెపుతున్నా విద్యాసాగర్ కళ్లల్లో కన్నీటిపొర తారాడింది.

ఇంతలో అక్కడికొచ్చిన రామనాథం వాళ్లని చూసి "ఆహా.. ఈ వయసులో హాయిగా నవ్వుతున్నారంటే, మీకంటే అదృష్టవంతులు లేరోయ్..'' అన్నాడు.

అదే సంతోషంతో నవ్వుతూనే పాట పాడాడు విద్యాసాగర్, "బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్.."

"ఈ వయసులో కూడా ఆనందంగా పాటలు పాడుతున్నారంటే, మీరు చాలా గ్రేట్ మేష్టారూ..'' అన్నాడు ధనుంజయ్.

"బాధపడితే, మనకి వచ్చేదీ లేదూ.. పోయేదీ లేదూ..'' అంటూ "కనుగొంటే సత్యమింతేనోయ్.. ఓ వింతేనోయ్...'' పాట కంటిన్యూ చేశాడు విద్యాసాగర్.

"వయసులో ఉన్నప్పుడు కన్నవారి క్షేమం కోసం కష్టపడతాం. చేతకాని వయసులో చేతికి అందివస్తా రనుకుంటాం.. అండగా నిలబడి, కాసింత కూడు పెట్టి, ఆదరిస్తే చాలు అనుకుంటే.. సంపాదించిన ఆస్తిపాస్తులు లాక్కొని, బయటికి తరిమేశారు.. నాలాంటి ముసలివారి పరిస్థితి ఇంతే..!'' బాధపడ్డాడు రామనాథం.

"అందుకే, వృద్ధాశ్రమాలు వృద్ధి చెందుతున్నాయి..

ఉమ్మడి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.." అన్నాడు విద్యాసాగర్.

"ఈ పరిస్థితి ఇంతేనంటారా.. మేష్టారూ..?" అడిగాడు ధనుంజయ్.

"మాతృభాషకూ గౌరవం లేదు.. మాతాపితలకూ ఆదరణ లేదు.." విద్యా సాగర్ గొంతు గద్గదమైంది.

"నిజమేనయ్యా..! మీరు చెప్పింది అక్షర సత్యం.." అన్నాడు రామనాథం.

"డబ్బు సంపాదనలో పడి, పరుగెడుతున్నారు జనం. ఊరికో లక్ష్మీదేవి ఆలయం ఉంది కానీ, జిల్లాకో సరస్వతీదేవి ఆలయమైనా ఉందా..? సరస్వతీదేవినీ, మాతృభాషనీ.. గౌరవించని వాళ్లు కన్న తల్లిదండ్రులను ఎలా ఆదరిస్తారయ్యా..?" దిగులుపడ్డాడు విద్యాసాగర్.

"కళ్లు తెరిపించారు మేష్టారూ..!" అన్నాడు ధనుంజయ్.

"మనం 'కన్ను మూసే' వయసులో.. కళ్లు తెరిస్తే ఎంత..? నేటి యువతరం కళ్లు తెరవాలయ్యా!" దిగులుపడ్డాడు విద్యాసాగర్.

"అందుకు మీలాంటి వారే మార్గదర్శకులు కావాలి మేష్టారూ..!" వేడుకున్నట్లు చెప్పాడు ధనుంజయ్.

వేదాంతిలా నవ్వి, చెప్పాడు విద్యాసాగర్. "అంతా.. ఆ వాగ్దేవి దయ.. సా మాంపాతు సరస్వతీ..."

* * *

కలత చెందిన మనసుతో వీణని ఎంతగా శ్రుతి చేసినా.. స్వరాలాపనకు అనుకూలంగా మార్పు చెందకపోవడంతో తీగెలనీ సరిచేస్తోంది సరస్వతీదేవి.

శ్రుతి తప్పిన హృదయవీణలో అపశ్రుతులు పలుకుతుంటే, చేతిలోని వీణని ఎన్ని తీగెలని శ్రుతి చేసినా.. ఆరున్నొక్క రాగమే పలుకుతోందని తెలిసినా, అక్షరాలపై వున్న మమకారంతో అన్ని మరిచిపోయింది వాగ్దేవి.

అక్షరమాత మానసిక ఆందోళననీ, మనోవేదననీ గమనించిన అక్షరాలు.. దిగులుగా అక్కున చేరాయి.

అమాయకంగా బెంబేలుపడిపోతూ తల్లి ముఖంలోకి చూస్తున్న అక్షరాలని చూసి, తన మనోవేదన.. పుత్రసమానులైన అక్షరాలకు తెలిస్తే కంగారు పడిపోతాయని దిగమింగుకుంది సరస్వతీమాత.

ఇప్పటికే 60 అక్షరాలలో నుండి 14 అక్షరాలు కనుమరుగయ్యాయి. వాటి ఉనికి, మనుగడ లేక జీవచ్ఛవాల్లా పడివున్నాయి.

"ఒకప్పుడు తాత బామ్మలు, పిన్నీ బాబాయిలు, అత్తమ్మ మామయ్యలు, వారి పిల్లల సోదర సోదరీమణలు, మేనబావలు, మేనమరదళ్లు.. అందరూ కలిసి పెద్దపెద్ద ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు అలా ఎవరూ కలిసిమెలిసి ఉండటం లేదు. అసలు కన్నతల్లిదండ్రులే బరువైపోయి, వృద్ధాశ్రమాల్లో గడుపుతున్నారు.

ఈ మానవులే కలిసి లేనప్పుడు.. వాళ్లు మాట్లాడే అక్షరాలమైన మా ఉనికికి చోటెక్కడుంది..?!

ఒకప్పుడు పల్లెటూరిలో ఊరు ఊరంతా ఏవేవో వరుసలతో పలకరించుకుంటూ, మూకుమ్మడిగా ఉండేవారు. నేడు అభివృద్ధి చెందుతున్న నాగరికతతో నగరబాట పట్టిన మనుషులు అపార్ట్మెంట్ గోడల్లో ఇరుక్కుపోయి హడావిడిగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి నిద్రపోయే వరకూ పరుగులే పరుగులు..! కన్నపిల్లల క్షేమసమాచారం తెలుసుకునే సమయం చిక్కని ఉరుకులు పరుగులు..!

సంపాదనే ధ్యేయంగా యవ్వన కాలమంతా డబ్బు యావలో పడి, తినటాని క్కూడా సమయంలేని బిజీ బీజీ..! ఎవరి కోసం బ్రతుకుతున్నామో.. ఎవరి కోసం పరుగులు పెడుతున్నామో.. తెలియని అయోమయం..! అమాయకత్వం..!! చివరికి వాళ్లు సంపాదించిన ఆస్తిపాస్తులని లాగేసుకొని, వృద్ధాశ్రమాల్లో వదిలేసే పుత్రరత్నాలను చూస్తుంటే కోపం, ఉక్రోషం. చేతకాని వయస్సులో చావు కోసం ఎదురుచూసే గుండెబరువుతో గడుపుతున్న వృద్ధులను చూస్తుంటే, మా గుండె తరుక్కుపోతోంది.. రానురాను ఈ మానవ మనుగడ ఎలాంటి మార్పు చెందు తుందోనని ఆందోళన కలుగుతోంది.." అన్నాయి అక్షరాలు.

"మీరు అంతరించిపోతున్నా.. ఈ మానవుల దుస్థితి ఆలోచిస్తున్నారంటే.. మీరు నిజంగా అక్షరాలే..! అక్షరాలంటే – ఒక్క 'నాశనము లేనివి' అర్థమే కాదు. ఓంకారం, జీవాత్మ, పరమాత్మ, పరబ్రహ్మం, మోక్షం.. అనే అర్థాలు కూడా ఉన్నాయి. అనంత విశ్వంలోంచి శబ్దతరంగాలుగా వచ్చే 'ఓంకారం' నుండి అక్షరాలుగా రూపాంతరం చెందారు. తెల్లనికాంతి నుండి అనేక రంగులుగా విడిపోయినట్లు.. మీరూ అక్షరాలుగా మార్పు చెందారు. ఏ అక్షరాన్ని ఎక్కడ ఉపయోగించాలో, వాటి అర్థం ఏమిటో తెలియక తికమకపడుతూ అక్షరాలని పట్టించుకోవడం లేదు. అక్షర దోషాలతో తప్పు భావం వస్తుందని గ్రహిస్తే, వారే సరిదిద్దుకుంటారు. త్వరలోనే పూర్తిస్థాయిలో మీ అక్షరాలకు మనుగడ వస్తుంది.." వివరించింది సరస్వతీమాత.

ఆ మాటతో సంతృప్తి చెందిన అక్షరాలు "నమో మాతా.. నమోస్తుతే.." అంటూ సవినయంగా నమస్కరించాయి.

* * *

వాగ్దేవి అనుగ్రహమో.. విద్యాసాగర్ శుభ సంకల్పమో.. తలచుకున్న వారం రోజుల్లోనే వారి కోరిక నేరవేరేలా తెలుగుభాషాభివృద్ధికీ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థకీ.. మార్గదర్శకం మొదలయింది!

గత ఇరవై సంవత్సరాలుగా వివాదంలో ఉన్న విద్యాసాగర్ స్థలం కోర్టు తీర్పుతో తిరిగి అతని స్వంతమైంది. విద్యాసాగర్ తరఫున వాదించిన లాయర్ జితేందర్ రెడ్డి ఆ విషయం చెప్పి, అందుకు సంబంధించిన కాగితాలు ఓల్డేజ్ హోమ్‌కు వచ్చి అందజేశారు. అది విన్న వెంటనే అదే లాయర్‌తో మాట్లాడి, ఆ స్థలాన్ని సరస్వతీదేవి ఆలయానికి ఇస్తున్నట్లు అగ్రిమెంట్ చేశాడు. ఆ వెంటనే రామనాథం, ధనుంజయ్‌లు.. సరస్వతీదేవి విగ్రహానికి, ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షలు చందా ఇచ్చారు.

"మీరు అంతరించిపోతున్నా.. ఈ మానవుల దుస్థితి ఆలోచిస్తున్నారంటే.. మీరు నిజంగా అక్షరాలే..! అక్షరాలంటే – ఒక్క 'నాశనము లేనివి' అర్థమే కాదు. ఓంకారం, జీవాత్మ, పరమాత్మ, పరబ్రహ్మం, మోక్షం.. అనే అర్థాలు కూడా ఉన్నాయి. అనంత విశ్వంలోంచి శబ్దతరంగాలుగా వచ్చే 'ఓంకారం' నుండి అక్షరాలుగా రూపాంతరం చెందారు.



అనుకున్నదే తడవుగా.. రెండు నెలల్లోనే ఆ ఊరిలో సరస్వతీమాత ఆలయం నెలకొంది.

వృద్ధాశ్రమంలోని నలుగురు వృద్ధుల సంకల్పంతో ఆలయం నిర్మితమైందని మీడియా ద్వారా తెలుసుకున్న విద్యాశాఖ, దేవాదాయశాఖ మంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాసాగర్ కోరక మేరకు వసంతపంచమి రోజున.. వేదమంత్రోచ్ఛారణలతో విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగింది.

అది చూసిన అక్షరాలు 'ఇలా ఊరుఊరున సరస్వతీమాత ఆలయాలు నెలకొంటే.. అక్షరం అక్షరంగానే బతుకుతుంది..' అని ఆనందించాయి.

ఆలయ వ్యవస్థాపకునిగా విద్యాసాగర్ తొలిపూజ చేసి, మనస్ఫూర్తిగా ప్రార్థించాడు.

***"సరస్వతీ నమస్తుభ్యం..***


***..........................***

***సా మాంపాతు సరస్వతీ.."***

వచ్చేవారం కథ..

**గృహప్రవేశం**

– రమాదేవి కులకర్ణి





**జనవరి 10 వైకుంఠ ఏకాదశి**

సూర్యుడు ధనూరాశిలోకి ప్రవేశించిన తరువాత మరక సంక్రమణం వరకు జరిగే 'మార్గళి' మధ్యలో, ఉత్తరాయణ పుణ్యకాలానికి ముందు వచ్చేదే ముక్కోటి /వైకుంఠ ఏకాదశి. ప్రతి ఏకాదశికి నిర్దిష్టమైన పేర్లు ఉన్నాయి. ఆర్ష సంప్రదా యంలో ఏకాదశి తిథి పరమపవిత్రమైనది. శ్రావణ, కార్తిక, మార్గశిర మాసాల్లోని ఏకాదశి తిథి మరింత విశేషమైనది. ధన్ముర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని ముక్కోటి పర్వదినంగా పాటిస్తారు. నాడు ముక్కోటి దేవతలతో పరివేష్టితుడైన శ్రీ మహావిష్ణువును ఉత్తరద్వారం నుంచి దర్శించుకుంటే మనోభీష్టాలు నెరవేరుతాయని, మోక్షం సిద్ధిస్తుందని విశ్వాసం.

# ఇల 'వైకుంఠ' నగరిలో...

నెలకు రెండు చొప్పున ఏడాదికి 24 ఏకాదశు లు, అధికమాసంలో మరో రెండు వస్తాయి. ప్రతి ఏకాదశిని పవిత్రమైనదిగా భావిస్తారు. వాటిలో ముక్కోటి ఏకాదశి భిన్నమైనది. అన్ని ఏకాదశులను చంద్రమానం ప్రకారం గణిస్తే దీనిని సౌరమానంతో గణిస్తారు. దీనిని హరిఏకాదశి, మోక్ష ఏకాదశి, సౌఖ్య ఏకాదశి అనీ వ్యవహరిస్తారు. ధనుర్మాసన ఏకాదశి కొన్నిమార్లు మార్గశిరంలో, మరికొన్నిసార్లు పుష్య మాసంలో వస్తాయి. మార్గశిర శుద్ధ ఏకాదశి మోక్షదైకాదశి కాగా పుష్య మాస ఏకాదశి 'పుత్రద/ ఫలద'గా ప్రశంసలు అందుకుంది.

ఉత్తరాయణ పుణ్యకాలం కావడం వల్ల ఏకాదశి అత్యంత విశిష్ట దినమైంది. పురాణగాథను బట్టి దక్షిణాయనంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలిఏకాదశి) నాడు యోగనిద్రకు ఉపక్రమించిన శ్రీమహావిష్ణువు, కార్తిక శుద్ధ ఏకాదశి (ఉత్థాన ఏకాదశి) నాడు మేల్కొని మార్గశిర శుద్ధ ఏకాదశి (ముక్కోటి/వైకుంఠ) నాడు సర్వాలంకార భూషితుడై శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడావాహనరూఢుడై ఉత్తర(వైకుంఠ)ద్వార దర్శనమిస్తాడు. ముఖ్యంగా సృష్టి నిర్వాహకులు 33 మంది (ఏకాదశ రుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, అష్టవసువులు, ఇద్దర అశ్వనీ దేవతలు) ముఖ్య పాలనాధికారి శ్రీమహావిష్ణువును దర్శించుకునేందుకు ఆనాడు భూలోకానికి వస్తారట. వారి రాకకోసం కేటాయించిన ప్రత్యేక మార్గమే 'వైకుంఠ ద్వారం' అని శాస్త్రవచనం. వారితో కలిసి విష్ణువును దర్శించుకునే వారికి స్వర్గప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. అందుకే ఆ దారికి 'స్వర్గద్వారం' అని వ్యవహారంలోకి వచ్చింది. వైకుంఠ ద్వారం సూర్యుని ఉత్తరాయణ ప్రవేశానికి సూచిక. ఈ దర్శనం ద్వారా 'మోక్షం' సిద్ధిస్తుంది కనుక ఈ ఏకాదశిని 'మోక్షోత్సవ' దివసమనీ వ్యవహరిస్తారు. ఉత్తర ద్వారం అంటే ఉత్తర దిక్కున ఉండే ద్వారమే కాదు...శరీరానికి ఉత్తరాన ఉన్నది శిరస్సు. అందులోని రెండు రెక్కలను తెరచి దైవాన్ని దర్శించడమే ఉత్తర ద్వార దర్శనమని విజ్ఞులు అభివర్ణించారు.

మరో గాథ ప్రకారం, శ్రీమహావిష్ణువు చేతిలో హతులైన రాక్షసులు మధుకైటభులు శాప విమోచనంతో దివ్యరూపాలు పొంది, 'మాకు నిజరూపాలు కలిగిన ఈరోజు చరిత్రలో నిలిచేలా వైకుంఠంలాంటి మందిరాన్ని నిర్మించి ఈ రోజున ఉత్తర ద్వారంలో నిన్ను దర్శించి, అర్చించే వారికి వైకుంఠప్రాప్తి ప్రసాదించు' అని ప్రార్థించారు.

ఒక మన్వంతరంలో వికుంఠ అనే మహిళకు విష్ణువు కుమారుడిగా జన్మించడం వల్ల ఆయనకు వైకుంఠుడు అనే పేరు వచ్చిందని అమరకోశం పేర్కొంటోంది. 'కుంఠ'అనే మాటకు మొక్కపోవడం అనే అర్థమూ ఉంది. మహావిష్ణువు మనలోని అరిషడ్వర్గాలను నిర్వీర్యం (వికుంఠం) చేస్తాడని చెబుతారు. మురాసుర సంహారానికి వైకుంఠం నుంచి వచ్చిన తిథి కనుక వైకుంఠ ఏకాదశి అని పురాణ కథనం. కురుకుల పితామహుడు భీష్ముడు, తండ్రి శంతనుడు ప్రసాదించిన 'స్వచ్ఛంద మరణం' వరంతో ఉత్తరాయణం ప్రవేశించిన తరువాతనే దేహత్యాగం చేశాడు. దక్షిణాయనంలో మొదలైన కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి బాణాహతుడైన ఆయన అంపశయ్యపై పరుండి ఉత్తరాయణ పుణ్యకాలం కోసం నిరీక్షించాడు. ఈ మధ్యకాలం ధర్మరాజాదులకు విష్ణు సహస్రనామం ఉపదేశించారు.

శ్రీరంగం, తిరుమలలో వైకుంఠ ఏకాదశిని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శ్రీరంగ క్షేత్రంలో ఈ రోజు (ముక్కోటి) నుంచి 21 రోజులు పగలు (పగల్ పాథ్), రాత్రి (ఇరుల్ పాథ్) అని రెండుగా విభజించి విష్ణునామ సంస్మరణతో దర్శనభాగ్యం కలిగిస్తారు. శ్రీవైష్ణవాళ్వారులతో ఒకరైన నమ్మాళ్వార్ ఈ తిథి నాడే పరమపదించడం వల్ల వారు దీనికి విశేష ప్రాధాన్యమిస్తారు.

ఏకాదశికి ముందువచ్చే మంగళవారం తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం, స్వర్ణరథోత్సవం ఉంటుంది. కోనేటిరాయుడు ఉభయ దేవేరులతో మాడ వీధులలో దర్శనమిస్తాడు. ఉత్సవాల అనంతరం స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. చక్రత్తాళ్వార్‌కు ఏటా నాలుగు సందర్భాలలో నిర్వహించే స్నానాలలో మార్గశిర శుద్ధ ద్వాదశి నాటిది ఒకటి. పుణ్య తీర్థాలు సూక్ష్మ రూపంలో స్వామి పుష్కరిణిలో ప్రవేశిస్తాయని, సకల దేవతలు అక్కడ ఆవహిస్తారని పెద్దల మాట. అందుకే చక్రస్నానానికి అంత విశిష్టత.

శ్రీమహావిష్ణువు అలంకార, సామగానలోల ప్రియుడు. 'వైకుంఠ ఏకాదశి నాడు ఆలయంలో కానీ, ఇంటి వద్ద కానీ విగ్రహాలు/చిత్రపటాలను పూలమాలలతో అలంకరించాలి. పూజకు ప్రధానంగా తామరపూవులు, తులసి వినియోగించి, మధుర పదార్థాలు నైవేద్యంగా సమర్పించాలి. అష్టాక్షరీతో పాటు స్తోత్రాలు మననం చేస్తూ, అర్చన, జపం,ధ్యాన సాధానాల ద్వారా వైకుంఠపతి అనుగ్రహం కలుగుతుంది'అని పెద్దలు చెబుతారు.

***'మంగళం భగవాన్ విష్ణు: మంగళం గరుడధ్వజా మంగళం కమలాకాంతమ్ త్రైలోక్యం మంగళమ్ కురు'***

**– స్వామి**

తెలుగింటి చదరంగ రాణి కోనేరు హంపి చరిత్ర సృష్టించింది. 37 సంవత్సరాల వయసులో ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ సాధించడం ద్వారా తనకుతానే సాటిగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలకే కాదు...దేశానికే గర్వకారణంగా నిలిచింది.



# మెరుపుటెత్తుల 'చదరంగ రాణి' హంపి!

మేధో క్రీడ చదరంగంలో రాణించడానికి వివాహం, మాతృత్వం, కుటుంబబాధ్యతలు, వయసు ఏమాత్రం అవరోధం కావని భారత సీనియర్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి నిరూపించింది. న్యూయార్క్ వేదికగా ముగిసిన 2024 ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ టైటిల్ పోరులో ఇండోనేసియా గ్రాండ్ మాస్టర్ ఇరిని సుకందర్‌ను చిత్తు చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. గత ఐదేళ్ల కాలంలో రెండోసారి ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ నెగ్గి చైనా సూపర్ గ్రాండ్ మాస్టర్ జూ వెన్ జున్ సరసన నిలిచింది.

**గత 23 సంవత్సరాలుగా.....**

చదరంగంలో విశ్వఖ్యాతి సాధించిన భారత మహిళా గ్రాండ్ మాస్టర్లు అతికొద్దిమంది మాత్రమే కనిపిస్తారు. భాగ్యశ్రీ థిప్సే, విజయలక్ష్మి, ద్రోణవల్లి హారిక లాంటి పలువురు ఉన్నా ప్రపంచస్థాయిలో రాణించలేకపోయారు. గత 23 సంవత్సరాలుగా ఆ లోటును పూడ్చుతూ వచ్చిన ఏకైక మహిళాగ్రాండ్ మాస్టర్ హంపి మాత్రమే.

2019లో జార్జియా ప్రపంచ ర్యాపిడ్ చదరంగ పోరులో తొలిసారిగా ప్రపంచ టైటిల్ నెగ్గిన హంపి, ఐదేళ్ల విరామంలోనే మరోసారి అదే టైటిల్‌తో, రెండుసార్లు ప్రపంచ మహిళా ర్యాపిడ్ టైటిల్ సాధించిన భారత తొలి, ప్రపంచ రెండో మహిళా గ్రాండ్ మాస్టర్‌గా రికార్డులకెక్కింది. కెనడా వేదికగా జరిగిన 2024- ఫిడే క్యాండిడేట్స్ ప్రపంచ చదరంగ మహిళల పోటీలలో హంపి రజత పతకం సాధించింది.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

**పదేళ్ల ప్రాయం నుంచే...**

కృష్ణా జిల్లా గుడివాడలో మార్చి 31,1987న జన్మించిన హంపికి తండ్రి అశోక్ చదరంగ క్రీడలో తొలిగురువు. విజయవాడ నుంచి చదరంగ ప్రస్థానం ప్రారంభించిన హంపి 15 సంవత్సరాల వయస్సులో గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించింది. 1997లో ఫ్రాన్స్‌లో జరిగిన ప్రపంచ అండర్ – 10 బాలిక టోర్నీలో బంగారు పతకం సాధించింది. 1998లో అండర్-12, 1999లో అండర్-12, 2000 సంవత్సరంలో అండర్ -14 విభాగాలలో విశ్వవిజేతగా నిలిచింది. ఏథెన్స్ 2001లో జరిగిన ప్రపంచ జూనియర్ బాలిక విభాగంలో బంగారు పతకం అందుకొంది.

2002లో గోవాలో జరిగిన ప్రపంచ జూనియర్ బాలికల టోర్నీలో రజత పతకం సాధించింది. రష్యా వేదికగా 2004, 2008 సంవత్సరాలలో జరిగిన ప్రపంచ మహిళల చెస్ పోటీలలో కాంస్య పతకాలు, 2010లో కాంస్య, 2011 లో రజత పతకాలు గెలిచి అత్యుత్తమ మహిళా గ్రాండ్ మాస్టర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది

**బిడ్డ తల్లిగా రెండు ప్రపంచ ర్యాపిడ్ టైటిల్స్...**

2001లో ప్రపంచ జూనియర్ బాలికల టైటిల్ సాధించిన హంపి.. మరో ప్రపంచ టైటిల్ కోసం 18 సంవత్సరాలపాటు వేచిచూడాల్సి వచ్చింది. ఓ బిడ్డకు తల్లిగా 32 సంవత్సరాల వయసులో ప్రపంచ మహిళల ర్యాపిడ్ టైటిల్ (2019) గెలిచి చరిత్ర సృష్టించింది. మరో అయిదేళ్ల విరామంతో అదే టైటిల్ కైవసం చేసుకోగలిగింది.

కెనడాలోని టొరాంటో వేదికగా జరిగిన 2024- ప్రపంచ క్యాండిడేట్స్ మహిళల టోర్నీలో మరో ఏడుగురు ప్రపంచ మేటి మహిళా గ్రాండ్ మాస్టర్లతో పోటీ పడి హంపి రెండోస్థానంలో నిలిచి రజత పతకం అందుకొంది.

చైనా జోడీ టింగ్ జీ లీ, జోంగ్ ఈ టాన్, ఉక్రెయిన్ గ్రాండ్ మాస్టర్ అన్నా ముజిచుక్, అలెగ్జాండ్రా గోర్యచికినా, కత్రినా లాగ్నో, నూర్గుల్ సాలిమోవ్, వైశాలీ ప్రత్యర్థులుగా సాగిన ఈ 14 రౌండ్ల సమరంలో హంపి 9 పాయింట్లు సాధించింది. లీ, వైశాలీ సైతం 9 పాయింట్ల చొప్పున సాధించినా.. మెరుగైన టై బ్రేక్ పాయింట్లతో రెండోస్థానం దక్కించుకొంది.

**ఆసియాక్రీడల్లోనూ అదే జోరు...**

ఆసియా క్రీడలు, చెస్ ఒలింపియాడ్ టోర్నీలలో సైతం దేశానికి పతకాలు అందించిన ఘనత హంపికి మాత్రమే ఉంది. 2006 దోహా ఆసియా క్రీడల చెస్‌లో జంట స్వర్ణాలు, మహిళల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకంతో పాటు మిక్సిడ్ టీమ్ గోల్డ్‌ను అందుకొంది. హాంగ్జు వేదికగా గత ఆసియా క్రీడల టీమ్ విభాగంలో ఓ పతకం గెలుచు కోగలిగింది. ఆసియాక్రీడల్లో దేశానికి మూడు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారిణిగా కోనేరు హంపి నిలిచింది.

**హంపికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు..**

ప్రపంచ ర్యాపిడ్ మహిళా చెస్ టైటిల్ ను హంపి 37 సంవత్సరాల వయసులో, రెండోసారి గెలుచుకోవడం అరుదైన ఘనతగా ప్రధాని నరేంద్ర తమ అభినందన సందేశంలో కొనియాడారు. ఓ తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే విశ్వవిజేతగా నిలవడం అపూర్వమంటూ కొనియాడారు.

37 సంవత్సరాల తన జీవితంలో గత 27 సంవత్సరాలుగా చదరంగమే శ్వాసగా ఆడుతూ వచ్చిన కోనేరు హంపిని భారత ప్రభుత్వం అర్జున పురస్కారంతో పాటు పద్మశ్రీతో సత్కరించింది. ఓ డ్డకు తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రపంచ చదరంగంలో తన ఉనికిని కాపాడుకొంటూ రావటమే కాదు..పతకాలు సైతం సాధిస్తున్న తెలుగుతేజం హంపి దేశంలోని నవతరం యువతులకు, మహిళాలోకానికి స్ఫూర్తిగా, గర్వకారణంగా నిలిచిపోతుంది. ★

# వనవాసి కల్యాణాశ్రమం స్థాపక దినోత్సవం

**భాగ్యనగర్ :** వనవాసి కల్యాణాశ్రమం స్థాపక దినోత్సవం డిసెంబర్ 29, 2024న హైదరాబాద్ (కోఠి) లోని వైఎమ్ఐఎస్ భవనంలో సంస్థ కార్యకలాపాలకు సంబంధించిన ఆకర్షణీయమైన వీడియోతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా ఆర్ఎస్ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలె పాల్గొన్నారు. వనవాసీ ప్రజల జీవితాల్లో సంపూర్ణ వికాసానికి కల్యాణ ఆశ్రమం విశేష కృషి చేస్తోందని హొసబలె అన్నారు. విద్య, వైద్యం,




స్వావలంబన ఇలా అన్నిరంగాల్లోనూ వనవాసీలు సంపూర్ణ వికాసం చెందడానికి పనిచేస్తోందన్నారు. వనవాసీలు భారతీయధర్మంలో భాగమని, వనవాసీక్షేత్రాల్లో భారతీయ ధర్మం పరిఢవిల్లడానికి కొన్ని సంవత్స రాలుగా కల్యాణాశ్రమం అవిరళ కృషి సల్పుతోం దన్నారు.

హైందవాః సోదర సర్వేః అనే ఆర్యోక్తిని గుర్తు చేస్తూ హిందువులందరూ అన్నాదమ్ములు, అక్కా చెల్లెళ్లని, అందరిదీ ఒకే రక్తమని హొసబలె చెప్పారు. నెల క్రితం భాగ్యనగర్‌లో లోక్ మంథన్ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తూ వనవాసి, నగరవాసి, గ్రామవాసి ఎవ్వరైనా అందరమూ భారత వాసులమేనని పేర్కొన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కల్యాణాశ్రమం చాలా సంవత్సరాలుగా వనవాసుల అస్తిత్వం, ఆత్మగౌరవం, వికాసం.. ఈ మూడు బిందువులను కేంద్రంగా చేసుకొని వన వాసులకు సేవచేస్తోందని ఆయన చెప్పారు. అలాగే భారతదేశ అభివృద్ధిలో వీరి పాత్ర కూడా ఉండేట్లు ఈ కార్యాన్ని ఓ తపస్సులా నిర్వహిస్తోందని తెలిపారు. సేవ ముసుగులో వనవాసులను తమ సంస్కృతి, మూలాలనుంచి వేరు చేసే శక్తులు కూడా పని చేస్తుం టాయని హొసబలె హెచ్చరించారు. అందుకే వీట న్నింటిని దృష్టిలో పెట్టుకొని, వనవాసులను రక్షించు కోవాల్సిన అవసరం మనందరి కర్తవ్యమని, ఈ సంక ల్పాన్ని అందరి హృదయాల్లో జాగృతం చేయాలని సూచించారు. ప్రకృతిని నాశనం చేయకుండా, ప్రకృతితో సమన్వయం చేసుకుంటూ సంస్కృతిని కాపాడుతూ సభ్య సమాజానికి వన వాసులు మార్గ దర్శకంగా నిలిచారని తెలిపారు. అందుకే అన్ని సమాజాలవారు వనవాసులకు కృత జ్ఞతలు తెల పాల్సిన అవసరం ఉందని సూచించారు.

మన దేశంలో 10కోట్లమందికి పైగా వున్న నివ సిస్తున్న వనవాసీలను ఒకే తాటిపైకి తీసుకు రావడానికి



వనవాసీ కల్యాణాశ్రమం కృషి చేస్తోం దన్నారు. ఈ ప్రయత్నం కారణంగా మన దేశంలోని వనవాసీ ప్రజల్లో ఆత్మవిశ్వాసం జాగృతం అయ్యిందని, తాము కూడా భారత వాసులమేనని, జాతి వికాస ప్రక్రియలో తమ భాగస్వామ్యం కూడా వుండాలన్న సంకల్పం వారిలో జాగృతమైందన్నారు.

మరొక ముఖ్యఅతిథి ఇక్సోరెల్, కార్తికేయ పరి శ్రమల గ్రూప్ సిఎండి భగవతి బల్ద్వా మాట్లాడుతూ



లావణ్య, కిషోర్ దంపతులు బలహీన వర్గాలకు చెందిన వారు, ఆర్థికంగా సామాన్యులు. జీవితాంతం కూడబెట్టిన ధనంతో కట్టుకున్న భవనాన్ని సంచార తెగల విద్యార్థుల వసతికి సమర్పించారు. ఈ సందర్భంగా సర్‌కార్యవాహ దత్తాత్రేయ హొసబలె ఈ దంపతులను సన్మానిం చారు.

ఇక్కడ వనవాసి మహిళలు చేయి చేయి పట్టుకొని నృత్యం చేశారు సంతోషం పంచుకున్నారు. అదేవిధంగా మనమంతా చేయి చేయి కలిపితే ఈ సత్కార్యం ఇంకాస్త దృఢతరం అవుతుంది. మనమంతా పనిని ఇంకా ముందుకి తీసుకుపోదాం. 73వ వార్షికోత్సవ సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు. ఎవరి దగ్గర సంకల్పం ఉంటుందో వారిని విజయం వరిస్తుంది. మేము కూడా నిరంతరం మీతో ఉంటామని వాగ్దానం చేస్తున్నాం అని శ్రీమతి భగవతి చెప్పారు.

ఈ కార్యక్రమంలో కళ్యాణ్ ఆశ్రమం అఖిల భారత ఉపాధ్యక్షులు, హెచ్‌కె నాగు, ముఖ్య అతిథిగా మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్ ఎండీ డా. కురసం పద్మజ, వనవాసీ కళ్యాణాశ్రమం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి తాడేపల్లి శివరామకృష్ణ, తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యులు ఆచార్య అప్పా నాగేశ్వర తదితరులు పాల్గొని ప్రసంగించారు.

325 మంది కల్యాణశ్రమం శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ★

# ఆదిలాబాద్ వనవాసీ గ్రామాల్లో ఎన్ఎంఓ వైద్య శిబిరం



అడవులలోని మారుమూల ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తూ నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఓ) ఆరోగ్య భారతం కోసం ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా 'కొమురం భీం స్వాస్థ్య సేవాయాత్ర' పేరుతో ఆదిలాబాద్ జిల్లాలోని 15 వనవాసీ పల్లెలకు వెళ్లిన వైద్యబృందం రెండురోజులు వైద్యపరీక్షలు (డిసెంబర్ 27,28) నిర్వహించింది. ఇందులో 150 మంది వైద్య విద్యార్థులు, వైద్యులు ఓ బృందంగా ఏర్పడి 500మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కౌన్సిలింగ్ నిర్వహించారు. వైద్యబృందం వనవాసులతో మమేకమై వారి ఆప్యాయతను అందుకున్నారు.

ఈ రెండు రోజుల క్యాంపులో బీపీ, షుగర్‌లతో పాటు జనరల్ స్క్రీనింగులు కూడా ఈ బృందాలు నిర్వహించాయి. అవసరమైన వారినుంచి రక్త నమూనాలు కూడా సేకరించి, పూర్తి బ్లడ్ పిక్చర్, వైడల్ టెస్టులు, ఫీవర్ ప్రొఫైల్ వంటి వాటిని కూడా నిర్వహించారు. చిన్న పిల్లలకు మరింత ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. మరోవైపు మహిళల విషయంలో ఈ మెడికో బృందం మరింత లోతైన శ్రద్ధ వహించింది. నెలసరి రుతుక్రమాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమం అంతా కూడా ఏకలవ్య ఫౌండేషన్ సమన్వయంతో సాగింది.

150 మందిని బృందాలుగా చేసి, వారికి కేటాయించిన గ్రామాల్లోకి పంపించారు. ఈ సందర్భంగా వైద్యబృందానికి వనవాసీలు అత్యంత ఘనంగా హారతులు ఇచ్చి, డప్పులతో స్వాగతం పలికారు. అలాగే కొన్ని గ్రామాల్లో మెడికోల కాళ్లను కడిగి, హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెండురోజులపాటు మెడికోలకు వసతి, భోజన సదుపాయాలను కూడా వనవాసీలే కల్పించారు. వనవాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలు, దేవతలు, ఆహారపు అలవాట్లు, వ్యవసాయ పని విధానం, పశుపోషణ గురించి మెడికోలకు వివరిం చారు. రాత్రి పల్లెల్లో గుస్సాడీ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అక్కయ్య, అన్నయ్య, అమ్మ అంటూ అత్యంత ఆప్యాయంగా మెడికోలను తమలో కలిపేసుకున్నారు వనవాసీలు. తమ పల్లెల్లోకి వచ్చిన మెడికోలను ఎద్దుల బండిపై ఊరేగిస్తూ తీసుకెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఇది తమకెంతో ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందని మెడికోలు పేర్కొన్నారు.

**క్యాంపుల ద్వారా తేటతెల్లమైన విషయాలు :**

అత్యధికుల్లో విటమిన్ డి లోపం. ఎక్కువ మంది పాలు తాగరు. కాల్షియం లోపం అధికం. పండ్లు చాలా తక్కువగా తింటారు. మంచి నీటిని చాలా తక్కువగా తీసుకుంటారు. ఫ్లోరోసిస్ సమస్య కూడా గుర్తించారు. విటమిన్ల లోపం బాగా ఉంది. మలేరియా, సీజనల్ వ్యాధులు అధికం. రక్తహీనత ఎక్కువేనని వెల్లడైంది.

అనారోగ్యం సమయంలో టెస్టుల విషయంలో తీవ్ర అలసత్వం. హైపర్ టెన్షన్, మహిళలు తమ నెలసరి విషయం పట్టించుకోరు. బీపీ, షుగర్ సమస్యలు చాలా తక్కువ. అలాగే ఆవులను బాగా పెంచుతారు కానీ.. ఆ పాలను వారు తీసుకోరు. అమ్మరు కూడా. కేవలం లేగదూడలకే వదిలేస్తారు. వైద్య శిబిరం ముగిసిన తర్వాత మెడికోలు తమ అనుభవాలను ఎంతో ఉత్సాహంగా పంచుకున్నారు. ఈ స్వాస్థ్య యాత్ర తమకెంతో అనుభవాన్ని ఇచ్చిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ స్వాస్థ్య సేవాయాత్రలో ప్రాంత సేవాభారతి ప్రముఖ్ వాసు ముఖ్య అతిథిగా, యాత్ర ముగింపు కార్యక్రమానికి సామాజిక సమరసతా వేదిక ప్రముఖ్ అప్పాల ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ★



# బాల జాగృతి

## తెలుసుకుందాం

## కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

తెలంగాణలోని నిర్మల్ జిల్లా, దిలావర్‌పూర్ మండలం, కాల్వ గ్రామంలో చుట్టూ అడవుల మధ్య వెలిసిన పురాతన దేవాలయమిది. కొండపైన స్వామివారు సింహరూపంలో స్వయంభువుగా వెలిశారని స్థల పురాణం చెబుతోంది. 13వ శతాబ్దంలో కాకతీయ రాజులు ఈ దేవాలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఔరంగజేబు చేసిన దాడిలో దేవాలయంలోని విగ్రహం ధ్వంసమవడంతో 1985 వరకు గర్భాలయంలో స్వామివారి పాదుకలు మాత్రమే ఉండేవి. కొంతకాలం తరువాత మూలవిరాట్టు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.



## కథ | పనిని బట్టే మర్యాద!

లక్ష్మీపురం అనే ఊరిలో గ్రామదేవత పండుగను ఏటా ఘనంగా నిర్వహిస్తారు.

పండుగనాడు అమ్మవారిని ఒక బండిలో ఊరేగిస్తారు. అందుకోసం ఆ ఊళ్లో ఒక ఎద్దును ఎంపిక చేస్తారు.

పండుగ కొంత కాలం ఉందనగా ఆ ఎద్దుకు మంచి ఆహారంతో పాటు చాలా జాగ్రత్తగా చూసుకొంటారు. ఊరిజనమంతా ఆ ఎద్దును భక్తిగా చూస్తారు.

ఈ ఏడాది పండుగకు లక్కీ అనే ఎద్దును ఎంపిక చేశారు.

ఊరిజనం తనను ప్రత్యేకంగా చూడడంతో లక్కీకి గర్వం పెరిగింది.



## పద్యము

సరివారిలోన నేర్పున
దిరిగెడి వారలకుగాక తెరవాటులలో
నరయుచు మెలగెడి వారికి
పరువేటికి గీడె యనుభవంబు కుమారా!

**భావం :** ఓ కుమారా! తనతో సమానమైన వారితో నేర్పున నడుచుకొనిన గౌరవము, కీర్తి లభించును. దుష్టులతోనూ, దొంగలతోనూ స్నేహం చేసినయెడల గౌరవము చెడి కీడు జరుగును.

## శ్లోకము

ఆలస్యం హి మనుష్యాణాం శరీరస్థో మహాన్ రిపుః
నాస్త్యుద్యమ సమోబంధుః కృత్వాయం నావసీదతి

**భావం :** మనిషి శరీరంలోని పెద్ద శత్రువు అలసత్వం. పరిశ్రమ (ఉద్యమం)తో సమానమైన బంధువు లేదు. ఇది తెలిసి పనిచేసేవాడు ఎన్నటికి దుఃఖం పొందడు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| చాచా | వల్లభాయిపటేల్ |
| మహాత్మ | జవాహర్ లాల్ నెహ్రూ |
| సర్దార్ | గాంధీజీ |
| భారత కోకిల | రవీంద్రనాథ్ టాగూర్ |
| గురుదేవ్ | సరోజినీనాయుడు |

జవాబులు : చాచా–జవహర్ లాల్ నెహ్రూ; మహాత్మ–గాంధీజీ; సర్దార్–వల్లభాయిపటేల్; భారత కోకిల–సరోజినీనాయుడు; గురుదేవ్–రవీంద్రనాథ్ టాగూర్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### రఫీ అహ్మద్ కిద్వాయ్




ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1894 ఫిబ్రవరి 18న జన్మించారు. 1920లో ఖిలాఫత్ ఉద్యమ సమయంలో కిద్వాయ్ కీలక పాత్ర పోషించారు. 1920 నాటి సహాయ నిరాకరణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించి జైలుపాలయ్యారు. 1922లో జైలు నుంచి విడుదలైనా ఉద్యమ పంథానే కొనసాగించారు. 1954 అక్టోబర్ 24న ఢిల్లీలో మరణించారు.



పండుగనాడు జనమంతా తనకు వంగి వంగి దండాలు పెడుతుంటే అదంతా తన గొప్పతనమని పొంగిపోయింది.

పండుగ ముగిసింది. ఉత్సవ విగ్రహాన్ని బండిపై నుంచి గుడిలోకి తీసుకెళ్లారు జనం.

ఇక లక్కీని పట్టించుకునేవారే కరువయ్యారు. కొంతసేపటికి దాని యజమాని వచ్చి పశువుల పాకలో కట్టేసి వెళ్లిపోయాడు.

ఇంతకాలం తనకు దక్కిన మర్యాదను చూసి ఉప్పొంగిపోయిన లక్కీ.. మనం చేస్తున్న పనిని బట్టే మనకు గౌరవం లభిస్తుందన్న వాస్తవాన్ని తెలుసుకోడానికి చాలా కాలం పట్టింది. ★

## జనరల్ నాలెడ్జ్

1. వేగాన్ని కొలిచే పరికరాన్ని ఏమంటారు?
2. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి?
3. ప్రపంచ చెస్ ఛాంపియన్ గా నిలిచిన గుకేష్ ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తి?

జవాబులు : 1. స్పీడో మీటర్; 2. 206; 3. తమిళనాడు.

## మెదడుకు మేత

కాళ్లు లేవు గానీ నడుస్తుంది. కళ్లు లేవు గానీ ఏడుస్తుంది?

జవాబు : రోడ్డు

## మంచిమాట

జ్ఞానం వంశపారపర్య సంపద కాదు, ఎవరికివారు కష్టపడి ఆర్జించుకోవలసిందే!



# వారఫలాలు

**6-12 జనవరి 2025**



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆత్మీయుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. ఆదాయం ఆశా జనకంగా ఉంటుంది. శుభకార్యాలపై కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. పాతమిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు విస్తరిస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు కొత్త అవకాశాలు కొన్ని దక్కవచ్చు. 10,11 తేదీల్లో వృథా ఖర్చులు. గణేశాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆత్మీయుల ఆదరణ పొందుతారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయ, పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. 9,10 తేదీల్లో దూరప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. అనుకున్నది సాధించాలన్న పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరిగి ముందుడుగు వేస్తారు. ఉద్యోగయత్నాలు కలసి వస్తాయి. వ్యాపారస్తులకు లాభాలు మరింత అందుతాయి. ఉద్యోగస్తులకు అనుకూల వాతావరణం నెలకొంటుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు కొన్ని సమస్యలు తీరతాయి. 6,7తేదీల్లో ఆస్తి వివాదాలు. కుటుంబంలో సమస్యలు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయం గతంకంటే కొంత మెరుగుపడు తుంది. కొన్ని నిర్ణయాలు తీసుకుని అందర్నీ ఆశ్చర్య పరుస్తాయి. వాహనాలు,భూములు కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగస్తులకు పైస్థాయి వారినుంచి మరింత ప్రోత్సాహం. రాజకీయ, పారిశ్రామికవేత్తలు, రచయితలకు ఊరటనిచ్చే సమాచారం రావచ్చు. 8,9 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. కొత్త రుణయత్నాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆదాయవ్యయాలు సమానంగా ఉన్నా అవసరాలు తీరతాయి. కొన్ని వ్యవహారాలలో పురోగతి కనిపిస్తుంది. వ్యాపారస్తులు కొత్త సంస్థల యత్నాలు ముమ్మరం చేస్తారు. ఉద్యో గస్తులకు పని ఒత్తిడులు తగ్గవచ్చు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు కార్యసిద్ధి. 10,11 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువుల నుంచి ఒత్తిడులు. వివాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆలోచనలు అమలుచేస్తారు. భూములు, వాహనాలు కొనుగోలు చేసే వీలుంది. ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. పెట్టుబడులు పెరుగుతాయి. ఉద్యోగస్తులకు విధులు ప్రశాంతంగా సాగుతాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలు, రచయితలకు కొత్త విషయాలు తెలుస్తాయి. 7,8 తేదీల్లో ఖర్చులు అధికం. శారీరక రుగ్మతలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆత్మీయులు, శ్రేయోభిలాషులు సహకరిస్తారు. ఆదాయం సమృద్ధి. మిత్రులనుంచి పిలుపు అందుతుంది. నిరుద్యోగులు ఎంతోకాలం ఎదురుచూస్తున్న అవకాశం దగ్గరకు వస్తుంది. ఉద్యోగస్తులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు సంతోషకరమైన సమాచారం. 10,11తేదీల్లో దూర ప్రయాణాలు. ఒప్పందాలు వాయిదా. శివాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

శుభ కార్యాలపై బంధువర్గంతో సమాలోచనలు జరుపుతారు. యుక్తితో వివాదాలనుంచి గట్టెక్కుతారు. విద్యార్థుల కాస్త ఉపశమనం. వ్యాపారస్తులకు లాభాలు అందు తాయి. పారిశ్రామికవేత్తలు, కళా కారులు, రచ యితలకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. 7,8 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. ఆకస్మిక ప్రయాణాలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఎంతటి వ్యక్తినైనా వాక్చాతుర్యంతో ఆకట్టుకుంటారు. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. వ్యాపా రస్తులకు ఊహించని విధంగా లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. రాజకీయ వేత్తలు, కళాకారులు, పరిశోధకులకు శుభవార్తలు అందుతాయి. 8,9 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. రుణయత్నాలు. శివపంచాక్షరి పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కుటుంబంలో సమస్యలు తీరుతాయి. ఇంటి నిర్మాణాలలో ముఖ్యనిర్ణయాలు తీసుకుంటారు. దూరపు బంధువులనుంచి సమాచారం సంతోషం కలిగిస్తుంది. వ్యాపారస్తులకు లాభాలు. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు దక్కుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 9,10 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శ్రమాధిక్యం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ప్రయాణాలు చివరి క్షణంలో వాయిదా. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. కొన్ని కార్య క్రమాలు మధ్యలో విరమిస్తారు. విలువైన వస్తువులు జాగ్రత్తగా కాపాడుకోండి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు గందరగోళ పరిస్థితి. 8,9 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. కొన్ని వ్యవహారాలలో ఒప్పందాలు చేసుకుంటారు. శుభకార్యాలకు డబ్బు వెచ్చిస్తారు. వ్యాపారస్తులు గతం కంటే లాభాలు మరింత దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 6,7 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**ఆధారాలు**

**అడ్డం**

1) అలక్ష్యం వలన చేసే ఆలస్యం (3)
4) అసహ్యించుకోవడం, తిరస్కారం (4)
6) గుడి (3)
8) గోదావరి పుట్టినచోటు (4)
10) కొట్టు (3)
12) దగ్గు తగ్గడానికి దీని ముక్కని బుగ్గన పెట్టుకుంటారు (4)
13) నిద్రించునది, ముకుళించునది (3)
15) చెదరిన తుపానుగాలి, చలిగాలి (3)
19) పటాపంచలైన ఒకపెద్ద అంటురోగం (3)
20) పచ్చ పిట్ట, బంగారు పిచ్చుక (4)
21) కట్టు, నిష్ట (3)
23) ముచికుంద (మూసీ) నది జన్మస్థానం (5)
26) సంతోషం (3)
27) .... సారలమ్మ జాతర చాలా ప్రముఖమైంది (అటునుంచి) (3)

**నిలువు**

1) ఒకటి కావాలి, చేయాలి అనే తపన (4)
2) విరిగిన మిన్ను, చిరిగిన గుడ్డ (3)
3) తలక్రిందులైన వంశానుక్రమం (2)
4) నోటితో చేసే సంకేతం (2)
5) బంగారం (3)
7) గొంతులో పచ్చి... పడినట్లంటే అనుకోని పరిస్థితివచ్చి దిక్కుతోచకపోవడం (4)
9) ఇది కట్టుకోవడమంటే ఒక పనిని సాధించాలనే గట్టి నిర్ణయం తీసుకోవడం (3)
11) ఎవరైనా నీటి ప్రవాహంలో పడిపోతే కాపాడడం కోసం దూకేవాళ్లు (6)
14) పంచారామాలలో ఒకటి (4)
16) తల్లి (3)
17) పెళ్లికాని యువతి, గంగానది శాఖ (5)
18) ...రాసుకుంటే బూడిద రాలిందని సామెత (4)
22) పదుచుప్రాయం (3)
24) నక్షత్రం (2)
25) తాత్కాలికమైన విడిది (2)

# పదరసం-495

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | | | 5 |
| | | | | 6 | 7 | | | | |
| 8 | | | 9 | | | | 10 | 11 | |
| | | | 12 | | | | | | |
| | 13 | 14 | | | | | 15 | | |
| 16 | | | | 17 | | 18 | | | |
| | | 19 | | | | 20 | | | |
| 21 | 22 | | | | | | | | |
| | | | 23 | | | | 24 | | 25 |
| 26 | | | | | | | 27 | | |

**పదరసం - 494 సమాధానాలు**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రీ[1] | చు | రా | ళ్ళు[2] | | క[3] | ర్కో | ట[4] | కు | డు[5] |
| ట | | | వ[6] | య్యా | రం | | ము | | రు |
| కం[7] | ది[8] | రీ | గ | | వ | | కు[9] | దు[10] | వ |
| | వా | | డ[11] | క[12] | ల | ని[13] | | ణం | |
| కు[14] | లా | స్తా[15] | | డ | | స్తా[16] | వ | కా | శం[17] |
| మ్మ | | మ[18] | డ | మ | | ప | | | భు |
| రి[19] | కా | పే | | | అ[20] | నా | మ[21] | కు | డు |
| | | దం[22] | పు[23] | డు | | | త్స్య | | |
| పి[24] | రొం[25] | | నా | | స్తో[26] | య | గం | | ఘో[27] |
| | ప[28] | రు | స | పే | ది | | ధి[29] | క్కా | రం |



**గడిచిన ఏడాది (2024)**
**తెలుగు చిత్రసీమలో చిత్ర విచిత్ర సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఊహించినవి కొన్ని దక్కలేదు. ఊహకందని వివాదాలు కొన్ని చుట్టుముట్టాయి. అయితే 'జరిగేదంతా మంచికని అనుకోవడమే మనిషి పని...' అని పాడుకుంటూ ముందుకు సాగుతోంది సినీ పరిశ్రమ.**



# వెండితెర-2024 'మెరుపులు-మరకలు'

ప్రతి యేడాదిలానే 2024లో రిపబ్లిక్ డేకు ముందు ప్రకటించిన పద్మ అవార్డులలో కథానాయకుడు చిరంజీవి పద్మ విభూషణ్‌కు ఎంపికయ్యారు. చిత్రం ఏమంటే తెలుగు సినిమా రంగంలోని మరెవరికీ పద్మ పురస్కారాలు దక్కలేదు. ఈ రంగంతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో బంధం ఉన్న వైజయంతి మాల బాలీకి పద్మవిభూషణ్ వచ్చింది. స్వర్గీయ విజయ్‌కాంత్, మిథున్ చక్రర్తి, ఉషా ఉతప్, ప్యారేలాల్, దత్తాత్రేయ అంబదాస్ పద్మభూషణ్ పురస్కారాలకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం మిథున్ చక్రవర్తిని దాదా సాహేబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక చేసింది.

పద్మ అవార్డుల మాదిరిగానే జాతీయ సినీ అవార్డులలోనూ తెలుగు సినిమా రంగానికి ఈసారి అన్యాయం జరిగింది. గత యేడాది పదికి పైగా అవార్డులను అందుకున్న తెలుగు సినిమాకు ఈసారి చుక్కెదురైంది. కేవలం ఉత్తమ ప్రాంతీయ తెలుగు సినిమా అవార్డు తప్ప మరొకటి రాలేదు. 'కార్తికేయ -2' కి ఆ అవార్డ్ దక్కింది.


ఇక కొన్నేళ్ల క్రితం చిత్రసీమను కల్లోల పరిచిన డగ్స్ కేసులో స్టార్ హీరోలకు, దర్శకులకు ఊరట లభించింది. తగిన సాక్ష్యాధారాలను చూపలేదని, ఫోరెన్సిక్ లాబొరేటరీ రిపోర్ట్‌లో వారు డ్రగ్స్ తీసుకున్న ఆనవాళ్లు లేవంటూ ఆ కేసుల్ని చాలా వరకూ కొట్టేశారు. ఇదే సమయంలో 2024లో మరికొందరు ఈ రకమైన డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కున్నారు. కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ను డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేసి విచారించారు. నటి హేమ బెంగళూరులో ఓ బర్త్ డే పార్టీలో డ్రగ్స్ తీసుకుందనే అనుమానంతో అరెస్ట్ చేశారు.

తమిళనటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరుతో ఫిబ్రవరిలో పార్టీ ప్రకటించి, తొలి సమావేశాన్ని ఘనంగా నిర్వహించాడు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల నుండి తమ అభ్యర్థులు బరిలోకి దిగుతారని ఆయన ప్రతించారు. కొత్తగా మైనపు ప్రతిమను ఆవిష్కరించగా, ఆ కార్యక్రమానికి అర్జున్ హాజరయ్యారు. ప్రముఖ గాయని పి. సుశీలను తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. తమిళనాడు సీఎం స్టాలిన్ 'కలైజ్ఞర్ నినైవు కలైతురై విత్తగర్' అవార్డుతో సత్కరించి, రూ. పది లక్షల చెక్కు అందించారు. చెన్నైలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం నివాసం గల వీధికి ఆయన పేరు పెడుతున్నట్టు స్టాలిన్ ప్రకటించారు. అలానే రామ్ చరణ్ తేజ్‌కు చెన్నయ్‌లోని వేల్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రముఖ రచయిత, హిందీ గీత రచయిత గుల్జార్ జ్ఞానపీఠ అవార్డుకు ఎంపిక కాగా, సినీ నేపథ్య గాయకుడు, భగవద్గీత ఫౌండేషన్ ఛైర్మన్ ఎల్. గంగాధర శాస్త్రి కేంద్ర ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్నారు. మురళీమోహన్, బాలకృష్ణ నట స్వర్ణోత్సవాలను జరుపుకున్నారు. 'దేవర' షూటింగ్‌లో సైఫ్ అలీఖాన్, జిమ్ లో ఎన్టీఆర్, తన 75వ చిత్రం షూటింగ్ లో రవితేజ, 'డాకు మహారాజ్' సెట్స్‌లో ఊర్వీ రౌతేలా గాయపడ్డారు. అలానే నటుడు నవీన్ పోలిశెట్టికి బైక్ యాక్సిడెంట్‌లో గాయాలయ్యాయి.

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా భరత్ భూషణ్, ఉపాధ్యక్షుడిగా అశోక్ కుమార్, ఎఫ్.ఎన్.సి.సి. అధ్యక్షుడిగా కె.ఎస్. రామారావు గెలిచారు. ప్రముఖ నిర్మాత 'దిల్' రాజును తెలంగాణ ఫిల్మ్ దెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. గద్దర్ పేరుతో అవార్డుల విధి విధానాల రూపకల్పన కోసం బి. నరసింగరావు ఛైర్మన్‌గా ప్రభుత్వం కమిటీ వేసింది.

రెండు తెలుగు రాష్ట్రాలలో వరద బాధితుల కోసం సినీ ప్రముఖులు భారీగా విరాళాలు ఇచ్చారు. అక్కినేని శతజయంతి ఉత్సవాల సందర్భంగా గోవా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఆయన చిత్రాలను ప్రదర్శించారు. ప్రత్యేక తపాల బిళ్లను విడుదల చేశారు. ఆయన కుటుంబ సభ్యులు 'అక్కినేని జాతీయ అవార్డ్'ను చిరంజీవికి అమితాబ్ బచ్చన్ ద్వారా అందించారు. చిరంజీవి 156 సినిమాలలో 537 పాటల్లో, 24 వేల డాన్స్ మూమెంట్స్ ఇచ్చినందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ డిసెంబర్ చివరి ఆదివారం మన్ కీ బాత్‌లో, సినిమా రంగానికి అక్కినేని సేవలను, దర్శక నిర్మాత, నటుడు రాజ్ కపూర్, ప్రముఖ గాయకుడు మహ్మద్ రఫీ, దర్శకుడు తపన్ సిన్హా శతజయంతుల సందర్భంగా స్మరించుకున్నారు. అబుదాబీలో జరిగిన ఐఫాలో చిరంజీవిని ఔట్ స్టాండింగ్ అఛీవ్ మెంట్ ఆన్ ఇండియన్ సినిమా అవార్డు, బాలకృష్ణకు గోల్డెన్ లెగసీ అవార్డ్ అందించారు.


దర్శకుల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన వీరశంకర్ ఆధ్వర్యంలో ఎల్.బి. స్టేడియంలో దర్శకుల దినోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్‌ను ఈ వేదికపై సత్కరించారు. దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియమ్‌లో అల్లు అర్జున్



నటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా జూన్ 19న బాధ్యతలను స్వీకరించారు. అల్లు అర్జున్ సినిమా 'పుష్ప-2' జాతీయ స్థాయిలో రూ. 1700 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేయగా, ఈ ఆనందకర సంఘటనలను తుడిచివేస్తూ... సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అర్జున్ ఓ రోజు జైలు జీవితం గడిపారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోక్సో యాక్ట్ కింద అరెస్ట్ అయ్యారు. నటుడు మోహన్ బాబు కుటుంబ వ్యక్తిగత కారణాలతో రచ్చకెక్కింది. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత, ఆ నేపథ్యంలో మంత్రి సురేఖ ఆయనపై చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కస్తూరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా ఆనందకర సంఘటనల కంటే... ఆవేదనకు గురిచేసే అంశాలే ఈ సారి ఎక్కువగా తెలుగు సినిమా రంగంలో చోటు చేసుకున్నాయి.

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.300/-




వెల : ₹.300/-





వెల : ₹.100/-





వెల : ₹.360/-




వెల : ₹.200/-





వెల : ₹.499/-




వెల : ₹.300/-





వెల : ₹.120/-





వెల : ₹.300/-





వెల : ₹.250/-





వెల : ₹.350/-




వెల : ₹.799/-




వెల :₹.399/-




వెల : ₹.549/-




వెల : ₹.400/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 11

GPRDCH

**G. PULLA REDDY DENTAL COLLEGE & HOSPITAL**

**(Sponsored & Managed by GUNAMPALLI PULLA REDDY CHARITIES TRUST)**

Recognized by Dental Council of India & Govt. of India
Affiliated to Dr. N.T.R. University of Health Sciences, A.P.
Accredited by NAAC-B+ Grade of UGC

D.No. 4-181/2, G.P.R.Nagar, Nandyal Road, Kurnool - 518 007.
Ph: 08518 - 274074, 273360 & Fax No. 08518 - 273360



- **The college offers under Graduation (BDS) & Post Graduation Programmes**

**Annual Intake in Post Graduation :**

**Dept. of Orthodontics and Dentofacial Orthopaedics : 3**
**Dept. of Conservative Dentistry & Endodontics : 6**
**Dept. of Prosthodontics and Crown & Bridge : 3**
**Dept. of Periodontology : 3**
**Dept. of Oral Pathology & Microbiology : 3**
**Dept. of Oral Medicine and Radiology : 2**
**Dept. of Pediatric & Preventive Dentistry : 3**

- **Highly experienced full time faculty**
- **Well equipped ultra modern sophisticated laboratories**
- **Separate Hostel Blocks for Boys & Girls**

**Sri P. SUBBA REDDY**
Chairman / Secretary
G. Pulla Reddy Educational Institutions

**Dr. Y. MURALIDHAR REDDY**
Principal
G. Pulla Reddy Dental College & Hospital